ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

జనంసాక్షి

www.janamsakshi.org

ఆదివారం 03.08.2025 | సంపుటి :12 సంచిక : 15 | పేజీలు :12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ఎన్డీయేతో ఈసీ కుమ్మక్కు

మా వద్ద ఆధారాలున్నాయి: రాహుల్

న్యూఢిల్లీ(జనంసాక్షి): మొన్నటిలోక్‌సభ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని, దానికి సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన వార్షిక న్యాయ సదస్సులో పాల్గొని ఆయన మాట్లాడారు. భారత దేశంలో ఎన్నికల సంఘం న్యాయ సమ్మతంగా పనిచేయడం లేదని ఆయన ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికలను రిగ్గింగ్ చేయవద్దు అని, 2024 లోక్‌సభ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని రాహుల్ తెలిపారు. ఆ రిగ్గింగ్‌కు చెందిన డేటా, డాక్యుమెంట్లు– తమ వద్ద ఉన్నాయన్నారు. దీన్ని మేం నిరూపిస్తామని, ఆ డేటా ఇప్పుడు ఉందని రాహుల్ పేర్కొన్నారు.ఓ లోక్‌సభ నియోజకవర్గానికి చెందిన అధ్యయనాన్ని ఆయన వెల్లడించారు. ఆ నియోజకవర్గంలో ఉన్న 6.5 లక్షల ఓటర్లలో 1.5 లక్షల ఓట్లు నకిలీ అని పేర్కొన్నారు. అలా ఫ్రాడ్ చేసి బీజేపీ అధికారంలోకి వచ్చిందని, 15 లేదా 20 సీట్లు తగ్గి ఉంటే, అప్పుడు మోదీ ప్రధాని అయ్యేవారు కాదని రాహుల్ అన్నారు. ఇండియాలో ఎన్నికల సంఘం చచ్చిపోయిందని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో రాజస్థాన్, మిగతా 2లో..

ఢిల్లీలో నిర్వహించిన కాంగ్రెస్ న్యాయసమీక్ష సదస్సులో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కరచాలనం చేస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

- లోక్‌సభ ఎన్నికల్లో భారీ రిగ్గింగ్ జరిగింది
- బీజేపీకి అనుకూలంగా ఈసీ పనితీరు
- మేము అధికారంలోకి వచ్చాక దేన్నీ వదలం
- అధికారులు రిటైరైనా పట్టుకుని శిక్షిస్తాం
- కాంగ్రెస్ న్యాయసమీక్ష సదస్సులో రాహుల్

మోదీని గద్దెదించుతాం..

రాహుల్‌ను ప్రధానిని చేస్తాం

- ఆయన కోరుకుంటే 2009లోనే ఆ పదవి దక్కేది
- వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో భాజపాకు 150 సీట్లు దాటకుండా చూస్తాం
- దళితులు, ఆదివాసీల సంక్షేమం కోసం కృషి
- సామాజిక న్యాయం కాంగ్రెస్‌కే సాధ్యం
- దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన పార్టీ కాంగ్రెస్
- పదవులను త్యాగం చేసిన ఘనత సోనియాది
- 75 ఏళ్ల నిబంధన పెట్టినా పదవి వదలని నేత మోడీ
- కాంగ్రెస్ న్యాయ సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి

న్యూఢిల్లీ(జనంసాక్షి): దళితులు, ఆదివాసీల సంక్షేమం కోసం కృషి చేస్తున్న పార్టీ కేవలం కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికల్లో రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యమని అన్నారు. దిల్లీలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ వార్షిక న్యాయ సదస్సులో ఆయన మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన పార్టీ కాంగ్రెస్ అని.. భాజపా, భారత రాష్ట్ర సమితి, జేడీ, బీజేడీ, ఆర్‌జేడీ.. ఏ పార్టీ అయినా స్వాతంత్ర్యం తర్వాతే వచ్చాయని తెలిపారు. ఇతర పార్టీలు ఎన్నికల్లో గెలిస్తే కుర్చీలో, ఓడితే ఇంట్లో కూర్చుంటాయి. ఎన్నికల్లో ఓడినా,గెలిచినా ప్రజల మిగతా 2లో..

క్రీడా పాలసీని ఆవిష్కరించిన సీఎం రేవంత్

క్రీడలపై సమగ్రవిధానం లేకపోవడం వల్లే యువత తప్పుదోవ

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

హెచ్‌ఐసీసీలో జరిగిన తెలంగాణ స్పోర్ట్స్ కాంక్లేవ్‌లో ముఖ్యమంత్రి ప్రసంగం

హైదరాబాద్(జనంసాక్షి): ప్రపంచంతో పోటీ పడాలనే స్పోర్ట్స్ పాలసీని తీసుకువస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. చదువుల్లోనే కాదు.. క్రీడల్లోనూ యువత రాణించాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడా విధానం లేకపోవడం వల్ల పట్టణ ప్రాంతాల్లోని యువత పెడదోవ పడుతున్నారని, క్రీడలను ప్రోత్సహించక పోవడం వల్లే యువత డ్రగ్స్ తీసుకుంటున్నారని సీఎం పేర్కొన్నారు. శనివారం హెచ్‌ఐసీసీలో జరిగిన తెలంగాణ స్పోర్ట్స్ కాంక్లేవ్‌లో 'తెలంగాణ స్పోర్ట్స్ పాలసీ'ని సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. దేశంలో నూతన విధానాన్ని ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రపంచంతో మిగతా 2లో..

సీఎం 50 సార్లు ఢిల్లీకి వెళ్లినా..

ప్రయోజనమేంటీ?

- తెలంగాణకు సాధించిందేమీ లేదు.. ఉత్త మాటలు తప్ప
- ప్రజలు అన్నీ గమనిస్తున్నారు
- రాష్ట్రానికి పాలించే సీఎం కావాలి కానీ, యాత్రలు చేసే టూరిస్టు కాదు: కేటీఆర్

హైదరాబాద్(జనంసాక్షి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిల్లీ పర్యటనపై భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శలు గుప్పించారు. 'ఎక్స్'లో ఒకటి నుంచి 50 వరకు అంకెలు వేసి..ఇవి కేవలం సంఖ్యలు కావు సీఎం దిల్లీ పర్యటనల వివరాలు అని పేర్కొన్నారు. హస్తిన యాత్రలో రేవంత్‌రెడ్డి అర్ధశతకం సాధించారని ఎద్దేవా చేశారు. సీఎం దిల్లీ పర్యటనల వల్ల రాష్ట్రానికి ఏం ప్రయోజనం ఉందని ప్రశ్నించారు. ''20 నెలల పదవీకాలంలో మిగతా 2లో..

పార్లమెంట్ సాక్షిగా యూరియాపై

తప్పుడు లెక్కలు

- ఖరీఫ్ కేటాయింపులు 9.80 లక్షల మెట్రిక్ టన్నులే..
- ఇప్పటికే 2.24 లక్షల మెట్రిక్ టన్నుల లోటు
- కేంద్రమంత్రి అనుప్రియా పటేల్‌కు మంత్రి తుమ్మల లేఖ

హైదరాబాద్(జనంసాక్షి): పార్లమెంట్ సాక్షిగా యూరియా సరఫరాపై తప్పుడు లెక్కలు చెప్పడం శోచనీయమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుగారు అన్నారు. రాష్ట్రానికి 9.80 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించి, పార్లమెంట్ లో మాత్రం 20.20 లక్షల మెట్రిక్ టన్నులు అందుబాటు–లో ఉందని చెప్పడం వలన రాష్ట్ర రైతులు అయోమయానికి గురయ్యే అవకాశం ఉందని మంత్రిగారు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో యూరియా మిగతా 2లో..

ప్రజ్వల్ రేవణ్ణకు

జీవిత ఖైదు

మాజీ ఎంపీకి రూ.10లక్షల జరిమానా

అత్యాచారం కేసులో బెంగళూరు ప్రజాప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానం తీర్పు

బెంగుళూరు(జనంసాక్షి): ఇంట్లో పనిమనిషిపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడిన కేసులో హాసన మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు జీవిత ఖైదు పడింది. దీంతోపాటు రూ.10లక్షల జరిమానా విధిస్తూ బెంగళూరులోని ప్రజాప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానం శిక్ష ఖరారు చేసింది. బాధితురాలికి రూ.7లక్షల పరిహారం ఇవ్వాలని ఆదేశించింది. ఇటీవల విచారణను పూర్తి చేసిన న్యాయమూర్తి సంతోశ్ గజానన హెగ్డే.. రేవణ్ణను దోషిగా తేల్చిన విషయం తెలిసిందే.అంతకుముందు ఇదే కేసులో తనకు తక్కువ శిక్ష వేయాలంటూ న్యాయమూర్తిని మాజీ ఎంపీ వేడుకున్నాడు. మిగతా 2లో..

బనకచర్లపై భారాస, టీడీపీ

మ్యాచ్ ఫిక్సింగ్

- కేటీఆర్‌తో రహస్య భేటీ తర్వాతే తెరపైకి బనకచర్ల
- ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఏపీ మంత్రుల వ్యాఖ్యలు
- బనకచర్లపై లోకేశ్‌వి అవగాహన లేని మాటలు
- మిగులు జలాల గురించి అప్పుడే ఎలా తేలుస్తారు?
- కొల్లాపూర్ పర్యటనలో డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క

కొల్లాపూర్(జనంసాక్షి): బనకచర్లపై లోకేశ్ తదితర మంత్రుల తీరుపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. అసలు జలాలకే మోక్షం లేదంటే ఇక మిగులు జలాలు ఎక్కడివని అన్నారు. తెలంగాణ వినియోగించుకోగా వచ్చిన నీళ్లు వాడుకుంటామని అంటున్నారని, అది ఇప్పట్లో సాధ్యం కాదన్నారు. పోలవరం లాంటి ప్రాజెక్టును పూర్తి చేయలేక పోతున్నారని అంటూ..ముందు దాని సంగతి చూడాలన్నారు. ఎపి మంత్రులు బనకచర్ల విషయంలో చేస్తున్న ప్రకటనలు వాస్తవ విరుద్ధమన్నారు, ఇకపోతే కెటిఆర్ లోకేశ్ కలిసిన తరవాతనే లోకేశ్ బనకచర్ల గురించి మాట్లాడుతున్నారని అన్నారు. ఈ ఇద్దరి మధ్య చీకట్లో ఏ ఒప్పందం కుదరిందో చెప్పాన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు ఈ ప్రభుత్వం వడ్డీలు కడుతోందని డిప్యూటీ– సీఎం భట్టి విక్రమార్క అన్నారు. పదేళ్లు రాష్ట్రాన్ని మిగతా 2లో..

మంత్రి సురేఖపై

క్రిమినల్ కేసు

కేటీఆర్ పరువునష్టం కేసులో నాంపల్లి కోర్టు ఆదేశం

హైదరాబాద్(జనంసాక్షి): మంత్రి కొండా సురేఖకు నాంపల్లి కోర్టు షాక్ ఇచ్చింది. మంత్రిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆదేశించింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు దాఖలు చేసిన పరువు నష్టం కేసులో కోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఫోన్ ట్యాంపింగ్, డ్రగ్స్, టాలీవుడ్ హీరోయిన్ సమంత విడాకుల వ్యవహారంలో కొండా సురేఖ ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు కేటీఆర్ మిగతా 2లో..

సొంత లాభం కోసం లక్షకోట్లు వృథా చేసిన కేసీఆర్

- కాళేశ్వరం కేసులో మొదటి దోషి ఆయనే..
- కమిషన్ విచారణలో అదే తేలింది
- అందుకు మూల్యం చెల్లించక తప్పదు
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

సంగారెడ్డిప్రతినిధి(జనంసాక్షి): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ షాకింగ్ కామెంట్స్ చేశారు. కేసీఆర్ దోషి అని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ చెప్పిందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో లక్షల కోట్ల రూపాయలు వృథా చేసి తెలంగాణను కేసీఆర్ అప్పులపాలు చేశారని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తేల్చి చెప్పిందని అన్నారు. పాదయాత్రలో భాగంగా శనివారం ఆం దోలు మండలం సంగుపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి దామోదర మిగతా 12లో..

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణలో

నా ఓటు గల్లంతయ్యింది

ఆర్జేడీ నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్

పాట్నా(జనంసాక్షి): బిహార్ శాసనసభ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా ముసాయిదాను ఎన్నికల సంఘం శుక్రవారం ప్రచురించిన సంగతి తెలిసిందే. దీనిపై మిగతా 12లో..

బీసీ రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్

రాజకీయాలు చేస్తోంది

- 42శాతం రిజర్వేషన్లు అమలు చేసి చూపాలి
- భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు
- ఢిల్లీలో రేవంత్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారు
- బీసీ జనాభా సేకరణను కాంగ్రెస్ గతంలో ఎందుకు చేయలేదు?: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): రిజర్వేషన్‌లు అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం, బీజేపీపై బట్టకాల్చి మీద వేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తున్నదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఇది బీసీ రిజర్వేషన్ల కోసం కాదని.. ముస్లింలకు మేలు చేసేదని విమర్శించారు. గతంలో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన రాష్ట్రం తెలంగాణ అని ఉద్ఘాటించారు. ఇందిరాపార్క్ వద్ద జరిగిన ధర్నాలో కాంగ్రెస్ ప్రభుత్వం, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మిగతా 2లో..

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు కార్పొరేట్ స్థాయిలో

శాశ్వత భవనాలు

- నాలుగు జిల్లాల్లో 9 ఇంటిగ్రేటెడ్ భవనాల నిర్మాణం
- గచ్చిబౌలిలో భవన శంకుస్థాపనకు ఏర్పాట్లు : మంత్రి పొంగులేటి

హైదరాబాద్(జనంసాక్షి): ఇప్పటికే స్లాట్ బుకింగ్ విధానాన్ని తీసుకువచ్చి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్న స్టాంప్స్ రిజిస్ట్రేషన్ శాఖ మరో అడుగు ముందుకేసింది. ప్రజలకు మరింత సమర్థవంతంగా పారదర్శకంగా ఒకే చోట సేవలను అందించడానికి వీలుగా సబ్–రిజిస్ట్రార్ కార్యాలయాలను పునర్వ్యవస్థీ కరించడంతో పాటు– కార్పొరేట్ స్థాయిలో అత్యాధునిక సౌకర్యాలతో కార్యాలయాలను నిర్మించాలని నిర్ణయించింది. దీనిపై డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో రెవెన్యూ, హౌసింగ్, సమాచార మరియు

పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం రెవెన్యూ కార్యదర్శి డి.ఎస్.లోకేశ్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజి రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా మిగతా 2లో..

ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా అవతరిస్తున్నాం

ట్రంప్ 'డెడ్ ఎకానమీ' కామెంట్లకు ప్రధాని మోదీ కౌంటర్

వారణాసి(జనంసాక్షి): భారత ఆర్థిక వ్యవస్థపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర కలకలం రేపిన సంగతి తెలిసిందే. భారత్, రష్యా బంధంపై విరుచుకుపడే క్రమంలో..ఇరుదేశాలవీ 'డెడ్ ఎకానమీ' అంటూ వ్యాఖ్యానించారాయన. అయితే తాజాగా ఈ వ్యాఖ్యలకు భారత ప్రధాని నరేంద్ర మోదీ కౌంటర్ ఇచ్చారు.ట్రంప్ 'డెడ్ ఎకానమీ' వ్యాఖ్యలకు భారత ప్రధాని నరేంద్ర మోదీ పరోక్షంగా కౌంటర్ ఇచ్చారు. భారత ఆర్థిక వ్యవస్థ బలమైందని.. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా అవతరించే క్రమంలో ఉందని అన్నారాయన. శనివారం యూపీ వారణాసిలో జరిగిన పీఎం కిసాన్ సమ్మాన్ నిధుల విడుదల కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ..' 'భారత ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం బలంగా, నిలకడగా ఉంది. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ ఎదిగేందుకు సిద్ధంగా ఉంది. ప్రస్తుత జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆర్థిక గందరగోళం నెలకొంది (పరోక్షంగా ట్రంప్ టారిఫ్‌ల నిర్ణయాన్ని ప్రస్తావించి). అన్ని దేశాలు తమ తమ ప్రయోజనాలపై దృష్టిసారించాయి. భారత్ మిగతా 9లో..

రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు

ఆపేసినట్లు తెలుస్తోంది

- ఆ విషయం నావరకు వచ్చింది
- అది నిజమా..?కాదా..? అనేది నాకు తెలియదు
- మరోసారి ట్రంప్ అనుచిత వ్యాఖ్యలు
- లేదు.. కొనుగోళ్లు యథావిధిగా జరుగుతున్నాయి
- ఆయన మాటల్లో వాస్తవం లేదు
- భారత ప్రభుత్వ వర్గాల ధీటైన సమాధానం



వాషింగ్టన్(జనంసాక్షి): రష్యా నుంచి చమురు దిగుమతులపై ట్రంప్ ఓర్వలేని తనాన్ని ప్రదర్శిస్తున్నారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం తన స్పష్టమైన వైఖరిని వెల్లడించినప్పటికీ.. రష్యా చమురును భారత్ కొనుగోలు మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
03.08.2025

క్రీడా పాలసీని ఆవిష్కరించిన సీఎం రేవంత్

పోటీపడే మనం.. క్రీడల్లో వెనకబడి ఉండడం బాగాలేదన్నారు. భారత్‌కు బలమైన క్రీడా వేదిక కావాలని.. అందులో తెలంగాణ ప్రధానంగా ఉండాలని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.ఫస్ట్ ఎడిషన్ ఆఫ్ తెలంగాణ స్పోర్ట్స్ కాంక్లేవ్ సభలో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు సీఎం రేవంత్. డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపుతున్నామని.. యువతకు దశ దిశా లేకపోవడం బాధాకరమని అన్నారు. వ్యసనాల రూపంలో మనవైపు వేగంగా ప్రమాదం దూసుకొస్తుందని అన్నారు. ఓ విధానం లేకపోవడం వల్లే సమస్యలు వస్తున్నాయని.. అందుకే నూతన క్రీడావిధానాన్ని తీసుకొస్తున్నామని అన్నారు. క్రీడల్లో రాజకీయ జోక్యం ఉండకూడదని భావిస్తున్నామని అన్నారు. తెలంగాణ రైజింగ్ 2047 పై స్పోర్ట్స్ చాప్టర్ పెడతామని అన్నారు. 1956లో ఫుట్ బాల్ టీంలో మనవాళ్ళు 9 మంది ఉండేవారని.. క్రీడల్లో హైదరాబాద్ కు మంచి పేరు ఉండేదని అన్నారు. జాతీయ అంతర్జాతీయ క్రీడల్లో రాణించినవారిని ప్రోత్సహిస్తున్నామని అన్నారు. చదువుల్లోనే కాదు, క్రీడల్లోనూ రాణిస్తే ఉద్యోగం ఇస్తామని అన్నారు. గ్రామీణ ప్రాంతంలో క్రీడా నైపుణ్యానికి కొదవ లేదని అన్నారు. ఇప్పుడు స్టేడియంలు ఫంక్షన్ హాల్స్ గా మారాయని అన్నారు. ఒలంపిక్స్ లో ఒక్క గోల్డ్ మెడల్ కూడా రాకపోవడం సిగ్గు అనిపిస్తోందని అన్నారు.మనకంటే చాలా చిన్న దేశాలు క్రీడల్లో రాణిస్తున్నాయని అన్నారు. ఇటీ-వల సౌత్ కొరియాను సందర్సించామని.. అక్కడ స్పోర్ట్స్ వర్సిటీలో చదివినోళ్లే గోల్డ్ మెడల్స్ కొట్టారని అన్నారు.చైతన్యానికి పోరాటానికి మారుపేరైన తెలంగాణ ఉద్యమంలో ముందు వరుసలో నిలబడి పోరాటం చేసిన యువత నేడు దశ దిశా లేకుండా.. ప్రభుత్వాలకు సరైన విధానాలు లేకపోవడం వల్ల వ్యసనాల వైపు వేగంగా ప్రయాణిస్తున్నారని అన్నారు. పోరాట స్ఫూర్తి, చైతన్యం ఉన్న ఈ ప్రాంతం క్రీడల్లో రాణించాలని, దేశానికి గొప్ప పేరు తేవాలనే ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్రానికి క్రీడావిధానం ఉండాలని, క్రీడా విధానంలో రాజకీయ జోక్యం తగ్గించాలని, క్రీడాకారుల స్ఫూర్తిని పెంచాలని పబ్లిక్ ప్రైవేట్ పార్టర్ షిప్ తో నూతన క్రీడా విధానాన్ని తీసుకొస్తున్నామని అన్నారు.

మంత్రి సురేఖపై క్రిమినల్ కేసు

కోర్టును ఆశ్రయించారు. కేటీఆర్‌పై నిరాధార ఆరోపణలు చేసిన మంత్రి సురేఖపై చర్యలు తీసుకోవాలంటూ పోలీసులను నాంపల్లి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ప్రాథమిక సాక్ష్యాలను పరిశీలించిన నేపథ్యంలో కొండా సురేఖపై ఆగస్టు 21లోగా క్రిమినల్ కేసు నమోదు చేసి నిందితురాలికి నోటీసు జారీ చేయాలని స్పష్టం చేసింది. కేటీఆర్‌పైన మంత్రి నిరాధారమైన ఆరోపణలు చేశారంటూ కేటీఆర్ తరఫున న్యాయవాది వాదనలతో కోర్టు ఏకీభవించింది. ఫిర్యాదుతోపాటు సాక్ష్యుల వాంగ్మూలాలు, డాక్యుమెంట్స్‌ను పరిశీలించిన తర్వాత ఆదేశాలు జారీ చేసింది.నిందితురాలు కొండా సురేఖపై ప్రాథమిక కేసు ఉన్నట్లు నాంపల్లి కోర్టు గుర్తించింది.

ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం

కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా ఉంటాం

ఏఐసీసీ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్

సంగారెడ్డి ప్రతినిధి, ఆగస్టు 2(జనంసాక్షి):

ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ పేర్కొన్నారు.జనహిత పాదయాత్ర లో భాగంగా శనివారం సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆందోల్ లోని సంగుపేట లక్ష్మి గార్డెన్స్ లో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ , టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ , రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహా పాల్గొన్నారు. ముందుగా నియోజ కవర్గం లోని ముఖ్యనాయకుల అభిప్రాయాలను అడిగి తెలుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు.ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందిన లబ్ధిదారుల వివరాలు కార్యకర్తల దగ్గర ఉండాలని సూచించారు.ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి , సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు.42 శాతం బీసీ రిజర్వేషన్లను అమలు కు కేంద్ర ప్రభుత్వం పై వత్తిడి చేస్తున్నాంమని వారు అన్నారు.రైతు రుణ మాఫీ , రైతు భరోసా , గృహజ్యోతి , గ్యాస్ సబ్సిడీ , ఇందిరమ్మ ఇండ్లు , మహిళలకు వడ్డీ లేని రుణాలు , ముఖ్యమంత్రి సహాయనిధి , ఎల్ వో సి ల ద్వారా లబ్ధిపొందిన వారి వివరాలు ఇందిరమ్మ కమిటీ , గ్రామా కమిటీ లు నిరంతరం లబ్దిదారులతో సంబంధాలు పెంచుకోవాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు సమన్వయము చేసుకోని మంచి ఫలితాలు సాధించాలని దిశానిర్దేశం చేశారు.జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ , నారాయణఖేడ్ ఎమ్మెల్యే డా. సంజీవ రెడ్డి , మాజీ మంత్రి చంద్రశేఖర్ , సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి , కాటా శ్రీనివాస్ గౌడ్, త్రిష రాజనర్సింహా , చైర్మన్ గిరిధర్ రెడ్డి , ఉజ్వల్ రెడ్డి , ఆవుల రాజి రెడ్డి , గ్రంధాలయ సంస్థ చైర్మన్ లు అంజయ్య , సుహాసిని రెడ్డి , పీసీసీ ఉపాధ్యక్షులు సంగమేశ్వర్ , సురేందర్ గౌడ్ లు పాల్గొన్నారు.

రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు ఆపేసినట్లు తెలుస్తోంది

చేయదని ట్రంప్ మరోసారి వ్యాఖ్యలు చేశారు. వీటికి కూడా కౌంటర్ వచ్చింది.“ఇకపై రష్యా ఆయిల్‌ను భారత ప్రభుత్వం కొనుగోలు చేయదన్న విషయం నావరకు వచ్చింది. అది నిజమా..?కాదా..? అనేది నాకు తెలియదు. అది మంచి నిర్ణయమే అయితే ఏం జరుగుతుందో చూద్దాం” అని ట్రంప్ వ్యాఖ్యానించారు. దీనిపై ప్రభుత్వ వర్గాల నుంచి దీటైన స్పందన వచ్చింది. “భారత చమురు సంస్థలు రష్యా సరఫరాదారుల నుంచి కొనుగోళ్లు కొనసాగిస్తున్నాయి. ధర, రవాణా, ఇతర ఆర్థిక అంశాల ఆధారాలు ఇక్కడ కీలకంగా ఉంటాయి. భారత్ 85 శాతం ఇంధనం దిగుమతి చేసుకుంటోంది. సవాళ్లతో కూడిన పరిస్థితుల్లో మూడో అతిపెద్ద వినియోదారుగా ఉన్న భారత్.. అంతర్జాతీయ నిబంధనలకు పూర్తిగా కట్టుబడి.. అందుబాటు ధరల్లో లభ్యమయ్యే చమురు కొనుగోలును కొనసాగిస్తుంది. దేశ ఇంధన నిర్ణయాలు జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా ఉంటాయి. అదే సమయంలో ఆ కొనుగోళ్లు అంతర్జాతీయ ఇంధన స్థిరత్వానికి, సమతుల్యతకు కూడా సానుకూలంగా దోహదం చేస్తున్నాయి “ అని స్పష్టం చేశాయి. రష్యా నుంచి భారత్ చమురు కొనడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసిన ట్రంప్ ఆ రెండు దేశాలవి పతనమైన ఆర్థిక వ్యవస్థలని విమర్శించారు. మరోవైపు భారత్ చమురు కొనడం వల్లే ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధాన్ని కొనసాగించగలుగుతోందని అమెరికా విదేశాంగశాఖ మంత్రి మార్కో రుబియో పేర్కొన్నారు. ఆంక్షల వల్ల అక్కడ చమురు చౌకగా లభిస్తోందని, దురదృష్టవశాత్తూ అదే యుద్ధంలో రష్యా మనుగడకు ఉపయోగపడుతోందన్నారు. దీనిపై ఇప్పటికే భారత విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ స్పందిస్తూ.. రష్యా నుంచి చమురు కొనుగోలుకు కట్టుబడి ఉన్నామన్నారు. దేశ ఇంధన ప్రయోజనాలను కాపాడుకోవడంలో భాగంగా అంతర్జాతీయ మార్కెట్లో అత్యుత్తమంగా ఉన్న వాటిని ఎంపిక చేసుకుంటూ ముందుకువెళ్తామన్నారు.

ఏన్డీయేతో ఈసీ కుమ్మక్కు

మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఒక్క సీటు- గెలవలేదని, నాకు ఆశ్చర్యం వేసిందని, ఎప్పుడైనా ఎన్నికల అవకతవకల గురించి మాట్లాడితే ఆధారాలు అడుగుతున్నారని రాహుల్ అన్నారు. అయితే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల వేళ ఆ మార్పు కనిపించిందని, లోక్‌సభకు.. విధానసభకు ఎన్నికల జరిగిన సమయంలో కొత్తగా కోటి ఓటర్లు జత కలిశారని, దాంట్లో ఎక్కువ శాతం ఓట్లు బీజేపీకి వెళ్లాయని, అందుకే తన వద్ద ఆధారాలు ఉన్నట్లు చెబుతున్నాని రాహుల్ పేర్కొన్నారు.ఈ క్రమంలో మరోమారు భారత ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ రాహుల్ గాంధీమరోసారి విరుచుకుపడ్డారు. దేశంలో ఎన్నికల వ్యవస్థ పూర్తిగా కూలిపోయిందని అన్నారు. ఎన్నికల్లో భారత ప్రధాని నరేంద్ర మోదీ చాలా తక్కువ మెజారిటీతో మూడోసారి ప్రధానిగా గెలుపొందారని అన్నారు. భాజపాకు ప్రయోజనం చేకూర్చడానికి ఎన్నికల సంఘం ఓట్ల దొంగతనంలో పాలుపంచుకుందని ఆరోపించారు. 2014 నుంచి ఏదో తప్పు జరుగుతోందని తనకు అనిపిస్తోందని.. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల పైనా అనుమానాలు ఉన్నాయని రాహుల్ అన్నారు.ఎన్నికల దుర్వినియోగానికి సంబంధించిన అన్ని ఆధారాలు తమవద్ద ఉన్నాయని.. లోక్‌సభ ఎన్నికల్లో రిగ్గింగ్ ఎలా జరిగిందనే విషయాన్ని త్వరలోనే తాము ప్రజల ముందు నిరూపిస్తామని పేర్కొన్నారు. తాము బయటపెట్టే నిజంతో ఈసీ (ఊఈ) పునాదులు కదిలిపోతాయన్నారు. ఓట్ల కుంభకోణంలో పాల్గొన్న ఎన్నికల కమిషన్ అధికారులు పదవీవిరమణ చేసినా కూడా వారిని వదలమని హెచ్చరించారు. భాజపా కోసం ఈసీ ఓట్ల చోరీకి పాల్పడుతోందని ఆరోపించిన ఆయన.. దాన్ని రుజువు చేసేందుకు తమవద్ద అణుబాంబు లాంటి ఆధారాలున్నాయని అన్నారు. కాగా ఈ ఆరోపణలను ఈసీ తీవ్రంగా ఖండించింది. అవన్నీ నిరాధార ఆరోపణలేనని.. రాహుల్ లాంటి వారు చేస్తోన్న బాధ్యతారాహిత్య వ్యాఖ్యలను పట్టించుకోనక్కర్లేదని తెలిపింది.

పార్లమెంట్ సాక్షిగా యూరియాపై తప్పుడు లెక్కలు

పరిస్థితులపై కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ సహాయమంత్రి అనుప్రియ పటేల్ గారికి కేంద్ర రసాయనాలు మరియు ఎరువుల విభాగం రాష్ట్రానికి కేటాయించిన ఎరువుల లేఖను జతపరిచి మంత్రి తుమ్మల లేఖ రాశారు. ఖరీఫ్ 2025 కోసం రాష్ట్రానికి కేవలం 9.80 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కేటాయించిందని, కేటాయించిన దానిలో కూడా నెలవారి సరఫరా చేయాల్సిన దానికంటే తక్కువగా సరఫరా చేయడం వలన రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడిందని లేఖలో పేర్కొన్నారు. ఎప్రిల్ నుండి జులై వరకు కేటాయింపుల ప్రకారం 6.60 లక్షల మెట్రిక్ టన్నుల సరఫరా చేయాల్సి ఉండగా, కేంద్రం 4.36 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేసిందని, దీంతో రాష్ట్రంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కేవలం తెలంగాణ రాష్ట్రంలోనే కాకుండా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ లో కూడా ఈ పరిస్థితులు ఉన్నాయని గుర్తుచేశారు. యూరియా కొరతపై రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జెపి నడ్డాగారికి లేఖలు కూడా రాయడం జరిగిందని లేఖలో పేర్కొన్నారు. పార్లమెంట్ లాంటి వేదికలలో కూడా తప్పుడు లెక్కలు సమర్పించడం రాష్ట్రాల ప్రయోజనాలను దెబ్బతీస్తుందని, జులై మాసం వరకు కేటాయింపుల ప్రకారం సరఫరా కాని 2.24 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కలుపుకొని, ఆగస్టు నెలకు కేటాయించిన యూరియాను త్వరగా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని మంత్రిగారు లేఖలో కోరారు.

మోదీని గద్దెదించుతాం.. రాహుల్‌ను ప్రధానిని చేస్తాం

మధ్యే ఉన్న ఏకైక పార్టీ కాంగ్రెస్ అన్నారు. మోదీ నేతృత్వంలో రాజ్యాంగం ప్రమాదంలో ఉందని,11 ఏళ్లుగా సామాజిక న్యాయం కోసం ఆలోచించ లేదని అన్నారు. వక్రమార్గంలో ఉన్న నేతలను రెండు చెంపదెబ్బలు కొట్టయినా దారిలోకి తెచ్చేందకు కాంగ్రెస్ కృషి చేస్తోంది. మా పార్టీ దేశానికి ఏం చేసిందని విమర్శిస్తున్నారు. 140 ఏళ్ల క్రితం దేశ ప్రజల స్వాతంత్ర్యం కోసం కదం తొక్కింది. ఆంగ్లేయులను ఓడించింది. భారత్ నుంచి ఉగ్రవాదులను పారద్రోలేందుకు ఇందిరాగాంధీ కృషి చేశారు. దేశం కోసం ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ అమరులయ్యారు. యూపీఏ-1 సమయంలో సోనియాగాంధీ ప్రధాని కావాలని అందరూ కోరారు. కానీ, ప్రధాని పదవిని ఆమె త్యాగం చేశారు. 2004లోనే రాహుల్‌గాంధీ కేంద్ర మంత్రి అయ్యేవారు. ఆయన కోరుకుంటే 2009లోనే ప్రధాని అయ్యేవారు. కానీ ప్రధాని, కేంద్ర మంత్రి పదవులు పార్టీ సీనియర్ నేతలకు ఇచ్చారు. కార్యకర్తగానే ప్రజల కోసం రాహుల్‌గాంధీ పనిచేశారు. సామాజిక న్యాయం కోసం 25 ఏళ్లుగా పోరాడుతున్నారు. మరోవైపు నరేంద్ర మోదీ 25 ఏళ్లుగా కుర్చీ వదలట్లేదు. 2001లో సీఎం అయిననప్పటి నుంచి ఆయన కుర్చీలోనే ఉన్నారు. భాజపా సంఘ్ పరివార్ మోదీని తప్పించేందుకు ప్రయత్నించింది. కానీ అందుకు ఆయన రాజీ పడలేదు. 75 ఏళ్లు దాటిన వ్యక్తులు కుర్చీ వీడాలని మోహన్ భగవత్ చెప్పారు. కానీ 75 ఏళ్లు దాటినా.. మోదీ అందుకు సిద్ధంగా లేదు. ఇదే నిబంధనతో అడ్వాణీ, మనోహర్ జోషిని తప్పించారు. మోదీని సీఎం పదవి నుంచి తప్పించేందుకు గతంలో వాజ్‌పేయీ, ప్రధాని పదవి నుంచి తప్పించేందుకు మోహన్ భాగవత్ ప్రయత్నించారు. ఆయన్ను తప్పించడం వారి వల్ల కాలేదు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మోదీకి వ్యతిరేకంగా రాహుల్‌గాంధీ పోరాటం విజయవంతం కాబోతుందని అన్నారు. దేశంలో సామాజిక న్యాయం, దళితులు, ఆదివాసీల సంక్షేమం కోసం కృషి చేసింది కాంగ్రెస్ పార్టీ అని, రేవంత్ రెడ్డి కొనియాడారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో రాజ్యాంగం ప్రమాదంలో ఉందని, 11 ఏళ్లుగా సామాజిక న్యాయం కోసం ఆలోచించడంలేదని, దేశానికి మార్గదర్శనం కోసం మనుసింఘ్వి నేతృత్వంలో సదస్సు నిర్వహించడం గొప్పవిషయమన్నారు. సామాజిక న్యాయాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కార్యాచరణ చేస్తున్నామన్నారు. తెలంగాణ ప్రజల పక్షాన చెబుతున్నా.. రాహుల్ గాంధీని భారత ప్రధానిని చేసి తీరుతామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గతంలో దేశానికి ప్రధాని అయ్యే ఛాన్స్ వచ్చిన రాహుల్ గాంధీ వదులుకున్నారని.. కానీ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుంది రాహుల్ గాంధీ దేశ ప్రధాని అవుతారని జోస్యం చెప్పారు. మోదీని ప్రధాని గద్దె మీద నుంచి కిందకు దించడం ఒక్క రాహుల్ గాంధీకే సాధ్యమన్నారు. మోడీని తరిమికొట్టి భారత రాజ్యాంగాన్ని రక్షిస్తామని పేర్కొన్నారు. మోడీని ఓడిస్తాం.. భారత రాజ్యాంగాన్ని కాపాడుకుంటామన్నారు. మాది ఎప్పటికీ ప్రజల పక్షమేనన్నారు. పాకిస్తాన్ ను ఇందిరా గాంధీ రెండు ముక్కలు చేశారు. తీవ్రవాదంపై పోరాటం చేసి దేశం కోసం ప్రాణత్యాగం చేసిన గొప్ప వ్యక్తులు ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ అని కొనియాడారు. 2004లోనే రాహుల్‌గాంధీ కేంద్ర మంత్రి అయ్యేవారు. ఆయన కోరుకుంటే 2009లోనే ప్రధాని అయ్యేవారు. కానీ ప్రధాని, కేంద్ర మంత్రి పదవులు పార్టీ సీనియర్ నేతలకు ఇచ్చారు. కార్యకర్తగానే ప్రజల కోసం రాహుల్‌గాంధీ పనిచేశారు. సామాజిక న్యాయం కోసం 25 ఏళ్లుగా పోరాడుతున్నారు. మరోవైపు నరేంద్ర మోదీ 25 ఏళ్లుగా కుర్చీ వదలట్లేదు. 2001లో సీఎం అయిననప్పటి నుంచి ఆయన కుర్చీలోనే ఉన్నారు. భాజపా సంఘ్ పరివార్ మోదీని తప్పించేందుకు ప్రయత్నించింది. కానీ అందుకు ఆయన రాజీ పడలేదు. 75 ఏళ్లు దాటిన వ్యక్తులు కుర్చీ వీడాలని మోహన్ భగవత్ చెప్పారు. కానీ 75 ఏళ్లు దాటినా.. మోదీ అందుకు సిద్ధంగా లేదు. ఇదే నిబంధనతో అడ్వాణీ, మనోహర్ జోషిని తప్పించారు. మోదీని సీఎం పదవి నుంచి తప్పించేందుకు గతంలో వాజ్‌పేయీ, ప్రధాని పదవి నుంచి తప్పించేందుకు మోహన్ భాగవత్ ప్రయత్నించారు. ఆయన్ను తప్పించడం వారి వల్ల కాలేదు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మోదీకి వ్యతిరేకంగా రాహుల్‌గాంధీ పోరాడతారు. భాజపాకు 150 సీట్లు దాటకుండా చూస్తాం” అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డి 50సార్లు ఢిల్లీకి వెళ్లినా ప్రయోజనమేంటీ?

రేవంత్‌రెడ్డి 50 సార్లు దిల్లీకి వెళ్లారు.తెలంగాణకు సాధించిందేమీ లేదు.. ఉత్త మాటలు తప్ప. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. రాష్ట్రానికి పాలించే ముఖ్యమంత్రి కావాలి కానీ, దిల్లీ యాత్రలు చేసే టూరిస్టు సీఎం కాదు” అని అని కేటీఆర్ విమర్శించారు.

ప్రజ్వల్ రేవణ్ణకు జీవిత ఖైదు

ఆ సమయంలో అతడు బిగ్గరగా ఏడ్చాడు. ఆగస్టు 1న తీర్పు ప్రకటించిన తర్వాత కూడా ప్రజ్వల్ కన్నీరుమున్నీరుగా విలపించాడు. న్యాయస్థానం నుంచి బయటకు వచ్చిన అనంతరమూ వెక్కివెక్కి ఏడ్చాడు.కేఆర్ నగరకు చెందిన మహిళ 2024 ఏప్రిల్ 28న హొళెనరసీపుర ఠాణాలో ప్రజ్వల్ రేవణ్ణపై ఫిర్యాదు చేయడంతో ఆయనపై అత్యాచారం కేసు నమోదు చేసింది. గన్నిగడ ఫాంహౌస్‌లో తనపై అత్యాచారం జరిగిందని బాధితురాలు (47) తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం మరికొన్ని అత్యాచార కేసులు ప్రజ్వల్‌పై నమోదయ్యాయి. ఈ కేసు విచారణలో భాగంగా 14 నెలలుగా ప్రజ్వల్ కారాగారంలో విచారణ ఖైదీగా ఉండగా తాజాగా శిక్ష ఖరారైంది.అంతకుముందు ఇంట్లో పనిమనిషిపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడినట్లు నమోదైన కేసులో హాసన మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ దోషిగా తేలిన సంగతి తెలిసిందే.నేడు ఆయనకు శిక్ష ఖరారు కానుంది. ఈ నేపథ్యంలో ప్రజ్వల్ బిగ్గరగా ఏడ్చేశాడు. మధ్యాహ్నం 2.45 గంటలకు బెంగళూరులోని ప్రజాప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానం శిక్ష ఖరారు చేయనుంది. ఈక్రమంలో తనకు తక్కువ శిక్ష వేయాలంటూ న్యాయమూర్తిని మాజీ ఎంపీ వేడుకున్నాడు. ఆ సమయంలో అతడు బిగ్గరగా ఏడ్చాడు న్యాయస్థానం నుంచి బయటకు వచ్చిన అనంతరమూ వెక్కివెక్కి ఏడ్చాడు. కేఆర్ నగరకు చెందిన మహిళ 2024 ఏప్రిల్ 28న హొళెనరసీపుర ఠాణాలో అత్యాచారం కేసు నమోదు చేసింది. గన్నిగడ ఫాంహౌస్‌లో తనపై అత్యాచారం జరిగిందని బాధితురాలు (47) తన ఫిర్యాదులో పేర్కొంది. అనంతరం మరికొన్ని అత్యాచార కేసులు ప్రజ్వల్‌పై నమోదయ్యాయి. ఈ కేసు విచారణలో భాగంగా 14 నెలలుగా ప్రజ్వల్ కారాగారంలో విచారణ ఖైదీగా ఉన్నాడు. ప్రజ్వల్ మొబైల్ ఫోన్‌లో 2,000కు పైగా వీడియోలు ఉన్నాయని దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఆ వీడియోలన్నింటినీ ప్రజ్వల్ స్వయంగా రికార్డు చేసుకున్నట్లు కూడా దర్యాప్తులో తేలింది. గత లోక్‌సభ ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ పూర్తయిన వెంటనే అత్యాచార ఘటనలు బయటపడ్డాయి. ఫలితాలు వచ్చే సరికి ప్రజ్వల్ విదేశాలకు వెళ్లిపోగా.. కుటుంబసభ్యుల హెచ్చరికతో చివరకు పోలీసుల ఎదుట లొంగిపోయారు. అత్యాచార బాధితురాలిని అపహరించిన ఆరోపణలపై ప్రజ్వల్ తల్లి భవానీ పైనా, పనిమనిషిని లైంగికంగా వేధించిన ఆరోపణలపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే రేవణ్ణల పైనా కేసులు నమోదయ్యాయి.

బనకచర్లపై భారాస, టీడీపీ మ్యాచ్ ఫిక్సింగ్

పాలించిన బిఆర్ఎస్ ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేదన్నారు. కనీసం గతంలో కాంగ్రెస్ శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులను కూడా ఆ పార్టీ పూర్తి చేయలే కపోయిందని ఎద్దేవా చేశారు. కొల్లాపూర్ నియోజక వర్గంలో పలు అభివృద్ధి పనులకు డిప్యూటీ- సీఎం శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు- చేసిన సభలో మాట్లాడిన ఆయన.. గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కృష్ణా నదిపై గత ప్రభుత్వం ఒక్క ప్రాజెక్టు కూడా ఎందుకు కట్టలేదన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదు. ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. తెలంగాణ నిర్మించే ప్రాజెక్టుల నిర్మాణాలు పూర్తయిన తర్వాత బనకచర్ల కట్టుకోవచ్చు న్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు ఏపీ మంత్రులు మాట్లాడకూడదన్నారు. తెలంగాణకు ద్రోహం చేసింది.. భారత రాష్ట్ర సమితని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ దిల్లీ వెళ్లారు కాబట్టే బనకచర్ల ప్రాజెక్టు ఆగిందన్నారు. ఏపీ మంత్రి లోకేశ్ తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు చేయకూడదన్నారు. మిగులు జలాలు ఉంటేకదా బనకచర్ల గురించి మాట్లాడాలన్నారు. 2 లక్షల ఎకరాలు మునిగిపోకుండా పోలవరం కట్టుకో వచ్చు. ముంపు గ్రామాల ప్రజల తరపున పోరాడేం దుకు మేం సిద్ధంగా ఉన్నామని డిప్యూటి సిఎం అన్నారు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు కార్పొరేట్ స్థాయిలో శాశ్వత భవనాలు

ప్రజలకు అసౌకర్యం కలగకుండా, పరిపాలనకు ఇబ్బంది లేకుండా సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల పునర్వ్యవస్థీకరణ, కొత్త బిల్డింగ్ల నిర్మాణం ఉండాలని అధికారులకు సూచించారు. అంతిమంగా ప్రజల సంతృప్తే ప్రధానమనే అంశాన్ని దృష్టిలో పెట్టు-కొని పునర్వ్యవస్థీకరణ చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా వాటిలో 37 మాత్రమే సొంత భవనంలో ఉన్నాయని మిగిలినవన్నీ అద్దె భవనాలలోనే కొనసాగుతున్నాయని ఈ పరిస్థితిని మార్చడానికి అన్ని సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలను కార్పొరేట్ స్థాయిలో ఆధునిక సౌకర్యాలతో దశలవారీగా నిర్మించాలన్న ఆలోచన చేస్తున్నామని తెలిపారు. మొదటి విడతలో ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో నాలుగు లేదా ఐదు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టు-కొని ఒకే చోట ఇంటిగ్రే-టె-డ్ కార్యాలయాన్ని నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. హైదరాబాద్ జిల్లాలో 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు గాను రెండు చోట్ల, రంగారెడ్డి జిల్లాలో 14కు గాను మూడు చోట్ల , మేడ్చల్ జిల్లాలో 12కు గాను మూడు చోట్ల, సంగారెడ్డి , పఠాన్‌చెరువు కలపి ఒకటి మొత్తం తొమ్మిది ప్రాంతాల్లో అత్యాధునిక వసతులతో కార్పొరేట్ స్థాయిలో ఇంటిగ్రే-టె-డ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల భవనాలను నిర్మించాలని నిర్ణయించినట్లు- వెల్లడించారు. ఆయా జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకొని ఇందుకు అవసరమైన భూమిని గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల వల్ల పనితీరు మెరుగుపడడమే కాకుండా పర్యవేక్షణ సులభమవుతుందని అవినీతిని కూడా తగ్గించవచ్చని, కార్యాలయాల మధ్య పనిభారం సమానంగా ఉండడంతో పాటు- దస్త్రాల ప్రాసెసింగ్ వేగవంతం అవుతుందన్నారు. మొదటగా హైదరాబాద్‌లోని గండిపేట, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, బాలానగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను, గచ్చిబౌలిలోని తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ కార్యాలయంలో ఇంటిగ్రేటెడ్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంగా నిర్మిస్తున్నామని తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారితో చర్చించి ఈ బిల్డింగ్ నమూనాకు తుది రూపునిస్తామని, వీలైనంత త్వరితగతిన ఈ భవనానికి శంకుస్థాపన చేసేలా అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

బీసీ రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ రాజకీయాలు చేస్తోంది

కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో వందరోజుల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లను అమలు చేస్తామని చెప్పిందని.. కానీ ప్రభుత్వం ఏర్పాటై రెండు సంవత్సరాలు అవుతున్న ఇంకా ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నించారు. ఎంఐఎం చేతిలో కీలుబొమ్మగా ఉన్న కేసీఆర్ ముస్లింలకు 12శాతం రిజర్వేషన్‌లు అమలు చేస్తామని అసెంబ్లీలో

సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో వెనక్కి తగ్గేది లేదు

- సన్నబియ్యంతో ఖజానాపై రూ. 3 వేల కోట్ల ఆర్థిక భారం
- అర్హులైన కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు: మంత్రి శ్రీధర్ బాబు

పెద్దపల్లి (జనంసాక్షి) : మంథని నియోజకవర్గంలో అర్హులైన కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు ముఖ్య ప్రకటనలు చేస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై వివరించారు. రేషన్ కార్డుల ద్వారా సన్న బియ్యం పంపిణీకి నాంది పలికింది. ప్రతి అర్హ కుటుంబం సకాలంలో సన్న బియ్యం పొందేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. సన్న బియ్యం సరఫరా సక్రమంగా జరిగేలా రెవెన్యూ అధికారులకు ప్రత్యేక సూచనలు జారీ చేసినట్లు వెల్లడించారు. సన్న బియ్యం పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ నెల సుమారు రూ. 3 వేల కోట్ల ఆర్థిక భారాన్ని భరించాల్సి వస్తోందని తెలిపారు. అయినప్పటికీ ప్రజల ప్రయోజనాల కోసం ఈ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశారు. మహిళలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని మంత్రి గుర్తుచేశారు. 'ఉచిత బస్ ప్రయాణం అమలు చేయడం ద్వారా ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా మహిళలు 200 కోట్ల ఉచిత టికెట్లను ఉపయోగించుకున్నారని తెలిపారు. అంతేకాకుండా, గత ప్రభుత్వం చేసిన అప్పులపై ప్రతీ నెల రూ. 6 వేల కోట్ల వడ్డీ చెల్లించాల్సి వస్తున్నప్పటికీ, సంక్షేమ పథకాలను ఎలాంటి ఆటంకం లేకుండా అమలు చేస్తున్నామని చెప్పారు. మంథని అభివృద్ధి కార్యక్రమాలను వివరించిన మంత్రి శ్రీధర్ బాబు, త్వరలో మంథనిలో మినీ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరం నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేసినట్లు చెప్పారు. అదనంగా, 10,200 మందికి కొత్త రేషన్ కార్డులు అందజేసినట్లు– పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం సంక్షేమం, అభివృద్ధి. మంథనిని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే నా కృతనిశ్చయం అని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ప్రజాప్రభుత్వం ప్రజల గౌరవాన్ని పెంచే ఆలోచన చేస్తున్నదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత ప్రజల బతుకుల్లో ఏదో మార్పు వస్తుందన్న ఆశతో ఎదురు చూశారన్నారు. కానీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం కనీసం ఒక్క రేషన్ కార్డు ఇచ్చే ఆలోచన కూడా చేయలేదని ఆయన విమర్శించారు. గత ప్రభుత్వం 8 లక్షల కోట్ల వరకు అప్పులు చేసి కూర్చుంటే వాటిపై ప్రతి నెల 7వేల కోట్ల వడ్డీ కట్టాల్సి వస్తోందన్నారు. అయినప్పటికీ ప్రజలకిచ్చిన మాట నిలబెట్టుకోవాలన్న ప్రయత్నంలో ఉన్నామన్నారు.ఎంత ఆర్థికభారమైనప్పటికీ ప్రభుత్వం భరించి ప్రజలకు ఒక్కపైసా భర్చు లేకుండా రేషన్‌కార్డు ఉన్న కుటుంబంలోని ప్రతి వ్యక్తికి 6 కిలోల సన్నబియ్యం అందిస్తున్నదన్నారు. ప్రభుత్వం ఏమి చేస్తున్నదని అడిగే వారికి జవాబు చెప్పాల్సిన అవసరం కూడా విరీపై ఉన్నదన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా వేలాది మందికి రేషన్‌కార్డు ద్వారా సన్నబియ్యం అందించే కార్యక్రమం చేపట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమని ఆయన చెప్పారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజలకు ఏమి కావాలి వారిలో ఏ మార్పు తీసుకురావాలన్న ఆలోచన చేస్తున్నామన్నారు. అందులో భాగంగా ఆర్థికపరమైన ఇబ్బందులు ఉన్నప్పటికీ సన్నబియ్యం అందించాలన్న ఆలోచన చేయడం జరిగిందన్నారు. ఇల్లులేని నిరుపేదలకు ఇల్లు ఇచ్చే కార్యక్రమం చేపట్టామన్నారు. గతపదేళ్లలో ఒక్కసారి కూడా గ్రూప్ ఒన్ పరీక్షలు నిర్వహించ లేదన్నారు. ప్రజాప్రభుత్వం వచ్చిన తర్వాత వివిధ పరీక్షలు నిర్వహించి దాదాపు 65వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. 200 యూనిట్ల కరెంటు– ఉచితంగా అందజేస్తున్నామన్నారు. పేద వారికి భారం ఎలా తగ్గించాలన్న ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్నదన్నారు. 42శాతం బీసీ రిజర్వేషన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చట్టం తీసుకొచ్చిందని దానికి రాష్ట్రపతి ఆమోదం ఇప్పించాల్సిన బాధ్యత తీసుకోవాలని ఇక్కడి బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలను కోరుతున్నానన్నారు.

వివా కామ్రేడ్ రవి పుస్తకావిష్కరణ

హైదరాబాద్ (జనంసాక్షి) : వివా కామ్రేడ్ రవి మంజీర అడుగు జాడల అన్వేషణ పుస్తకావిష్కరణ సభ విప్లవ రచయితల సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం దొడ్డి కొమురయ్య హాల్‌లో జరిగింది. సభకు విరసం కార్యవర్గ సభ్యుడు శివరాత్రి సుధాకర్ అధ్యక్షత వహించారు. సభలో వక్తలుగా సాహితీ విమర్శకులు ఎస్కే ప్రభాకర్, వీక్షణం ఎడిటర్ ఎన్.వేణుగోపాల్, విరసం కార్యవర్గ సభ్యులు పాణి, అమరుల బంధుమిత్రుల సంఘం కార్యదర్శి పద్మకుమారి, రచయిత్రి స్నేహ, మంజీర సహచరి తాయమ్మ, కరుణ పాల్గొన్నారు. మంజీర కవిత్వాన్ని ఉదయ్‌కిరణ్, శశిధర్, విప్లవ శ్రీ, శ్రీధర్ కట్టా చదివి వినిపించారు. మంజీర విద్యార్థి ఉద్యమం నుంచి అంచలంచెలుగా ఎదిగి విప్లవోద్యమానికి నాయకత్వం వహించే స్థాయికి ఎదిగిన క్రమం గురించి, ఒక మేధావిగా, ఆలోచనాపరుడిగా, కవిత, కథకుడిగా ఆయన చేసిన రచనల గురించి వక్తలు, సహచరులు పంచుకున్నారు. విప్లవోద్యమ త్యాగ సంప్రదాయాలకు వారసుడిగా, ప్రతీకగా మంజీర (మఠం రవికుమార్) ప్రస్థానాన్ని వక్తలు గుర్తు చేసుకున్నారు. కవిత్వంలో ఆయన సున్నితత్వాన్ని, ఖచ్చితత్వాన్ని మనం చూడవచ్చని ఎస్కే ప్రభాకర్ అన్నారు. ఆయన ప్రజాస్వామిక స్వభావం, సహచరులతో ఆయన వ్యవహరించి, ఆచరించిన తీరు విప్లవ సంప్రదాయానికి ఉన్నత ప్రతీకలని అన్నారు.

సాహిత్యంలో, ప్రజా సంబంధాల్లో, వైద్యంలో అన్నిటా ప్రత్యామ్నాయాల కోసం ఆన అన్వేషణ, ఆచరణ సాగిందని వక్తలు గుర్తు చేసుకున్నారు. ప్రజలు కేంద్రంగా, ప్రజలకు ఉపయోగపడే లక్ష్యాల వైపు ఆయన చూపు, ఆచరణ ఉన్నాయి.

వివా కామ్రేడ్ రవి పుస్తకాన్ని ప్రతి ఒక్కరూ చదవాల్సిన అవసరం ఉందని వక్తలు అభిప్రాయపడ్డారు. ఆయన ఆలోచనలను చదివి, చర్చించి, ప్రత్యామ్నాయ ప్రజా సంప్రదాయాలను, విప్లవ విలువలను ముందుకు తీసుకువెళ్లవలసిన అవసరం ఉందని వక్తలు అభిప్రాయపడ్డారు.

భద్రాద్రి జిల్లాకు సంపూర్ణత అభియాన్ అవార్డు

- గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న జిల్లా కలెక్టర్

కొత్తగూడెం, ఆగస్టు 2 (జనంసాక్షి) : వెనుకబడి జిల్లాల ప్రగతికి కేంద్ర ప్రభుత్వం, నీతిఆయోగ్ తీసుకొచ్చిన సంపూర్ణత అభియాన్ కార్యక్రమంలో కొత్తగూడెం జిల్లా సత్తా చాటింది. నీతి అయోగ్ ఆకాంక్షిత జిల్లాల అభివృద్ధిలో భాగంగా విద్య, ఆరోగ్యం, వైద్యం, వ్యవసాయం, మౌలిక వసతులు, సామాజిక సంక్షేమం వంటి ఆరు ముఖ్య సూచికలపై 100 శాతం అభివృద్ధి లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో మూడు సూచికలపై వంద శాతం సాధించి రాష్ట్రస్థాయి గుర్తింపు పొందింది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్ రాజ్‌భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ.. ఈ అవార్డు రావడం జిల్లాలోని అధికార యంత్రాంగం, మండల అధికారులు, గ్రామస్థాయి సిబ్బంది, ప్రజల చొరవకు గుర్తింపుగా నిలిచిందని అన్నారు. ప్రతి గ్రామానికీ అభివృద్ధి కల్పించాలన్న సంకల్పంతో అన్ని శాఖలు సమన్వయంతో పని చేశాయని తెలిపారు. ప్రతి సూచికపై కట్టుదిట్టమైన కార్యాచరణ ప్రణాళికతో ముందుకెళ్లడం వల్లే ఈ విజయం సాధ్యమైందని పేర్కొన్నారు. ఈ అవార్డు మాకు మరింత బాధ్యతను పెంచిందన్నారు. అభివృద్ధిలో స్థిరత్వం ఉండాలంటే ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని చెప్పారు. ముందుగానే ప్రణాళికలు రూపొందించి, సమర్థవంతంగా అమలు చేస్తే మరింత ప్రగతి సాధించవచ్చని మౌలిక వసతులు, సామాజిక సంక్షేమం వంటి ఆరు ముఖ్య సూచికలపై 100 శాతం అభివృద్ధి లక్ష్యంగా సంపూర్ణత అభియాన్ కార్యక్రమం చేపట్టారు. ఇందులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మూడు సూచికలపై శాతం సంపూర్ణత సాధించి రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందింది. అలాగే అంతేకాక, గుండాల మండలం బ్లాక్ స్థాయిలో ఐదు సూచికలను విజయవంతంగా పూర్తి చేసి ఆకాంక్షిత బ్లాక్‌లలో అగ్రస్థానంలో నిలిచింది. ఈ క్రమంలో నీతి ఆయోగ్ అధికారి బృందాలు చేసిన సమీక్షల ఆధారంగా జిల్లా స్థాయిలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను అవార్డు కోసం ఎంపిక చేశారు.

భూభారతిలో భూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలి

- ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్య సదుపాయాలు
- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల ప్రతినిధి, ఆగస్టు 2 (జనంసాక్షి) : జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రజల కోసం మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించి సేవలు అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శనివారం మంచిర్యాల జిల్లాలోని మందమర్రి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వార్డులు, మందుల నిల్వలు, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వర్షాకాలం అయినందున అంటువ్యాధుల వ్యాప్తిని నివారించేందుకు పాటించవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. వార్డులు, ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధులలో సమయపాలన పాటించాలని, ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజలకు వైద్య సేవలు అందించాలని తెలిపారు. మండల తహశీల్దార్ సతీష్కుమార్ తో కలిసి మండల కేంద్రంలోని కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయం, ఆదర్శ పాఠశాలను సందర్శించి వంటశాల, మూత్రశాలలు, తరగతి గదులు, హాజరు పట్టికలు, పరిసరాలను పరిశీలించారు. ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యాబోధన అందిస్తుందని తెలిపారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు గల ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. 10వ తరగతి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించి వివిధ సబ్జెక్టులలో ప్రశ్నలు అడిగి వారి పఠనా సామర్థ్యాలను తెలుసుకున్నారు. అనంతరం మండల తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూభారతి రెవెన్యూ సదస్సులలో అందిన భూ సమస్యల సంబంధిత దరఖాస్తులను రికార్డులతో సరి చూసి క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వివిధ రకాల ధృవపత్రాల మంజూరు కొరకు అందిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి నిర్ణీత గడువులోగా జారీ చేయాలని తెలిపారు. అధికారులు, ఉద్యోగులు విధుల పట్ల సమయపాలన పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీలో చేరండి

- మానవ సేవలో భాగస్వాములు కండి..
- వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి..

వరంగల్ ప్రతినిధి, ఆగస్టు 2 (జనంసాక్షి): ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ లో ప్రజలు, యువత సభ్యత్వం పొంది, మానవ సేవ చేయడం లో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు, సంబంధిత శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశమైనారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర గవర్నర్,ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులవారి ఆదేశాల మేరకు వరంగల్ జిల్లావ్యాప్తంగా రెడ్ క్రాస్ సొసైటీ వరంగల్ బ్రాంచ్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. మానవత్వానికి ప్రతీక అయిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ లో సభ్యత్వం పొందడం గౌరవించదగిన విషయం అన్నారు. ప్రజాసేవలో ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ రెడ్ క్రాస్ సొసైటీలో సభ్యులుగా చేరి సేవా కార్యక్రమాల్లో భాగ్యస్వాములు కావాలన్నారు. ప్రకృతి విపత్తులు, రక్తదానం, ఆరోగ్య శిబిరాలు, ఎమర్జెన్సీ సేవల వంటి రంగాలలో రెడ్ క్రాస్ సేవలు అందిస్తుందన్నారు. దీనిపై అవగాహన కల్పించి పాఠశాలలు, కళాశాలలలో ఎన్ ఎస్ ఎస్, ఎన్సిసిల మాదిరిగా జూనియర్ రెడ్ క్రాస్, యూత్ రెడ్ క్రాస్ కమిటీలను ఏర్పాటు చేయుటకు చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఈవి శ్రీనివాసరావు, జిల్లా విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్, జిల్లా సహకార అధికారి నీరజ, డిఎం హెచ్ఓ డాక్టర్ సాంబశివరావు, ఐఆర్ఎస్ ఎంసీ మెంబర్ నాడెం శాంతికుమార్, కోశాధికారి రాజేశ్వర్ ప్రసాదద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోడీ తదితరుల పేర్లు చెప్పాలని ఒత్తిడి

- మాలేగావ్ కేసులో నిర్దోషి ప్రజ్ఞా ఠాకూర్

భోపాల్, ఆగస్ట్2 (జనంసాక్షి) : మాలేగావ్ పేలుడు కేసులో నిర్దోషిగా విడుదలైన భాజపా మాజీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్ సంచలన ఆరోపణలు చేశారు. ఈ కేసు విచారణ సమయంలో దర్యాప్తు అధికారులు వ్యవహరించిన తీరుపై విమర్శలు చేశారు. ప్రధాని మోదీ, యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ పేర్లు చెప్పాలని తనపై ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. భాజపా సీనియర్ నాయకుడు రామ్ మాధవ్ సహా పలువురి పేర్లు చెప్పాలని వారు నాపై ఒత్తిడి తెచ్చారు. నన్ను హింసించారు. నన్ను ఆసుపత్రిలో అక్రమంగా నిర్బంధించారు. నేను గుజరాత్‌లో నివసించడం వల్ల ప్రధాని మోదీ పేరు కూడా చెప్పించాలని చూశారు. నేను అబద్ధాలు చెప్పాలని వారు ప్రయత్నించారు. అవి అబద్ధాలు కావడంతో నేను ఎవరి పేరు చెప్పలేదని ప్రజ్ఞా మీడియాతో మాట్లాడారు. మాలేగావ్ బాంబు పేలుళ్ల కేసు విచారణ బృందంలో ఉన్న మాజీ ఏటీ-ఎస్ అధికారి మహబూబ్ ముజావ్ కూడా ఇలాంటి ఆరోపణలే చేసిన సంగతి తెలిసిందే. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ ను అరెస్టు చేయాలని అప్పట్లో తనకు ఆదేశాలు వచ్చాయని తెలిపారు. ఈ కేసు దర్యాప్తు అధికారిగా ఉన్న పరమ్‌బీర్ సింగ్‌తో పాటు– మరికొంతమంది ఉన్నతాధికారులు ఈ ఆదేశాలను తనకు ఇచ్చినట్లు– చెప్పారు. తనకు సాయం చేసేందుకు రాష్ట్రం నుంచి దాదాపు పది మంది సిబ్బందితో పాటు– రివాల్వర్ కూడా జారీ చేశారని ముజావ్ తెలిపారు. అయితే, ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించేందుకు నిరాకరించడంతో తనపై తప్పుడు కేసు పెట్టారన్నారు. ఆ తర్వాత వాటన్నింటిలో తాను నిర్దోషిగా బయటకు వచ్చినట్లు– వెల్లడించారు. మహారాష్ట్రలోని మాలేగావ్ ప్రాంతంలో 2008 సెప్టెంబరు 29న పేలుడు సంభవించింది. ఓ మసీదు సమీపంలో మోటార్ సైకిల్‌కు అమర్చిన బాంబు పేలడంతో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో 100 మందికి పైగా గాయపడ్డారు. ఈ ఘటనపై ప్రజ్ఞా ఠాకూర్, పురోహిత్‌తో పాటు రమేశ్ ఉపాధ్యాయ్, అజయ్ రహీర్‌కర్, సుధాకర్ ద్వివేది, సుధాకర్ చతుర్వేది, సమీర్ కులకర్ణి ప్రధాన నిందితులుగా కేసు నమోదైంది.ఈ కేసులో ఎలాంటి బలమైన ఆధారాల్లేవు అని తీర్పు వెలువరించింది.

పెంబి బ్లాక్‌కు జాతీయస్థాయిలో కాంస్య పతకం

- గవర్నర్ చేతుల మీదుగా అవార్డు స్వీకరించిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ రూరల్, ఆగస్టు2(జనం సాక్షి) : నీతి అయోగ్ ప్రతిపాదిత ఆస్పిరేషన్ బ్లాకులలో కీలకంగా నిలిచిన నిర్మల్ జిల్లా పెంబి బ్లాక్‌కు కాంస్య పతకం లభించింది.శనివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా ఈ అవార్డును జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ స్వీకరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్,రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు,సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్, అదనపు కలెక్టర్ పైజాన్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.నీతి అయోగ్ ఎంపిక చేసిన 500 ఆస్పిరేషన్ బ్లాకులలో పెంబి బ్లాక్ నాల్గవ స్థానంలో నిలిచింది. ఆరోగ్య,పోషణ, వ్యవసాయం,విద్య, మౌలిక సదుపాయాలు తదితర ఆరు సూచికలలో మెరుగైన పనితీరును ప్రదర్శించినందుకే ఈ పురస్కారం లభించిందని అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ,పెంబి బ్లాక్‌కు జాతీయస్థాయిలో నాల్గవ ర్యాంకు రావడం గర్వకారణమని,ఇది సమిష్టి కృషికి నిదర్శనం అన్నారు.ఆస్పిరేషన్ నుంచి ఇన్స్పిరేషన్‌గా మారిన పెంబి మనందరికీ ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు.సంపూర్ణత అభియాన్ లో భాగంగా గర్భిణీ స్త్రీల నమోదు, డయాబెటిస్ స్క్రీనింగ్, సప్లిమెంటరీ పోషకాహారం అందజేతలో వందశాతం పనితీరు,భూ హెల్త్ కార్డుల జారీలో 70 శాతం, మహిళా సంఘాల రుణాల పంపిణీలో 94 శాతం పురోగతిని పెంబి బ్లాక్ సాధించిందని కలెక్టర్ తెలిపారు

జాతీయ హరిత ట్రిబ్యునల్ సూచనలు అమలు చేయండి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డా.సత్య శారద..

వరంగల్ ప్రతినిధి, ఆగష్టు 2 (జనంసాక్షి): జాతీయ హరిత ట్రిబ్యునల్ సూచనలు అమలు చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డా.సత్యశారద అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ జిడబ్ల్యూ ఎంసీ కమిషనర్ చాహాత్ బాజ్‌పాయి, ఆదనపు కలెక్టర్ సంధ్యారాణిలతో కలసి మునిసిపల్, కాలుష్య నియంత్రణ మండలి, సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హరిత గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జిటి) నిబంధనల ప్రకారం కోట చెరువును, శుభ్రం చేయించాలని, ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై ఎన్జీటీ ఆదేశించిన విధంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ , బయో హజార్డ్ మేనేజ్మెంట్ లను ప్రాసెసింగ్ చేసి డాక్యుమెంట్ తయారు చేసి అందజేయాలని అన్నారు. ప్రస్తుతం ఉన్న లెగసీ వ్యర్థాలను టెండర్ ప్రాసెసింగ్ చేయాలని అన్నారు. ఎన్జీటి విధివిధానాల ప్రకారం 17 ఏకరాల ల్యాండ్‌ను రాంపూర్ డంప్ యార్డ్‌లో నిర్వహించడం తో పాటు బయో మైనింగ్ పూర్తి చేయడం జరిగిందని, కొనుగోలు చేసిన ల్యాండ్‌కు టెండర్ ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని నియంత్రించడానికి ఎన్ఫోర్స్మెంట్ బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని బల్దియా కమిషనర్ తెలిపారు. హరిత గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జిటి) నిబంధనలను అమలు చేయాలని, పర్యావరణ పరిరక్షణ కోసం త్వరలో జరిగే వినాయక పండుగ సందర్భంగా మట్టి వినాయక ప్రతిమలను ప్రతిష్టించాలని, అందుకోసం కాలుష్య నియంత్రణ మండలి, పురపాలికల, కార్పొరేషన్ తరపు నుండి ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను అందజేయాలని, నగరంలోని కాలనీ కమిటీలతో సమావేశాలు ఏర్పాటు చేసి కాలుష్యాన్ని అరికట్టడానికి మట్టి వినాయక విగ్రహాలను పూజించెల అవగాహన కలిగించాలని అన్నారు. పాఠశాల విద్యార్థులకు మట్టితో వినాయక ప్రతిమలను తయారు చేసేలా శిక్షణ అందజేసి వాటిని కొనుగోలు చేసేలా చూడాలని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ విజయలక్ష్మి, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ. సునీత, బల్దియా సీఏంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఇంచార్జి ఎస్ ఈ మహేందర్ ఏంహెచ్ఓ డాక్టర్ రాజేష్. నర్సంపేట, వర్ధన్నపేట మునిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
3 ఆగస్టు 2025

భారత్‌పై అమెరికా సుంకాలు

భారత్-అమెరికా సంబంధాలు ఆర్థిక, రాజకీయ ఒత్తిడుల మధ్య కీలక దశలో ఉన్నాయి. ఆగస్టు 1, 2025 నుండి భారతీయ వస్తువులపై అమెరికా విధించిన 25% సుంకాలు, రష్యాతో భారత వాణిజ్య సంబంధాలపై డొనాల్డ్ ట్రంప్ తీవ్ర విమర్శలు ద్వైపాక్షిక సంబంధాలను ఒత్తిడికి గురిచేస్తున్నాయి. ట్రంప్ రెండవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత భారతీయ విద్యార్థులు, కంపెనీలపై ఆంక్షలు, అనధికారిక భారతీయుల బలవంతపు నిష్క్రమణ వంటి చర్యలు ఉద్రిక్తతలను పెంచాయి. రష్యా-భారత్ ఆర్థిక సహకారాన్ని "డెడ్ ఎకానమీ"గా అభివర్ణించిన ట్రంప్, ఈ సంబంధాలు అమెరికా ప్రయోజనాలను దెబ్బతీస్తున్నాయని ఆరోపించారు. ఇరాన్‌తో వాణిజ్యం చేస్తున్న ఆరు భారతీయ కంపెనీలపై ఆంక్షలు మరో దెబ్బ. ఈ నేపథ్యంలో, ఆగస్టు 25న జరగనున్న వాణిజ్య చర్చల్లో అమెరికా తనకు అనుకూల నిబంధనలను రుద్దేందుకు ప్రయత్నిస్తోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భారతదేశం తన జాతీయ ప్రయోజనాలను కాపాడుకోవడానికి వ్యూహాత్మకంగా స్పందించాల్సిన సమయం ఆసన్నమైంది.

భారతదేశం. అమెరికా మధ్య ఆర్థిక, రాజకీయ సంబంధాలు ప్రస్తుతం సంక్లిష్టమైన దశలో ఉన్నాయి. స్వాతంత్ర్యానంతరం నుండి ఈ సంబంధాలు అనేక ఒడిదొడుకులను చవిచూశాయి. రిచర్డ్ నిక్సన్, ఇందిరా గాంధీ కాలంలో అత్యంత క్షీణ దశను, జార్జ్ డబ్ల్యూ బుష్, మన్మోహన్ సింగ్ హయాంలో స్నేహపూర్వక దశను అనుభవించాయి. 21వ శతాబ్దంలో భారతదేశం తన వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని ఉపయోగించుకుని, బహుళ ధ్రువ ప్రపంచంలో జాతీయ ప్రయోజనాలను కాపాడుకోవడానికి ప్రయత్నం చింది. అమెరికా భారతదేశాన్ని ప్రధాన రక్షణ భాగస్వామిగా గుర్తించి, ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడులు, ప్రపంచ భద్రతా సహకారం, గ్లోబల్ గవర్నెన్స్‌లో భారతదేశ పాత్రను పెంచడం, సాంకేతిక భాగస్వామ్యం వంటి కీలక అంశాల్లో సహకరించింది. 2016లో లాజిస్టిక్స్ ఎక్స్ఛేంజ్ మెమోరాండం ఒప్పందం, 2017లో 126.1 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్యం ఈ సంబంధాలను బలోపేతం చేశాయి. గాలప్ సర్వే ప్రకారం, 2019లో 72% అమెరికన్లు భారతదేశం పట్ల అనుకూల దృక్పథాన్ని వ్యక్తం చేశారు. అమెరికా ప్రతినిధుల సభ స్పీకర్ మైక్ జాన్సన్ ఇటీవల భారతదేశాన్ని ముఖ్యమైన భాగస్వామిగా పేర్కొన్నారు, ఉగ్రవాదంపై పోరాటంలో సహకారం, వాణిజ్య చర్చలపై ఆశాభావం వ్యక్తం చేశారు.

అయితే, ఇటీవలి కాలంలో ఈ సంబంధాలు ఒత్తిడికి గురవుతున్నాయి. ఆగస్టు 1, 2025 నుండి భారతీయ వస్తువులపై అమెరికా 25% సుంకం విధించడం, రష్యాతో భారతదేశ వాణిజ్య సంబంధాలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా విమర్శించడం ఆందోళన కలిగిస్తోంది. ట్రంప్ రెండవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత భారతీయ విద్యార్థులపై ఆంక్షలు, అనధికారికంగా ఉన్న భారతీయులను బలవంతంగా దేశం నుండి పంపించడం వంటి చర్యలు ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం చూపుతున్నాయి. రష్యా-భారత్ ఆర్థిక సహకారాన్ని "డెడ్ ఎకానమీ"గా అభివర్ణించిన ట్రంప్, భారతదేశం-రష్యా సంబంధాలు అమెరికా ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీస్తున్నాయని ఆరోపించారు. ఇరాన్‌తో వాణిజ్యం చేస్తున్న ఆరు భారతీయ కంపెనీలపై ఆంక్షలు విధించడం కూడా ఈ ఉద్రిక్తతలను పెంచింది. ఈ కంపెనీలు అమెరికన్ సంస్థలతో లావాదేవీలు చేయడం నిషేధించబడ్డాయి. ఈ జాబితాలో కంచన్ పాలిమర్స్, అలికెమికల్ సొల్యూషన్స్, జుపిటర్ డై క్రెమ్ ప్రైవేట్ లిమిటెడ్, గ్లోబల్ ఇండస్ట్రియల్ కెమికల్, పెర్సీ స్టయిల్స్ పెట్రోలియం సంస్థలు ఉన్నాయి. ఈ ఆంక్షలు భారతీయ కంపెనీల ఆర్థిక స్థిరత్వంపై ప్రభావం చూపుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

అమెరికా ఈ విధానాల వెనుక ఉద్దేశం భారతదేశం-రష్యా మైత్రిని బలహీనపరచడం, భారత ఆర్థిక వృద్ధిని అడ్డుకోవడమేనని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రష్యా నుండి భారతదేశం భారీగా క్రూడ్ ఆయిల్, ఇతర వస్తువులను దిగుమతి చేసుకోవడం అమెరికాకు ఆందోళన కలిగిస్తోంది. ట్రంప్ వ్యాపార ధోరణితో రాజకీయ నిర్ణయాలు తీసుకుంటూ, భారతదేశం-రష్యా సంబంధాలను లక్ష్యంగా చేసుకున్నారని స్పష్టమవుతోంది. ఆగస్టు 25న అమెరికా వాణిజ్య బృందం భారతదేశానికి రానుంది, వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరపడానికి. ఈ చర్చల్లో అమెరికా తనకు అనుకూలమైన నిబంధనలను రుద్దేందుకు ఒత్తిడి చేస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ సందర్భంలో, ట్రంప్ రష్యా-భారత్ సంబంధాలను "ఆర్థికంగా దిగజార్చే" సంబంధాలుగా విమర్శించడం, భారతదేశంపై 25% సుంకాలు, జరిమానాలు విధించడం వంటి చర్యలు ద్వైపాక్షిక సంబంధాలను మరింత దిగజార్చే అవకాశం ఉంది. ట్రంప్ వ్యాఖ్యలు భారతదేశం, రష్యా ఆర్థిక వ్యవస్థలను బలహీనపరచాలనే ఉద్దేశంతో ఉన్నాయని, ఇది అమెరికా ఆర్థిక ఆధిపత్యాన్ని కొనసాగించే వ్యూహంలో భాగమని విశ్లేషకులు చెబుతున్నారు.

ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా, మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్న భారతదేశంపై అమెరికా ఆంక్షలు విధించడం ప్రశ్నార్థకం. రష్యాతో దీర్ఘకాల మైత్రి, ఆర్థిక సహకారం భారతదేశానికి కీలకం. రష్యా నుండి భారీ ఎత్తున క్రూడ్ ఆయిల్, ఇతర వస్తువుల దిగుమతి భారత ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తోంది. అమెరికా ఈ సంబంధాలను దెబ్బతీసే ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, రష్యా, చైనా వంటి దేశాల బలంతో అమెరికా ఆధిపత్యాన్ని సవాలు చేయగల సామర్థ్యం ఉంది. రష్యా వద్ద ఉన్న ఆయుధ సంపత్తి, సహజ వనరులు అమెరికా కంటే ఎక్కువగా ఉన్నాయని, రష్యా-చైనా ఐక్యత అమెరికాకు భయం కలిగించే అంశమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. అమెరికా ఈ దేశాలను ఆర్థికంగా బలహీనపరచాలని, రష్యా బలపడకుండా అడ్డుకోవాలని చేస్తున్న ప్రయత్నాలు భారతదేశం-రష్యా సంబంధాలపై దాడిగా మారాయి.

భారతదేశం ఇప్పుడు అప్రమత్తంగా ఉండి, తన జాతీయ ప్రయోజనాలను కాపాడుకునే దిశగా అడుగులు వేయాలి. అమెరికా స్నేహపూర్వక మాటల వెనుక దాగిన ఆర్థిక, రాజకీయ ఒత్తిడులను గుర్తించి, వ్యూహాత్మకంగా స్పందించాల్సిన సమయం ఆసన్నమైంది. భారతదేశం తన విదేశాంగ విధానంలో సమతుల్యతను కొనసాగించి, రష్యా, చైనా వంటి మిత్ర దేశాలతో సంబంధాలను బలోపేతం చేయడం ద్వారా అమెరికా ఆధిపత్య వైఖరికి చెక్ పెట్టగలదు. అమెరికాతో వాణిజ్య ఒప్పంద చర్చల్లో భారతదేశం తన ప్రయోజనాలను గట్టిగా కాపాడుకోవాలి. భారతీయ విద్యార్థులు, వ్యాపారవేత్తలు, కంపెనీలపై అమెరికా విధించిన ఆంక్షలను దౌత్యపరంగా ఎదుర్కోవాలి. ప్రపంచ రాజకీయ, ఆర్థిక వేదికలపై భారతదేశం తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకోవడం ద్వారా, అమెరికా వంటి దేశాల ఒత్తిడిని తట్టుకుని, తన ఆర్థిక, రాజకీయ శక్తిని చాటుకోవాలి.

డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

తెలంగాణలో డ్రగ్స్ ముప్పు

యువతను కాపాడే ఈగల్ ఫోర్స్



తెలంగాణ రాష్ట్రం ఈ మధ్య కాలంలో డ్రగ్స్ గంజాయి కేసుల తీవ్రతను ఎదుర్కొంటోంది. యువతను వ్యసనాల ఊబిలోకి లాగే ఈ సమస్య సమాజంలో ఒక పెను సవాలుగా మారింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డ్రగ్స్ నియంత్రణకు ఈగల్ అనే ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు. ఈ చర్య తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చే దిశగా ఒక సునిశితమైన అడుగుగా పరిగణించవచ్చు. ఈగల్ ఫోర్స్‌ను ఏర్పాటు చేయడం ద్వారా గంజాయి సాగును డ్రగ్స్ రవాణాను నిరోధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోంది. అయితే ఈ సమస్యను అంతం చేయడానికి కేవలం పోలీసు చర్యలు మాత్రమే సరిపోవు సమాజంలోని అన్ని వర్గాల సమిష్టి కృషి అవసరం.

తెలంగాణ ఒక చైతన్యవంతమైన గడ్డ. రాష్ట్ర ఉద్యమంలో యువత ముందుండి పోరాడి స్వరాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించింది. కోమరం భీమ్ చాకలి ఐలమ్మ దొడ్డి కొమురయ్య వంటి వీరుల నుండి ప్రేరణ పొందిన ఈ యువత ఒకప్పుడు విద్యా సంస్థలను ఉద్యమ కేంద్రాలుగా మార్చి స్వాతంత్ర్య దాహంతో సమాజాన్ని చైతన్యవంతం చేసింది. అలాంటి యువత ఇప్పుడు డ్రగ్స్ గంజాయి వంటి వ్యసనాల బారిన పడటం రాష్ట్రానికి సమాజానికి ఒక సిగ్గుచేటుగా మారుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయంపై ఆందోళన వ్యక్తం చేస్తూ తెలంగాణ వంటి ఉద్యమ గడ్డ డ్రగ్స్ హబ్‌గా మారడం అవమానకరమని పేర్కొన్నారు. ఈ సమస్యను ఎదుర్కోవడానికి ప్రభుత్వం జీరో టాలరెన్స్ టోటల్ సర్వైలెన్స్ అనే నినాదంతో ఈగల్ ఫోర్స్‌ను రంగంలోకి దింపింది.

డ్రగ్స్ సమస్య ఒక సామాజిక వ్యాధిగా మారింది. ఈ సమస్య యువతను మాత్రమే కాకుండా వారి కుటుంబాలను సమాజాన్ని కూడా బాధిస్తోంది. ఆంధ్ర ఒడిశా సరిహద్దు నుండి గంజాయి రవాణా బెంగళూరు గోవా నుండి సింథటిక్ డ్రగ్స్ రాష్ట్రంలోకి చొచ్చుకొస్తున్నాయి. ఈ డ్రగ్స్‌ను చాక్లెట్లు ఐస్ క్రీమ్‌లలో కలిపి విక్రయిస్తున్నారని ఇది మరింత ప్రమాదకరమైన పరిస్థితిని సృష్టిస్తోందని ముఖ్యమంత్రి హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఈగల్ ఫోర్స్‌కు అత్యాధునిక సాంకేతికత శిక్షణ పొందిన సిబ్బంది ఇంటెలిజెన్స్ సమాచారంతో సమన్వయం చేసి గంజాయి సాగును డ్రగ్స్ రవాణాను అరికట్టే బాధ్యతను అప్పగించారు. 2025 జూన్ 26న అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని శిల్పకళా వేదిక వద్ద జరిగిన కార్యక్రమంలో ఈగల్ ఫోర్స్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సినీ నటులు రామ్‌చరణ్ విజయ్ దేవరకొండ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ డిజిపి జితేందర్ తదితరులు పాల్గొని డ్రగ్స్ వ్యతిరేక ఉద్యమానికి మద్దతు తెలిపారు. డ్రగ్స్ సమస్య యువతను బలహీనపరచడమే కాకుండా దేశ భవిష్యత్తును కూడా ప్రమాదంలోకి నెట్టే అంశం. భారతదేశంలో 68 శాతం జనాభా యువతే కావడం ఈ యువతను డ్రగ్స్ వైపు నడిపించేందుకు శత్రు దేశాలు కుట్రలు చేస్తున్నాయని ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. పంజాబ్ హర్యానా వంటి రాష్ట్రాల్లో డ్రగ్స్ సమస్య యువతను కుటుంబాలను ఎలా నాశనం చేసిందో ఉదాహరణగా చెప్పారు.

డ్రగ్స్ సమస్యను అంతం చేయడానికి క్రీడల ప్రోత్సాహం ఒక సానుకూల మార్గంగా ఉంటుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. దేశంలో క్రీడలను ప్రోత్సహించకపోవడం వల్ల యువత వ్యసనాల వైపు మొగ్గుతోందని ఒలింపిక్స్‌లో 140 కోట్ల జనాభా ఉన్న భారత్ ఒక్క బంగారు పతకం కూడా సాధించలేకపోవడం సిగ్గుచేటని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణలో క్రీడలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం కొత్త క్రీడా విధానాన్ని రూపొంది ంచింది. ఈ విధానం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభను గుర్తించి వారిని అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తోంది. హైదరాబాద్‌ను క్రీడా కేంద్రంగా మార్చడానికి అంతర్జాతీయ స్థాయి స్టేడియా ల నిర్మాణానికి కేంద్ర సహకారం కోరినట్లు రేవంత్ రెడ్డి తెలిపారు. గచ్చిబౌలి ని క్రీడా గ్రామంగా అభివృద్ధి చేసే ప్రణాళికలు కూడా ఉన్నాయి. క్రీడాకారుల కు ఉద్యోగ అవకాశాలతో పాటు రాజకీయాల్లోనూ ప్రత్యేక అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. నిఖత్ జరీన్ మహ్మద్ సిరాజ్ వంటి క్రీడాకారులకు గ్రూప్-1 ఉద్యోగాలు అందజేసిన ఉదాహరణను ఆయన ప్రస్తావిం చారు. సమాజంలో డ్రగ్స్ సమస్యను అంతం చేయడానికి ప్రజల సహకారం కీలకం. డ్రగ్స్ విక్రయిస్తున్న వారి గురించి సమాచారం అందిస్తే పోలీసులు తక్షణ చర్యలు తీసుకుంటారని ముఖ్యమంత్రి సూచించారు. డయల్ 100కు సమాచారం అందించడం ద్వారా నేరస్తులను త్వరగా పట్టుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అదే విధంగా సమాజంలో నైతిక విలువలను పెంపొందించడం కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా యువత ను వ్యసనాల నుండి దూరంగా ఉంచవచ్చని ఆయన అభిప్రాయ పడ్డారు. టెక్నాలజీ వల్ల సమాజంలో కొన్ని సమస్యలు పెరిగాయని మొబైల్ ఫోన్‌ల నుండి పిల్లలను దూరంగా ఉంచడం సంయుక్త కుటుంబ వ్యవస్థను ప్రోత్స హించడం ద్వారా యువత మానసిక బలాన్ని పెంచవచ్చని సూచించారు.

తెలంగాణ ప్రభుత్వం డ్రగ్స్ నిర్మూలన కోసం అనేక చర్యలు చేపడుతోంది. 2023లో ఏర్పాటైన తెలంగాణ యాంటీ-నార్కోటిక్స్ బ్యూరోను ఈగల్‌గా పునర్‌నామకరణం చేసి దీనికి 50 కోట్ల రూపాయల నిధులు 170 మంది అదనపు సిబ్బందిని కేటాయించారు. ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లో 1892 కేసులు నమోదై 3792 మందిని అరెస్ట్ చేసి 179.3 కోట్ల రూపాయల విలువైన డ్రగ్స్ స్వాధీనం చేశారు. నార్కో-ఆఫెండర్లకు చెందిన 47.16 కోట్ల రూపాయల ఆస్తులను కూడా జప్తు చేశారు. 266 నార్కోటిక్స్ డిటెక్షన్ డాగ్స్‌ను రాష్ట్రవ్యాప్తంగా మోహరించడం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత మిత్ర యాప్‌ను ఉపయోగించి డ్రగ్ వ్యసనస్తులను గుర్తించి వైద్య సహాయం అందించడం వంటి చర్యలు తీసుకుంటున్నారు.

తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చడం కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు సమాజంలోని ప్రతి వ్యక్తి బాధ్యత. విద్యా సంస్థలు తల్లిదండ్రులు సమాజ సంస్థలు సినీ పరిశ్రమ వంటి వివిధ వర్గాలు ఈ ఉద్యమంలో భాగస్వాములై యువతను సరైన మార్గంలో నడిపించాలి. రామ్‌చరణ్ విజయ్ దేవరకొండ వంటి సినీ తారలు ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొని యువతకు స్ఫూర్తినిచ్చే సందేశాలను అందించడం సానుకూల అడుగు. తెలుగు చలనచిత్ర పరిశ్రమ కూడా డ్రగ్స్ వ్యసనం ఉన్న నటులను నిషేధించే నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

తెలంగాణ యువత డ్రగ్స్ బారిన పడకుండా కాపాడుకోవడం అనేది రాష్ట్ర గౌరవాన్ని నిలబెట్టడమే కాకుండా దేశ భవిష్యత్తును రక్షించడం కూడా. ఈగల్ ఫోర్స్ వంటి చర్యలతో పాటు క్రీడలు నైతిక విలువలు విద్య సామాజిక సంఘీభావం వంటి అంశాలను ప్రోత్సహించడం ద్వారా యువతను వ్యసనాల నుండి దూరంగా ఉంచవచ్చు. ప్రతి ఒక్కరూ ఈ పోరాటంలో భాగస్వాములై తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా యువతకు స్ఫూర్తిదాయకమైన గడ్డగా మార్చే దిశగా కృషి చేయాలి.

- సందీప్ శాండిల్య

గ్రంథాలయ శాస్త్ర పితామహుడు

ఎస్.ఆర్. రంగనాథన్

ఎస్.ఆర్. రంగనాథన్ (1892-1972), భారత గ్రంథాలయ శాస్త్ర పితామహుడిగా ప్రసిద్ధి చెందిన వ్యక్తి. గ్రంథాలయ శాస్త్రానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన దార్శనికుడు. గొప్ప ఆలోచనా పరుడు. సిద్ధాంత రూపకల్పనలోనూ ఆచరణ లోనూ తన విశిష్టతను చాటారు. ఆయన జన్మదినం, ఆగస్టు 12, భారతదేశంలో గ్రంథాలయాధ్యక్షుల దినోత్సవంగా జరుపుకోబడుతుంది. రంగనాథన్ రూపొందించిన "గ్రంథాలయ శాస్త్ర ఐదు సూత్రాలు (ఫైవ్ లాస్ ఆఫ్ లైబ్రరీ సైన్స్)" "కోలన్ వర్గీకరణ విధానం (కోలన్ క్లాసిఫికేషన్)" గ్రంథాలయ శాస్త్రంలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చాయి. ఆయన రచనలు, సిద్ధాంతాలు, విద్యా సంస్థలకు అందించిన సేవలు ఆధునిక గ్రంథాలయ వ్యవస్థలకు బలమైన పునాదులను వేశాయి.

శియాళి రామమృతం రంగనాథన్ 1892 ఆగస్టు 12న తమిళనాడులోని సిర్కాళి జిల్లా శియాళి గ్రామంలో ఒక సాంప్రదాయ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి రామమృతం, తల్లి సీతాలక్ష్మి. చిన్నతనంలోనే రంగనాథన్ అసాధారణమైన తెలివితేటలు, జ్ఞాన పిపాసను ప్రదర్శించారు. మద్రాసు క్రిస్టియన్ కళాశాలలో గణితశాస్త్రంలో బీఏ, ఎంఏ డిగ్రీలు పొందారు. గణిత శాస్త్రంలో ఆయనకు ఉన్న పట్టు ఆయన తర్వాతి కాలంలో గ్రంథాలయ శాస్త్రంలో విశ్లేషణాత్మక విధానాలను రూపొందించడంలో ఉపయోగపడింది.

రంగనాథన్ మొదట గణిత ఉపాధ్యాయుడిగా వివిధ కళాశాలల్లో పనిచేశారు. అయితే, 1924లో మద్రాసు విశ్వవిద్యాలయంలో గ్రంథాలయాధ్యక్షుడిగా నియమితులైనప్పుడు ఆయన జీవితం కొత్త మలుపు తిరిగింది. ఈ పదవి ఆయనకు సవాలుగా, స్ఫూర్తిగా నిలిచింది. గ్రంథాలయ శాస్త్రంలో ప్రాథమిక శిక్షణ లేనప్పటికీ, ఆయన స్వీయాధ్యయనం, అంకితభావం ద్వారా ఈ రంగంలో అపూర్వమైన రచనలు చేయగలిగారు.

లండన్ శిక్షణ - గ్రంథాలయ శాస్త్రంలో విప్లవం:

1924లో, గ్రంథాలయ శాస్త్రంలో ఆధునిక పద్ధతులను అభ్యసించేందుకు రంగనాథన్ లండన్‌లోని యూనివర్సిటీ కాలేజ్ లండన్‌లో చేరారు. అక్కడ ఆయన గ్రంథాలయ నిర్వహణ, వర్గీకరణ విధానాలపై లోతైన అధ్యయనం చేశారు. లండన్‌లో గడిపిన సమయం ఆయన ఆలోచనలను విస్తృతం చేసింది. అప్పటి వరకు పాశ్చాత్య గ్రంథాలయాలలో ప్రచలితంలో ఉన్న డ్యూయీ డెసిమల్ క్లాసిఫికేషన్ (డీడీసీ) విధానంలోని పరిమితులను గుర్తించిన రంగనాథన్, ఒక సౌలభ్యమైన, విశ్లేషణాత్మక వర్గీకరణ విధానాన్ని రూపొందించాలని నిర్ణయించారు. ఈ ఆలోచనే "కోలన్ వర్గీకరణ" (కోలన్ క్లాసిఫికేషన్) రూపకల్పనకు దారితీసింది.

గ్రంథాలయ శాస్త్ర ఐదు సూత్రాలు:

1931లో రంగనాథన్ తన అత్యంత ప్రసిద్ధ రచన "ది ఫైవ్ లాస్ ఆఫ్ లైబ్రరీ సైన్స్"ని ప్రచురించారు. ఈ గ్రంథంలో ఆయన గ్రంథాలయ శాస్త్రానికి ఐదు సార్వత్రిక సూత్రాలను ప్రతిపాదించారు:

1."పుస్తకాలు ఉపయోగం కోసం" ("బుక్స్ ఆర్ ఫర్ యూజ్")
2. "ప్రతి పాఠకుడికీ ఆయన పుస్తకం" ("ఎవ్రీ రీడర్ హిస్ /హర్ బుక్ ")
3." ప్రతి పుస్తకానికీ చదవరి ఉంటాడు" ("ఎవ్రీ బుక్ ఇట్స్ రీడర్)
4."పాఠకుడి సమయాన్ని ఆదా చేయండి (సేవ్ ది టైమ్ ఆఫ్ ద రీడర్)
5. "గ్రంథాలయం ఒక పెరుగుతున్న జీవి" (ది లైబ్రరీ ఈజ్ ఏ గ్రోయింగ్ ఆర్గానిక్)

ఈ సూత్రాలు గ్రంథాలయాలను నిర్వహించే విధానంలో, సేవలు అందించే తీరులో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చాయి. "పుస్తకాలు ఉపయోగం కోసం" అనే సూత్రం గ్రంథాలయాలు స్థిరమైన సంస్థలుగా కాక, వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా మారాలని నొక్కి చెప్పింది. ఈ సూత్రాలు ఆధునిక గ్రంథాలయ శాస్త్రంలో ఇప్పటికీ ప్రామాణికంగా కొనసాగుతున్నాయి.

కోలన్ వర్గీకరణ విధానం:

1933లో రంగనాథన్ "కోలన్ వర్గీకరణ" విధానాన్ని ప్రవేశపెట్టారు. ఇది ఒక విశ్లేషణాత్మక-సంశ్లేషణాత్మక (ఎనలిథికో-సింథటిక్) వర్గీకరణ విధానం. ఇది జ్ఞానాన్ని అనేక కోణాల (ఫేసిట్స్) ఆధారంగా వర్గీకరిస్తుంది. ఈ విధానం "డ్యూయీ క్లాసిఫికేషన్ " విధానంతో పోలిస్తే అధిక సౌలభ్యత, ఖచ్చితత్వం కలిగి ఉంటుంది. కోలన్ వర్గీకరణ గ్రంథాలయ విజ్ఞాన శాస్త్రంలో ఒక సాంకేతిక విప్లవంగా పరిగణించబడుతుంది. ఈ విధానం ఆధునిక సమాచార నిర్వహణ వ్యవస్థలకు మార్గదర్శకంగా నిలిచింది.

రంగనాథన్ రచనలు - విద్యాసంస్థలకు చేసిన సేవ:

రంగనాథన్ 50కి పైగా గ్రంథాలు, 1,500కు పైగా వ్యాసాలు రచించారు. ఆయన ముఖ్య రచనలలో "ప్రొలేగోమెనా టు లైబ్రరీ క్లాసిఫికేషన్", " క్లాసిఫైడ్ కేటలాగ్ కోడ్", " "లైబ్రరరీ అడ్మినిస్ట్రేషన్ "," రేఫరెన్స్ సర్వీస్" వంటివి అనేకం ఉన్నాయి. ఈ రచనలు గ్రంథాలయ నిర్వహణకు, సేవలు, వర్గీకరణ, సమాచార పునరుద్ధరణ వంటి అంశాలపై లోతైన అధ్యయనాన్ని అనుభవాలను అందిస్తాయి. ఆయన 1924-1944 మధ్య మద్రాసు విశ్వవిద్యాలయంలోనూ, 1945-1954 మధ్య బనారస్ హిందూ విశ్వవిద్యాలయంలోనూ, 1957-1961 మధ్య ఢిల్లీ విశ్వవిద్యాలయంలోనూ సేవలు అందించారు. 1965లో బెంగళూరులో "డాక్యుమెంటేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ సెంటర్" (డీ.ఆర్.టీ.సీ.)ని స్థాపించారు, ఇది సమాచార విజ్ఞాన శాస్త్రంలో పరిశోధన, శిక్షణ కేంద్రంగా నిలిచింది.

గౌరవాలు, పురస్కారాలు, గుర్తింపు:

రంగనాథన్ తన రచనలకు, సేవలకు ఎన్నో గౌరవాలు, పురస్కారాలు అందుకున్నారు. 1957లో భారత ప్రభుత్వం ఆయనను "పద్మశ్రీ"తో సత్కరించింది. అమెరికన్ లైబ్రరీ అసోసియేషన్ ఆయనను "గౌరవ సభ్యుడి"గా ఎన్నుకుంది. ఆయన స్థాపించిన "ఇండియన్ లైబ్రరీ అసోసియేషన్" గ్రంథాలయ ఉద్యమాన్ని బలోపేతం చేసింది. బ్రిటానికా ఎన్‌సైక్లోపీడియా, ఎన్‌సైక్లోపీడియా ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ వంటి సమాచార సంస్థలు రంగనాథన్‌ను గ్రంథాలయ శాస్త్రంలో దిగ్గజంగా గుర్తించాయి.

రంగనాథన్ ఆలోచనలు గ్రంథాలయ శాస్త్రాన్ని ఒక సాంకేతిక, వినియోగదారుని-కేంద్రీకృత శాస్త్రంగా మార్చాయి. ఆయన సూత్రాలు డిజిటల్ యుగంలోనూ సందర్భోచితంగా ఉన్నాయి. ఉదాహరణకు, "పాఠకుడి సమయాన్ని ఆదా చేయండి" అనే సూత్రం ఆధునిక సెర్చ్ ఇంజన్లు, డిజిటల్ లైబ్రరీల రూపకల్పనకు మార్గదర్శకంగా నిలుస్తుంది. "కోలన్ వర్గీకరణ" విధానం ఆధునిక సమాచార నిర్వహణ వ్యవస్థలలో "మెటాడేటా, ఫేసెటెడ్ సెర్చ్" వంటి సాంకేతికతలకు మూలాధారంగా ఉంది.

రంగనాథన్ విద్యా సంస్థలకు అందించిన సేవలు భారతదేశంలో గ్రంథాలయ విద్యను బలోపేతం చేశాయి.డీ.ఆర్.టీ.సీ. స్థాపన ద్వారా ఆయన సమాచార విజ్ఞాన శాస్త్రంలో పరిశోధనను ప్రోత్సహించారు. ఆయన రచనలు విద్యార్థులకు, గ్రంథాలయ నిపుణులకు మార్గదర్శక గ్రంథాలుగా నిలిచాయి.

ఎస్.ఆర్. రంగనాథన్ గ్రంథాలయ శాస్త్రంలో ఒక యుగకర్త. ఆయన "ఐదు సూత్రాలు"," కోలన్ వర్గీకరణ" రచనలు, విద్యా సేవలు ఆధునిక సమాచార వ్యవస్థలకు బలమైన పునాదులు వేశాయి. ఆయన ఆలోచనలు డిజిటల్ యుగంలోనూ సందర్భోచితంగా, స్ఫూర్తిదాయకంగా ఉన్నాయి. గ్రంథాలయాధ్యక్షుల దినోత్సవం సందర్భంగా రంగనాథన్ జీవితాన్ని,ఆయన సాధించిన విజయాలను స్మరించుకోవడం గ్రంథాలయ శాస్త్రం పట్ల ఆయన అంకితభావానికి నివాళి అర్పించడమే అవుతుంది. ఆయన దార్శనికత, ఆచరణాత్మక విధానాలు భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయి.

డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

నవ్వుకునే ముండ్లు

పూలదండల్ల తెగిపోతున్న స్నేహబంధాలు
మళ్ళీ కలిపి ముడి వేయలేనంత పెరిగిన దూరం
ఆ దూరాన్ని చూసి నవ్వుకునే ముండ్లు
ఎవరికి చెప్పాలి శుభాకాంక్షలు విడిపోయిన పువ్వులక?
నవ్వుకుంటున్న ముండ్లక?
ఎవరికి చెప్పాలన్న ముందుగా నటించడం నేర్చుకోవాలి
నిజాయితీ లేని స్నేహం దారానికి వేలువియ్యదు
ఆ కొద్ది సేపుండే ఆ పూల సువాసనే చాలంటుంది
నువ్వొక్క సారి కండ్లు మూసుకో...
ఆ చీకట్లో కూడా వెలుగు రూపంలో కనిపించేదే నీ స్నేహం
ఆ స్నేహంలో నువ్వు చూడాల్సింది ఆకారం కాదు, అంతస్తు కాదు
అందం కాదు ,కులం కాదు
నీ స్నేహం కోసం ఏడుస్తున్న గుండెను చూడు...
మౌనంతో మాట్లాడే మాటలు వినునీ చెలిమి కోసం ఆ కండ్లు చేసే యుద్ధాన్ని చూడు...
నీ తోడులేక బరువెక్కి అలిసిపోయిన ఆ దేహాన్ని చూడు..
అంతే తప్ప లెక్కలేసుకుని స్నేహం చేయకు
కష్టమస్తే తోడుండే స్నేహం కావాలి.
మనసు కన్నీరు కార్చినప్పుడు ఓదార్చే చెలిమి ఉండాలే..
స్నేహితులను సంపాదించుకోవడం సులువే
కానీ ఆ స్నేహాన్ని కాపాడుకోవడం
ఆ బంధాన్

తాత, మనవడికి చేయూత...

- **తక్షణ సాయం కింద పదివేల రూపాయలు**
- **తాత్కాలిక పునారవాసం ఏర్పాటు**
- **తాత మనవడికి ఆరోగ్య పరీక్షలు**

వికారాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు 2 (జనం సాక్షి): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు స్మశాన వాటికలో నివాసం ఉంటున్న తాత మనవడికి పునారావాసం కల్పించడానికి జిల్లా అధికార యంత్రాంగం కదిలింది. పరిగి పట్టణం గంగపుత్ర స్మశాన వాటికలో ఒక కుటుంబం తలదాచుకుంటున్న విషయంపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి విచారణకు ఆదేశించిన విషయం పాఠకులకు విదితమే. ఈ విషయమై డి ఆర్ డి ఏ పిడి పరిగి తహసిల్దార్ శనివారం విచారణ జరిపి జిల్లా కలెక్టర్ కు సమగ్ర నివేదిక అందజేశారు. ఈ మేరకు వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ గంగపుత్ర స్మశాన వాటికలో తలదాచుకున్న బాధితులను పరామర్శించారు. వారి పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం కనీస అవసరాల కోసం పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. వారి బాగోగులు వారికి పూర్తిస్థాయిలో వసతి కల్పించడానికి అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వాళ్లకు పునరావాసం కల్పించే విషయమై అధికారులతో చర్చించారు .ఎంపీడీవో ఆఫీస్ పరిధిలో ఉన్న హౌసింగ్ భవనంలోకి రిక్షా కార్మికుడు నారాయణ కు తాత్కాలికంగా పునరావసం కల్పించినట్టు పరిగి తహసిల్దార్ వెంకటేశ్వరి తెలియజేశారు. అంతేకాకుండా గత కొంతకాలంగా స్మశాన వాటికలోనే వారు జీవన ఉపాధి గడుపుతున్నందున వారికి పూర్తిస్థాయిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా వైద్య అధికారి స్వయంగా పర్యవేక్షించి పరీక్షలు నిర్వహించిన అనంతరం పునరావస కేంద్రంలో ఉంచారు. తాత మనవడి ఆరోగ్య పరిస్థితి బాగా లేనట్లు తెలుస్తోంది. నారాయణ వయోవృద్ధుడు కావడంతో బిపి పెరిగి ఇబ్బందికి గురి అవుతున్నట్లు తెలుస్తుంది. నారాయణతోపాటు ఆయన మనవడికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. మనవడికి మతిస్థిమితం ఉన్నట్లు తెలుస్తుంది. అంతేకాకుండా వారికి శాశ్వత ప్రయోజనాలు కల్పించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. స్మశాన వాటికలో నివాసముంటున్న నారాయణ కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని వారికి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి తెలియజేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఆయనకు ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. మనవడిని చదివించడానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. వారికి శాశ్వత పరిష్కారం చూపించే వరకు ఓల్డ్ ఏజ్ హోమ్ లో నారాయణను గురుకులంలో ఆయన మనవడిని ఉంచాలని అధికారులు యోచిస్తున్నారు.

మణికొండలో రోడ్ల విస్తరణ చేయండి

రాజేంద్రనగర్, ఆగస్టు 2 (జనం సాక్షి) : మణికొండ మున్సిపాలిటీలో ప్రజలు నిత్యం ఇరుకు రోడ్డులతో ట్రాఫిక్ సమస్యలు, జరుగుతూ రోడ్డు ప్రమాదాలపై లింక్ రోడ్ల విస్తరణ, నూతన రోడ్డు నిర్మాణం పనులకై ప్రభుత్వ భూమిని కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాలు సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని శనివారం ఆయన నివాసంలో మణికొండ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కస్తూరి నరేందర్ కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మంత్రి దృష్టికి లాంకో హిల్స్ కొత్త రోడ్డు నుండి పుప్పాలగూడ లక్ష్మీనరసింహస్వామి స్వామి దేవాలయం సర్కిల్ వద్దకు పుప్పాలగూడ ప్రభుత్వ భూమి నుండి నూతన రోడ్డు నిర్మాణం పనులకు ప్రభుత్వ భూమిని కేటాయించాలని రోడ్డు నిర్మాణం పనులను త్వరగా చేపట్టేందుకు అధికారులను ఆదేశించాలని మంత్రి విన్నవించారు. ఈ కార్యక్రమంలో మణికొండ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జితేందర్, కార్యనిర్వాహక అధ్యక్షులు కిరణ్ కుమార్, మాజీ కౌన్సిలర్ లక్ష్మీనారాయణ, మాజీ కో ఆప్షన్ సభ్యులు అహ్మద్ షా ఖాన్ పాల్గొన్నారు.

ఘోర రోడ్డు ప్రమాదం

పరిగి, ఆగస్టు 2 (జనం సాక్షి) : వికారాబాద్ జిల్లా పరిగి మున్సిపల్ పరిధిలోని సుల్తాన్ పూర్ గేట్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. నేషనల్ హైవేపై దంపతులు వెళ్తున్న బైకును వెనుక నుండి ఢీకొట్టిన డీసిఎం బైక్ పై వెళ్తున్నమహిళ అక్కడికక్కడే మృతి చందగా భర్త పరిస్థితి విషమంగా ఉండడంతో పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వికారాబాద్ ఆస్పత్రికి రేపర్ చేసిన వైద్యులు వైద్యుల సలహా మేరకు వికారాబాద్ ఆసుపత్రికి తరలించారు ఈప్రమాదానికి గురైన వారు బొంరాస్ పేట మండలం నాగిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన సాయిలు,లక్ష్మీ దంపతులు పరిగి నుండి నాగిరెడ్డి పల్లి వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యారు ఢీ కొట్టిన డీసిఎం ను అదుపులోకి తీసుకున్న పరిగి పోలిస్ బృందం.

బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలి

- **ధర్నా చౌక్ కు తరలిన భాజపా నేతలు**

రాజేంద్రనగర్, ఆగస్టు 2 (జనం సాక్షి) : మణికొండ మున్సిపాలిటీ భాజపా ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు పిలుపుమేరకు మైలార్ దేవ్ పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, అధ్యక్షుడు పాండు, రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు పి. సందీప్ ముదిరాజ్, మణికొండ మున్సిపాలిటీ భాజపా అధ్యక్షుడు రవికాంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద భాజపా ధర్నా చౌక్ కు తరలి వెళ్లిన బిజెపి నాయకులు కామారెడ్డి డిక్లరేషన్ బిసి డిక్లరేషన్ పై కాంగ్రెస్ కపట నాటకం వహిస్తుందని ఎన్నికల్లో బీసీలకు ఇచ్చిన హామీలు కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని, కాంగ్రెస్ మోసపూరిత బీసీ రిజర్వేషన్లు ముస్లింలకు 10 శాతం కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ, మొత్తం 42 శాతం బీసీలకు రిజర్వేషన్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్, కార్యవర్గ సభ్యులు అంజన్ కుమార్ గౌడ్, మణికొండ మున్సిపాలిటీ మాజీ అధ్యక్షుడు వై. శ్రీధర్, జోగి రవి, మల్లారెడ్డి, హరికిషన్. జి, బాలకృష్ణ. మాజీ కౌన్సిలర్ వందన, మాజీ కోఆప్షన్ మెంబర్ జె. లక్ష్మి , మహిళా మోర్చా అధ్యక్షురాలు అనిత, సిహెచ్ ఇందిరా, ఉపాధ్యక్షులు సి. సంగీత వెంకటాచారి, మధు ఓర్స్, కార్యదర్శి రేఖ ఆనందరావు, ఓబీసీ మోర్చా రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు బి. శివకుమార్, శంకర్ సింగ్, వేణు, ప్రధాన కార్యదర్శి శివరాం రెడ్డి, శ్రీనివాస్ మున్సిపాలిటీ కోశాధికారి వై.యాదయ్య, బి.శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

మల్కాజిగిరి, ఆగస్టు 2 (జనంసాక్షి) : మౌలాలి డివిజన్ మోడల్ సుధానగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కాలనీవాసులు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ, మోడల్ సుధా నగర్ కాలనీలో ప్రస్తుతం సింగిల్ ఫేస్ విద్యుత్ సరఫరా ఉందని దీనికి బదులుగా త్రీఫేస్ విద్యుత్ సరఫరా అందజేయాలని, డ్రైనేజీ, కాలనీ బోర్వెల్ రిపేరింగ్, చిన్నపాటి వర్షానికి ఓపెన్ డ్రైనేజీ కాల్వ పొంగి వరద నీరు ఇళ్లలోకి వస్తున్నాయని బాక్స్ డ్రైనేజీ ఏర్పాటు చేయాలని వినతి పత్రాలు అందజేసి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చినట్లు తెలిపారు. సానుకూలంగా స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో వెంటనే మాట్లాడి సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, నరేష్, నవాబ్, కాశీనాథ్, కాలనీవాసులు సత్యనారాయణ, మల్లారెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

ఉప్పల్, ఆగస్టు 2 (జనం సాక్షి) : విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు.శనివారం రామంతపూర్‌లోని స్ఫూర్తి ఉమెన్స్ డిగ్రీ కళాశాల లో ఏర్పాటు చేసిన ఫెస్ట్ కి ముఖ్య అతిథిగా హాజరై పట్టాలను అందజేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి , తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే కిషోర్ కుమార్.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి సమాజానికి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మెన్ సురేష్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గంధం నాగేశ్వర్ రావు, కంచర్ల సోమిరెడ్డి, పిల్లి నాగరాజు, గుడి మధుసూధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- **రాష్ట్ర వైద్య విద్యాసంచారకులు నరేందర్ కుమార్**

వికారాబాద్ జిల్లా బ్యూరో, ఆగస్టు 2 (జనం సాక్షి) : రాష్ట్ర వైద్య విద్య సంచాలకులు డాక్టర్ నరేందర్ కుమార్ శనివారం వికారాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే. లలితా దేవి, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజ్యలక్ష్మి డి ఎం ఈ వెంట ఉన్నారు. అనంతరం రాష్ట్ర వైద్య విద్య సంచాలకులు ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి అక్కడ చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. వైద్యులకు ఆసుపత్రిలో సేవల విస్తరణ కొరకు తగు సూచనలు చేశారు. అనంతరం వికారాబాద్ పట్టణంలోని పాత ఆసుపత్రి లో నిర్వహిస్తున్న మాతా శిశు సంరక్షణ సేవలను పరిశీలించారు. ఆసుపత్రిలో వివిధ విభాగాలలో జరుగుతున్న రిపేర్లు మరియు మార్పులను పరిశీలించి తగు సూచనలు చేశారు. మాతా శిశు సంరక్షణ వార్డులో చికిత్స పొందుతున్న రోగులతో వారికి అందుతున్న సేవల గురించి తెలుసుకున్నారు.అనంతరం రామయ్య గూడ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఇక్కడ అందజేస్తున్న సేవలకు సంబంధించి వివరాలు తెలుసుకోవడమే కాకుండా రికార్డులను పరిశీలించారు. ప్రస్తుతం సీజనల్ డిసీస్ అధికంగా నమోదయ్యే అవకాశం ఉంది కాబట్టి వైద్యులందరూ కూడా అప్రమత్తంగా ఉండి ప్రజలకు సేవలు అందించడమే కాకుండా, క్షేత్రస్థాయి సిబ్బంది ద్వారా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే. లలితాదేవి, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజ్యలక్ష్మి, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మల్లికార్జున్, డాక్టర్ రామచంద్రయ్య, వివిధ విభాగాల వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

72 గంటల నిరాహార దీక్షను విజయవంతం చేయాలి

ఓయూ, ఆగస్టు 2 (జనం సాక్షి) : బీసీ బిల్లు సాధన కోసం ఆగస్టు 4, 5, 6, 7 తేదీన తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఇందిరా పార్కు వద్ద నిర్వహించే 72 గంటల నిరాహార దీక్షను విజయవంతం చేయాలని జాగృతి విద్యార్థి నాయకులు శనివారం పిలుపునిచ్చారు. ఈ మేరకు జాగృతి విద్యార్థి నాయకులు ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద బీసీ బిల్లు సాధన కోసం 72 గంటల నిరాహార దీక్ష పోస్టర్లు విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ ఇస్తే 23 వేల పై చిలుకు బీసీలు సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, అవుతారన్నారు.

డివిజన్ అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యేను కోరిన కార్పొరేటర్

ఉప్పల్, ఆగస్టు 2 (జనం సాక్షి) : రామంతపూర్ డివిజన్‌లోని వెంకట్ సాయి నగర్, సత్యా నగర్, రామ్ శంకర్ నగర్‌లలో శివరేజ్ లైన్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని, కోటి రూపాయల నిధులతో శివరేజ్ లైన్ పనులను ప్రారంభించారు. తమ వాగ్దానాన్ని నిలబెట్టుకుంటూ అభివృద్ధి పనులు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా శివరేజ్ లైన్ సమస్యతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రామంతపూర్ బాగాయత్ ప్రాంత ప్రజలు, ఈ అభివృద్ధి పనులు ప్రారంభమైనందుకు హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు సాధనలో కార్పొరేటర్ బండారు శ్రీవాణి కృషి ఎంతో ఉందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బండారు శ్రీవాణి మాట్లాడుతూ ఎంపీ, ఎమ్మెల్యే సహకారంతో మరిన్ని అభివృద్ధి పనుల ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయనీ, వాటిని కూడా త్వరలో ప్రారంభిస్తాము అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావు, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు గంధం నాగేశ్వర్ రావు, బోసాని పవన్ ,ముత్తినేని జగదీష్, రేవు నరసింహ, సంతోష్ గుప్తా, కుమార్ స్వామి, నారాయణదాసు, వేముల తిరుపతయ్య, పడిగం నాగేష్, అల్లాడి నిరంజన్, కల్మకల లింగం, బద్రీనాథ్, ఇలిటం నరసింహారెడ్డి, తమ్మలి రవి, పర్రి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

100 కోట్లతో దేవాలయాల అభివృద్ధి

- **రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్య**

వికారాబాద్ జిల్లా బ్యూరో, ఆగస్టు 2 (జనం సాక్షి) : దాదాపు 100 కోట్ల వ్యయంతో దేవాలయ పునరాభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యార్ తెలిపారు.శనివారం కొడంగల్ పట్టణ కేంద్రంలోని వెంకటేశ్వర దేవాలయ అభివృద్ధిలో భాగంగా దేవాదాయ శాఖ కమిషనర్ వెంకట్ రావ్, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ధార్మిక సలహాదారులు గోవింద్ హరిలతో కలిసి దేవాదాయ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యార్ కొడంగల్ లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రెటరీ మాట్లాడుతూ... కొడంగల్ వెంకటేశ్వర దేవాలయాన్ని ఆగమశాస్త్రం ప్రకారం ప్రణాళిక బద్ధంగా పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు భక్తుల సౌకర్యార్థం పూర్తిస్థాయిలో తిరుపతి తరహాలో ఆగమ శాస్త్రం ప్రకారం దేవాలయ నిర్మాణం చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు. దేవాలయ ప్రాంగణంలో కళ్యాణ మండపం, కోనేరు అభివృద్ధి, ప్రసాదం కౌంటర్ల ఏర్పాటు తదితర పనులను చేపట్టి త్వరలో పనులు పూర్తి చేయనున్నట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రెటరీ అధికారులతో కలిసి దేవాలయ పునరాభివృద్ధిలో భాగంగా ఇండ్లు కోల్పోతున్న వారికి ఇండ్ల స్థలాలను కేటాయించిన లేఅవుట్ చేసిన ప్రాంతం, గోశాల, కోనేరునుసందర్శించారుపర్యటనలో భాగంగా వెంకటేశ్వర దేవాలయ సందర్శించుకున్న క్రమంలో వేద పండితులు ప్రిన్సిపల్ సెక్రెటరీకి పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా దేవాలయ పునరుద్ధరణ పనుల్లో భాగంగా దేవాలయ నిర్మాణంతో పాటు వివిధ సౌకర్యాల ఏర్పాట్లకు సంబంధించి వాస్తు శిల్పి సత్యనారాయణ మూర్తి పవర్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, తహసిల్దార్ విజయ కుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, దేవాలయ ఇ.ఓ.రాజెందర్ రెడ్డిలు పాల్గొన్నారు.దౌల్తాబాద్ వెంకటేశ్వర దేవాలయ అభివృద్ధికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పిస్తామని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యార్ అన్నారు.శనివారం కొడంగల్ నియోజకవర్గంలో దేవాలయ శాఖ కమిషనర్ వెంకట్ రావు, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ లతో కలిసి కొడంగల్, దౌల్తాబాద్‌లలో గల వెంకటేశ్వర దేవాలయాలను రాష్ట్ర దేవాలయ ప్రిన్సిపాల్ సెక్రటరీ శైలజ రామయ్యార్ సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు దేవాలయ నిర్మాణానికి నిధులను కేటాయించాల్సిందిగా విజ్ఞప్తి చేయగా.. తమ సూచనల మేరకు ప్రతిపాదన ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా స్పెషల్ సెక్రటరీ మాట్లాడుతూ... దేవాలయ ప్రాంగణం భక్తులకు ఎంతగానో ఆహ్లాదాన్ని కల్పించే విధంగా ఉందని, ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసుకుంటే అందరికీ సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. దేవాలయానికి ఆనుకుని ఉన్న చెరువులో బోటింగ్ చేసేందుకు అదేవిధంగా పార్కును ఏర్పాటు వల్ల ప్రజలకు వినోదంతో గడిపేందుకు ఎంతగానో తోడ్పడుతుంద ఆమె అభిప్రాయపడ్డారు. ప్రిన్సిపల్ సెక్రెటరీ పర్యటనలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డిలు ఉన్నారు.

ఉప్పల్, ఆగస్టు 2 (జనం సాక్షి) : రామంతపూర్ డివిజన్‌లోని వెంకట్ సాయి నగర్, సత్యా నగర్, రామ్ శంకర్ నగర్‌లలో శివరేజ్ లైన్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని, కోటి రూపాయల నిధులతో శివరేజ్ లైన్ పనులను ప్రారంభించారు. తమ వాగ్దానాన్ని నిలబెట్టుకుంటూ అభివృద్ధి పనులు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా శివరేజ్ లైన్ సమస్యతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రామంతపూర్ బాగాయత్ ప్రాంత ప్రజలు, ఈ అభివృద్ధి పనులు ప్రారంభమైనందుకు హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు సాధనలో కార్పొరేటర్ బండారు శ్రీవాణి కృషి ఎంతో ఉందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బండారు శ్రీవాణి మాట్లాడుతూ ఎంపీ, ఎమ్మెల్యే సహకారంతో మరిన్ని అభివృద్ధి పనుల ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయనీ, వాటిని కూడా త్వరలో ప్రారంభిస్తాము అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావు, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు గంధం నాగేశ్వర్ రావు, బోసాని పవన్ ,ముత్తినేని జగదీష్, రేవు నరసింహ, సంతోష్ గుప్తా, కుమార్ స్వామి, నారాయణదాసు, వేముల తిరుపతయ్య, పడిగం నాగేష్, అల్లాడి నిరంజన్, కల్మకల లింగం, బద్రీనాథ్, ఇలిటం నరసింహారెడ్డి, తమ్మలి రవి, పర్రి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
03 ఆగస్టు 2025

రాష్ట్రంలో నిరంతర విద్యుత్ అందించడమే ప్రభుత్వ లక్ష్యం

● ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

వనపర్తి బ్యూరో, ఆగస్టు 2 (జనంసాక్షి) : రాష్ట్రంలోని ప్రతి మారుమూల ప్రాంతాలకు నాణ్యమైన నిరంతర విద్యుత్ అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు.శనివారం వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం వెలటూరు గ్రామంలో రూ.2.2 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్, ఆర్థిక, ప్రణాళిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క రాష్ట్ర అబ్కారీ పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి తో కలిసి ప్రారంభోత్సవం చేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి. చిన్నా రెడ్డి, ఎస్పీడీసీఎల్ సిఎండి ముషారఫ్ అలీ ఫారుకి, వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి, నాగర్ కర్నూల్ శాసనసభ్యులు కూచుకుల్ల రాజేష్ రెడ్డి, డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణు వర్ధన్ రెడ్డి సైతం ఉన్నారు.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోనీ ప్రతి మారుమూల ప్రాంతానికి నాణ్యమైన నిరంతర విద్యుత్ ఇవ్వటమే ప్రభుత్వం ధ్యేయం అన్నారు. ఇందులో భాగంగానే నేడు మారుమూల

గ్రామమైన చిన్నంబావి వెలటూర్ గ్రామంలో ఒక 33/11 కెవి సబ్ స్టేషన్ ప్రారంభోత్సవం చేసుకోవడం జరిగిందన్నారు. దీనితో పాటు పానగల్ మండల పరిధిలో రూ. 49.86 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న132/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి, పానగర్ మండలం జమ్మూపూర్ గ్రామంలో రూ. 2.02 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి నేడు కొల్లాపూర్‌లో శంకుస్థాపనలు చేయనున్నట్లు తెలిపారు. పానగల్ మండలంలో 132/33 కెవి సబ్ స్టేషన్ నిర్మాణం పూర్తి అయి ప్రారంభిస్తే అక్కడి నుండి కొత్తగా మరో (15)33/11 సబ్ స్టేషన్ల నిర్మాణానికి అనుసంధానం చేయవచ్చన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని కోడేరు మండలంలోని మైలారం, మాచుపల్లి, పస్పుల, పెద్ద కొత్తపల్లి మండల పరిధిలో వెన్నంచర్ల, మరికల్ గ్రామాలకు సంబంధించిన మరో 4 సబ్ స్టేషన్లకు కొల్లాపూర్ లో శంఖుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.వెలటూర్ గ్రామంలో రూ. 2.2 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన 33/11 కెవి సబ్ స్టేషన్ ద్వారా 3 ఫీడర్ల తో 950 బోరుబావులు, 600 డొమెస్టిక్ కనెక్షన్లు ఇవ్వడానికి ఉపయోగపడుతుంది. మూడు ఫీడర్ల కింద 6 గ్రామాలు వెలటూర్, చిన్న మహదేవ్, అయ్యవారిపల్లి, కాలురు, వెంకటంపల్లి, సోలీపూర్ గ్రామాలకు మూడు ఫేజ్‌ల నాణ్యమైన విద్యుతు అందనుంది. ఆయా గ్రామాల పరిధిలోని గృహ, వ్యవసాయ భూములకు కరెంట్ కష్టాలు తీరనున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రావుల గిరిధర్, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఇంచార్జి సుబ్రమణ్యం, టి.జి.ఎస్.పి.డి.సి ఎల్ ఎస్. ఈ యు. బాలస్వామి, డిఈ శ్రీనివాస్, గ్రంథాలయ చైర్మన్ గోవర్ధన్ సాగర్, కాంగ్రెస్ నాయకులు కొత్త కళ్యాణ్ రావు, జూపల్లి అరుణ్, రాజేంద్ర ప్రసాద్, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు హెల్పింగ్ హాండ్స్ మెటీరియల్ పంపిణీ

మల్దకల్, ఆగస్టు 2 (జనంసాక్షి) : మండల కేంద్రంలోనిజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కేజీబీవీ పాఠశాలలో హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శనివారంపదవ తరగతి విద్యార్థిని,విద్యార్థులకు తెలుగు,హిందీ,ఆంగ్లం, సంబంధించిన హెల్పింగ్ హాండ్స్ మెటీరియల్ ను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మండల విద్యాధికారి జి సురేష్ మాట్లాడుతూ పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలను సాధించాలని,ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించే విధంగా కృషి చేయాలని కోరారు.హెల్పింగ్ హాండ్స్ ట్రస్ట్ ఆర్గనైజర్స్ రత్న సింహా రెడ్డి మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులకు తమ వంతు సహాయంగా ఈ సంవత్సరం హెల్పింగ్ హాండ్స్ మెటీరియల్ అందజేస్తున్నామని,ప్రతి విద్యార్థి మెటీరియల్ లను సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు.ఈ సందర్భంగాట్రస్టు సభ్యులు రత్న సింహారెడ్డిని మండల విద్యాధికారి జి సురేష్ పాఠశాల తరపున సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జాకీర్ హుస్సేన్,రాజేశ్వర్ రెడ్డి,పాల్గొన్నారు.

క్రీడారంగాన్ని అత్యున్నత స్థాయిలో నిలబట్టే దిశగా ప్రభుత్వం కృషి

మఖ్తల్, ఆగస్టు 2 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరవతో తెలంగాణ రాష్ట్రాన్ని క్రీడారంగంలో అత్యున్నత స్థాయిలో నిలబట్టే దిశగా తెలంగాణ క్రీడా విధాన ప్రణాళికను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. అందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన స్పోర్ట్స్ పాలసీపై మక్తల్ నియోజవర్గ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏ రవికుమార్ ఆధ్వర్యంలో క్రీడాకారులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ నూతన క్రీడా విధానంలో భాగంగా రాష్ట్రంలోని ప్రతి పూర్వపు ఉమ్మడి జిల్లాలో ఒక స్పోర్ట్స్ స్కూల్ ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. దీంతోపాటు రాష్ట్రంలోని మొత్తం 119 అసెంబ్లీ నియోజకవర్గాలలో మినీ స్టేడియాలను ఏర్పాటు చేసే దిశగా ప్రణాళికలను రచించిందని తెలిపారు. సామాజిక, గిరిజన, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో క్రీడా అకాడమీలు ఏర్పాటు చేసి యువతలో క్రీడా నైపుణ్యాలు పెంపొందించే దిశగా చర్యలు చేపట్టనున్నారు. తెలంగాణ స్పోర్ట్స్ పాలసీలో భాగంగా వివిధ క్రీడల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం, యువతకు క్రీడల్లో శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి మార్గం దిశగా చర్యలు చేపట్టనున్నారు. షూటింగ్ ఇతర అంశాల్లో భాగంగా స్పోర్ట్స్ అండ్ క్లేవ్ లో అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు అభినవ్ బింద్రా, గగన్ నారంగ్, అంజు బాబి జార్జ్, అనిల్ కుంబ్లే లాంటి క్రీడాకారులతో చర్చించి క్రీడారంగం ఎదుగుదలకు పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి అంతర్జాతీయ స్థాయిలో ఒలింపిక్స్ లాంటి మెగా ఈవెంట్లలో

క్రీడాకారులు పథకాలు సాధించే దిశగా క్రీడా పాలసీని తయారు చేయనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద క్రీడాకారులు సైతం అంతర్జాతీయ ఈవెంట్లలో పాల్గొనే విధంగా వారికి సరైన మౌలిక సదుపాయాలు కల్పించి, అర్హులైన క్రీడాకారులకు అంతర్జాతీయ స్థాయిలో శిక్షణ ఇప్పించి వారిని పథకాలు సాధించే దిశగా తయారు చేయాలన్నదే తెలంగాణ స్పోర్ట్స్ పాలసీ ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బి .గణేష్ కుమార్, మాజీ ఉపసర్పంచ్ కట్ట సురేష్ కుమార్ గుప్తా, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శ్రీనివాసులు, శాలం, ఫయాజ్, నాయకులు వాకిటి శ్యామ్, కట్ట వెంకటేష్, బోయ వెంకటేష్, మందుల నరేందర్, శంషొద్దీన్, అఫ్రోజ్, మెకానిక్ రాము, మహమ్మద్ రఫ్, నీల గౌడ్ ఆనంద్, గుంతలి శివకుమార్, బ్యాగరి సురేష్, బహదూర్, సురేష్ గౌడ్, ముసలాయిపల్లి నాగరాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ ముస్కాన్‌తో 56 మంది బాల కార్మికులకు విముక్తి

● బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన సామాజిక బాధ్యత
● ఎస్పీ యోగేష్ గౌతం

నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు 2 (జనం సాక్షి) : ఆపరేషన్ ముస్కాన్ ద్వారా 56 మంది బాలకార్మికులకు విముక్తి కల్పించడం జరిగిందనీ జిల్లా ఎస్పి యోగేష్ గౌతం తెలిపారు.బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడం సామాజిక బాధ్యత అని అన్నారు. సంవత్సరంలో రెండు సార్లు ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలను నిర్వహించి తప్పిపోయిన, వదిలివేయ బడిన, వివిధ రకాల బాల కార్మికులు కిరాణం షాప్ లలో, మెకానిక్ షాపులలో, ఇటుక బట్టీలలో, హోటళ్లలో, వివిధ కంపనిలలో పనిచేస్తూ రోడ్డుపై భిక్షాటన చేస్తున్న పిల్లలు బాలకార్మికులుగా ఉన్నట్లయితే అలాంటి వారిని గుర్తించి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి వారికి అప్పగిం చడం, లేదా స్టేట్ హోమ్‌కు పంపించడం జరుగుతుందన్నారు. దానిలో భాగంగా నారాయణపేట జిల్లా వ్యాప్తంగా ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం జిల్లాల పోలీస్ అధికారులు, సిబ్బంది, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, లేబర్ డిపా ర్ట్మెంట్, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్, చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్మెంట్, హెల్త్ డిపార్ట్మెంట్, వివిధ శాఖల సమన్వయంతో ఆపరేషన్ ముస్కాన్ విజయ వంతం గా ముగిసిందని జిల్లా ఎస్పీ తెలిపారు. నారాయణ పేట జిల్లా పరిధిలో ఆపరేషన్ ముస్కాన్ టీంలు ఏర్పాటు చేసి జులై 1 నుండి 31 వరకు ఆపరేషన్ ముస్కాన్‌కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తం గా నిర్వహించి 56 మంది బాల కార్మికులను పట్టుకోవ డం జరిగిందన్నారు..అందు లో 48 బాలురు, 08 మంది బాలికలను పట్టుకొగా అందు లో 16 మంది ఇతర రాష్ట్రాల కు చెందిన బాల కార్మికులు ఉన్నారు. మొత్తం 20 కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.బాల కార్మికులుగా ఉన్న

పిల్లలకు, తల్లిదండ్రులకు పాఠశాలలో చర్చే విధంగా కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగింది అని తెలిపారు.బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత మనందరిపైనా ఉన్నదని ఆది ఒక సామాజిక బాధ్యతగా గుర్తించి, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం బాధ్యతాయుతంగా కృషి చేయాలని కోరారు.బాలల హక్కులను, బాలకా ర్మిక వ్యవస్థను నిర్మూలించ డానికి ఆపరేషన్ స్మైల్, ముస్కాన్ కార్యక్రమాలను నిరంతరం నిర్వహించడం జరుగుతుందనీ అన్నారు. అలాగే ఎవరైనా బాలలను పనిలో పెట్టుకున్న, ఎక్కడైనా పనిచేసిన, తప్పిపోయిన వదిలివేయబడిన బాలల సమాచారం తెలిసిన వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 (చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్) వారికి మరియు డయల్ 100 కి కాల్ చేసి పోలీసు వారికి సమాచారం ఇవ్వాలనీ కోరారు. బాలకార్మికులుగా పెట్టుకున్న వారిపై కూడా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసు కుంటామని అన్నారు. పోలీ సు శాఖతో కలిసి ఆపరేషన్ స్మైల్ విజయవంతం చేయ డంలో కృషి చేసిన వివిధ శాఖల అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

రసాభాసగా రేషన్ కార్డుల పంపిణీ

● సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకంపై గొడవ
● కాంగ్రెస్-బీఆర్ఎస్ నాయకుల మధ్య బాహాబాహి
● ఆగ్రహంతో తోపులాటకు దిగిన ఇరువర్గాల వారు
● సంఘటన స్థలానికి చేరుకున్న నాలుగు స్టేషన్ల పోలీసులు
● గొడవను నిలువరించేందుకు చెమటోడ్చిన పోలీసులు

హత్నూర, ఆగస్టు 2 (జనం సాక్షి) : సంగారెడ్డి జిల్లా,హత్నూర మండలంలోని రైతు వేదికలో శనివారం నిర్వహించిన కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం రసాభాసగా సాగింది. కాంగ్రెస్ – బీఆర్ఎస్ నాయకుల మధ్య జరిగిన తోపులాట తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది.స్థానిక ఎమ్మెల్యే సునిత లక్ష్మారెడ్డి, తహసీల్దార్ ఫర్వీన్ షేక్ తో పాటు అధికారుల బృందం వేదిక పై వుండగానే బిఆర్ఎస్-కాంగ్రెస్ నాయకులు బాహాబాహీకి దిగారు. ఇరువర్గాల మధ్య మాటల యుద్ధం నెలకొంది. రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేయాలనే విషయంలో గొడవ మొదలైనట్లుగా తెలిసింది. సిఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేయాల్సిందేనంటూ కాంగ్రెస్ నాయకులు పట్టుబట్టడంతో దానిని బీఆర్ఎస్ నాయకులు వ్యతిరేకించారు. దీంతో కోపోద్రిక్తులైన ఇరు వర్గాల వారు ఆందోళనకు దిగారు. ముఖ్యమంత్రికి

అనుకూలంగా ఓ వర్గం వారు, వ్యతిరేకంగా మరో వర్గం వారు నినాదాలు చేస్తూ తోపులాటకు దిగారు.పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పటానెరు, శివంపేట, నర్సాపూర్, జిన్నారం ఠాణాల నుండి వచ్చిన పోలీసులు రంగప్రవేశం చేసి ఆందోళన కారులకు సర్దిచెప్పి శాంతింప జేశారు.గొడవను సద్దుమణిగించడం కోసం పోలీసులు చెమటోడ్చారని చెప్పవచ్చు.ఇరు పార్టీల నాయకులను వేదికలో నుండి బయటకు పంపించి వేశారు.అనంతరం ఎమ్మెల్యే సునిత లక్ష్మారెడ్డి చేతుల మీదుగా కొత్త రేషన్ కార్డులను,కళ్యాణ లక్ష్మి,శాదీ ముబారక్ చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. ఇదిలా ఉండగా ఇరు వర్గాల వారు ఒకరిపై ఒకరు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లుగా తెలిసింది.

అంగన్‌వాడీ ఆవరణలో పారిశుధ్యంపై చర్యలు

● "జనం సాక్షి" కథనానికి స్పందన..!
● పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మత్తులు

న్యాల్‌కల్, ఆగస్టు 2 (జనం సాక్షి) : ఈ నెల 2న (శనివారం) ప్రచూరించిన.. అంగన్ వాడి చుట్టూ.. లోపించిన పారిశుద్ధ్యం, దుర్వాసన, క్రిమి కీటకాలతో చిన్నారుల అవస్థలు.."జనం సాక్షి" కథనానికి మండల, గ్రామ పంచాయతీ అధికారులు స్పందించారు. శనివారం ఉదయం ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ సౌజన్య, గ్రామ పంచాయతీ అధికారి ధనరాజ్‌లు న్యాల్ కల్ లోని ఏ వన్ (1) అంగన్వాడి కేంద్రం ఆవరణలో లోపించిన పారిశుధ్యంపై దృష్టి సారించారు. గ్రామ పంచాయతీ కార్మికులతో అంగన్ వాడి ఆవరణ చుట్టూ పేరుకు పోయిన చెత్త, చెదారం, పొదలను తొలగించి కొంత మేరకు మెరు గుపరిచారు. గ్రామస్తులకు మిషన్ భగీరథ,బోరు బావుల ద్వారా త్రాగు నీటిని అందించే ప్రధాన పైప్‌లైన్ లీకేజ్ అవ్వడంతో గత కొన్ని రోజులుగా మరమ్మత్తులకు నోచుకోక అంగన్వాడి కేంద్రం ఆవరణలో మురుగు నీరు చేరి దుర్వాసన నెలకొంది. గత కొన్ని రోజులుగా మరమ్మత్తులకు నోచుకోని పైప్ లైన్ లీకేజీలను వెంటనే మరమ్మత్తులు చేపట్టి తాగునీరు వృధా అవ్వకుండా, త్రాగునీరు కలుషితం అవ్వకుండా చర్యలు చేపట్టారు. గ్రామ పంచాయతీ ఆవరణలోని అంగన్వాడి కేంద్రం, పోచమ్మ దేవాలయ ఆవరణలో మురుగు నీరు చేరకుండా తాత్కాలికంగా కాలువలను తవ్వి మురుగు నీరు తరలించే విధంగా చర్యలు

చేపట్టారు. త్వరలోనే అంగన్వాడి ఆవరణ ప్రదేశంలో ఖాళీగా ఉన్న పరిసర ప్రాంతంలో వివిధ రకాల మొక్కలను నాటనున్నట్లు గ్రామ పంచాయతీ అధికారి ధనరాజ్ "జనం సాక్షి"కి వివరించారు. అంగన్వాడి కేంద్రం ఆవరణలో చెత్తా, చెదారం వేయడం, పశువులు, వాహనాలను నిలిపితే పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం సంబంధిత వ్యక్తులపై చర్యలు తప్పవని గ్రామ పంచాయతీ కార్యదర్శి హెచ్చరించారు. అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులు, బాలింతలు, గర్భిణీలు, కేంద్రం నిర్వాహకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు చేపడతామన్నారు. అందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కార్యదర్శి కోరారు.

డిసెంబర్ 9లోపు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ మొత్తాల చెల్లింపు

● మీడియా సమావేశంలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి స్పష్టీకరణ..

జడ్చర్ల, ఆగస్టు 2 (జనం సాక్షి) : డిసెంబర్ 9వ తేదీ లోపుగా ఉదండాపూర్ రిజర్వాయర్ భూ నిర్వాసితులకు సంబంధించిన ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ మొత్తాలను అన్ని కుటుంబాలకు చెల్లించడం జరుగుతుందని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి ప్రకటించారు. నేడు ఉదండాపూర్ నిర్వాసితులందరికీ భోజనాలు ఏర్పాటు చేసి ఈ విషయాన్ని చెబుతామని, తమ హయాంలో ఉదండాపూర్ ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద ఇప్పటి వరకూ రూ.250 కోట్లు మంజూరు అయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ వల్లూరు గ్రామం, తాండాలకు చెందిన ప్రజలు అధికారులకు సహకరించడంతో వారి గ్రామాలకు అవార్డు పాసైయిందని వారి ఖాతాల్లో ప్రభుత్వం డబ్బులను కూడా జమ చేసిందని అన్నారు. ఉదండాపూర్ లో మాత్రం కొంత మంది రాజకీయాలు చేస్తూ ప్యాకేజీపై అభ్యంతరాలు పెడుతున్న కారణంగా ఇప్పటి వరకూ అవార్డు కూడా పాస్ కాలేదన్నారు. ఉదండాపూర్ కు చెందిన నిర్వాసితులు అందరూ మంగళవారం కలెక్టరేట్ కు వెళ్లి తమ అభ్యంతరాలన్నింటినీ పరిష్కరించుకోవాలని, ఆ తర్వాత వారికి అవార్డు పాస్ కావడం జరుగుతుందని తెలిపారు. ఉదండాపూర్ ఆర్అండ్ఆర్ ప్యాకేజీ మొత్తాన్ని రూ.25 లక్షలకు పెంచే ప్రతిపాదన ఇంకా ప్రభుత్వ

పరిశీలనలో ఉందని, ఇప్పటి వరకూ దాన్ని ప్రభుత్వం తిరస్కరించలేదని, వారంలోనే దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉందన్నారు.

సీఎం కోరిక మేరకు భూ నిర్వాసితులందరికీ భోజనం ఏర్పాటు : ఎమ్మెల్యే

ఉదండాపూర్ నిర్వాసితుల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా ఉన్నారని, సీఎం ఈ విషయం గురించి తనకు ప్రత్యేకంగా ఫోన్ చేశారని, డిసెంబర్ 9 లోపుగా ఉదండాపూర్ ఆర్అండ్ఆర్ ప్యాకేజీ బకాయిలన్నింటినీ చెల్లిస్తామని హామీ ఇచ్చారని, ఈ విషయాన్ని ఉదండాపూర్ తో పాటుగా నిర్వాసితులందరికీ తన తరుపున భోజనం పెట్టి చెప్పాలని కోరారని అనిరుధ్ రెడ్డి వెల్లడించారు. సీఎం కోరిన ప్రకారంగానే నేడు ఉదండాపూర్ నిర్వాసితులందరికీ ఆ గ్రామంలోనే భోజనాలు ఏర్పాటు చేస్తామని, తాను కూడ వారితో సహపంక్తి భోజనం చేస్తానని అన్నారు. తాము పుట్టి పెరిగిన గ్రామాన్ని కోల్పోతున్న నిర్భాగ్యుల కోసం ఏర్పాటు చేస్తున్న ఈ భోజన కార్యక్రమాన్ని రాజకీయాలకు అతీతంగా అందరూ హాజరు కావాలని అనిరుధ్ రెడ్డి ఆహ్వానించారు. భోజనాల సందర్భంగా తాము ఎలాంటి రాజకీయాల గురించి మాట్లాడబోనని స్పష్టం చేశారు.

167వ జాతీయ రహదారి సమస్యపై సమావేశం

జడ్చర్ల మీదుగా వెళ్తున్న 167వ జాతీయ రహదారి నుండి బాదేపల్లిలోని పాత బజారు కు పెద్ద వాహనాలు వెళ్లేందుకు వీలు లేకుండా డిజైన్ ఉందని, ఈ సమస్య పరిష్కరించడానికి జాతీయ రహదారుల శాఖ అధికారులతో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని, రహదారిలో ఉన్న విగ్రహాలను తరలించే విషయంలో ఉన్న సమస్యను కూడా అందరితో కలిసి చర్చించి పరిష్కరించాలని ఇప్పటికే తాను మున్సిపల్ చైర్ పర్సన్, కౌన్సిలర్లు, కమీషనర్ ను కోరామని తెలిపారు. తాను చదువుకున్న వాడినని తన వద్ద దొంగ డిగ్రీలు లేవని, అందుకే ఈ విషయంలో ఎవరో చేసిన వాఖ్యలపై తాను స్పందించబోనని స్పష్టం చేశారు. జడ్చర్ల బైపాస్ రోడ్ విషయం గురించి కూడా అధికారిక డీపీఆర్ తర్వాత స్పష్టత వస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కోనేటి పుష్పలత, కౌన్సిలర్లు, నాయకులు బాధిమి శివకుమార్, మీనాజుద్దీన్, వెంకటేశం, నిత్యానందం తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం ప్రకారం మెనూప్రకారం అందించాలి

● ఎంఈఓ వెంకటేశ్వరరావు

మల్దకల్, ఆగస్టు 2 (జనంసాక్షి) : కేటిదొడ్డి మండల పరిధిలోనిఉమిత్యాలతాండపాఠశాలను శనివారంఎంఈఓ వెంకటేశ్వరరావుసందర్శించి మధ్యాహ్న భోజనాన్ని, విద్యార్థుల ముఖహాజరును పరిశీలించారు.ఎఫ్ ఎల్ ఎన్ బోధన అంశాలును విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయులకు అకాడమిక్ పరంగా సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది.మధ్యాహ్నం భోజనం ఏజెన్సీ వారు సమయానికి రాకపోవడం వలన స్వయంగా మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర రావ్, ప్రధానోపాధ్యాయులు వినోద్, సీ ఆర్ పి పాపయ్య స్వయంగా మెనూ ప్రకారం వండి వడ్డించడం జరిగింది.కేటీ దొడ్డి స్కూల్ ను సందర్శించి మెనూ పాటించని ఏజెన్సీ వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తు గ్రామస్తుల,విద్యార్థులతో మీటింగ్ ఏర్పాటు చేసి మధ్యాహ్నం భోజనం మెనూ లో ఎలాంటి లోపాలు ఉన్న తొలగిస్తామని హేచ్చరించారు.ఈకార్యక్రమంలో హెచ్ఎంవినోద్, సిఆర్పి లు పాపయ్య, యుగేందర్, నరేష్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్, సిఆర్పిఎఫ్ కన్వినర్ యుగంధర్ గౌడ్ పాల్గొన్నారు.

ప్రణాళికా బద్ధంగా పట్టణ సుందరీకరణ

అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే రేవూరి

పరకాల, ఆగస్టు 2 (జనం సాక్షి): పరకాల పట్టణం ముంపుకు గురికాకుండా ప్రణాళికాబద్ధంగా అంచలవారిగా నగరాన్ని తలపించేలా సుందరీకరణ చేసి అభివృద్ధి చేస్తామని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు.శనివారం పరకాల మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను సంబంధిత అధికారులతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు. 19వ వార్డు పరిధిలోని పాత సిఎంఎస్ గోదాం వద్ద,14 వ వార్డు పరిధిలోని పాత మసీద్ వాడ, గంద్ర వాడలో జరుగుతున్న డ్రైనేజీ పనులను అధికారులతో కలిసి పరిశీలించి, పలు సూచనలు చేశారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పరకాల పట్టణం ముంపుకు గురి కాకుండా ప్రణాళికా బద్ధంగా అంచలవారిగా నగరాన్ని తలపించేలా సుందరీకరణ చేసి అభివృద్ధి చేస్తానని, అందుకు ప్రజల సహకారం అవసరమని అన్నారు.కొద్దిపాటి వర్షానికే రోడ్లన్నీ జలమయం అవుతున్నాయని,ఒక ప్రణాళిక ప్రకారం మున్సిపాలిలో శానిటేషన్ వ్యవస్థ, డ్రైనేజీ వ్యవస్థ, మంచినీటి వ్యవస్థ ను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. వర్షాలకు వచ్చే వరదకు అనుకూలంగా ప్రధానంగా నూతన డ్రైనేజీ పనులను ప్రారంభించా మన్నారు. సుమారు 24 కోట్లతో పరకాల పట్టణ ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేశామని, అభివృద్ధి పనులలో పట్టణ ప్రజలకు తాత్కాలికంగా ఇబ్బందులు కలగినా, భవిష్యత్తు తరాలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అమృత్ పథకం కింద మంచినీటి వ్యవస్థ ను ఏర్పాటు చేస్తున్నామన్నారు.పరకాల పట్టణం వరద ముంపు నుంచి కాపాడేందుకు తీసుకోవల్సిన చర్యలతో నివేదిక రూపొందించామన్నారు. అంతకుముందు 18వ వార్డులో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఇండ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు.

ఎల్లంపల్లి ముంపు గ్రామాలకు మరో అవకాశం

- **పరిహారం కోసం దరఖాస్తుల స్వీకరణ**
- **మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాసరావు**

మంచిర్యాల ప్రతినిధి, ఆగస్టు 2 (జనంసాక్షి) : ఎల్లంపల్లి ప్రాజెక్ట్ ముంపు గ్రామాల బాధితుల నుండి పరిహారం కోసం అర్జీలు స్వీకరిస్తున్నట్లు మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాసరావు తెలిపారు. ఆర్డీవో కార్యాలయంలో ఎల్లంపల్లి ముంపు గ్రామాల పరిధిలో మేజర్ డాటర్స్ కింద పరిహారం కోసం మరోసారి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆయన తెలిపారు .2008లో మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం గుడిపేట శివారులోని గోదావరి నదీపై ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నిర్మాణంలో భాగంగా హాజీపూర్, లక్సెట్టిపేట మండలాల పరిధిలోని మొత్తం 9 గ్రామాలు ప్రాజెక్ట్ కింద ముంపుకు గురయ్యాయని అన్నారు. ఈ సందర్భంగా హాజీపూర్ మండలంలోని గుడిపేట, నంనూర్, చందనాపూర్, రాపల్లి, కొండపల్లి, కర్జమామిడి, పద్మనపల్లి, లక్సెట్టిపేట మండలంలోని గుల్లకోట, సురారం గ్రామల ప్రజలు దాదాపు 1,351 మంది గతంలో దరఖాస్తు చేసుకోగా ఈ ఏడాది ఏప్రిల్ 5వ తేదీ వరకు మేజర్ డాటర్ కింద ఓసారి అవకాశం ఇవ్వడంతో 112 దరఖాస్తులు రాగా మొత్తంగా ఇప్పటి వరకు 1,463 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

రైతులను రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- **రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**
- **తాడిచర్లలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు**

మల్హర్, ఆగస్టు 02 (జనంసాక్షి) : రైతులను రాజు చేయడమే ప్రభుత్వలక్ష్యం, రైతులకు అన్ని సౌకర్యాలు, గౌరవం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర ఐటి పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. శనివారం భూపాలపల్లి జిల్లా మల్హర్ రావు మండల కేంద్రమైన తాడిచర్ల గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మాట్లాడుతూ రైతుల సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఇందులో భాగంగానే రూ 50 లక్షల వ్యయంతో తాడిచర్ల సహకార సంఘ కార్యాలయం, గోదాం భవనం, రూ 25 లక్షలతో నిర్మించిన గ్రంధాలయ భవనం, రూ 7.80 లక్షలతో ఆర్‌అండ్ బి రోడ్డు నుండి రైతు వేదిక వరకు నిర్మించిన సిసి రోడ్డుకు రూ 3.5 లక్షలతో సహకార భవనం వద్ద నిర్మించిన ఆర్చ్ గేట్ కు నిధులు మంజూరు చేసి ప్రారంభించినట్లు తెలిపారు. అలాగే 12 లక్షలతో తహసీల్దార్ కార్యాలయం కు ప్రహరీ గోడ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. తాడిచర్ల గ్రామం ప్రదాన కేంద్రంగా ఉందని అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. తాడిచర్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. గత పది సంవత్సరాలుగా రేషన్ కార్డులు లబించని వారి సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున రేషన్ కార్డుల పంపిణీకి సిద్దమైనట్లు తెలిపారు. 9 రోజుల్లో తొమ్మిది వేల కోట్ల రూపాయలు రైతు బరోసా ద్వారా అందించామని ఆర్థిక పరమైన ఇబ్బందులు ఉన్నప్పటికీ ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని చెప్పారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఫ్రీ బస్సు ప్రయాణం చేపట్టామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ. అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, గ్రంథాలయ సంస్థ చెర్మన్ కోట రాజబాబు, సింగిల్ విండో చెర్మన్ ఇప్ప మొండయ్య, సహకార అధికారి వాల్యా నాయక్, వ్యవసాయ అధికారి బాబూరావు, మహాదేవపూర్ ఏడీఏ శ్రీవ్యాల్, తహసీల్దార్ కె రవి కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంజీ ఎన్ఆర్ఈజిఎస్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ దండు రమేష్,మాజీ ఎంపీపీ చింతలపల్లి మలహల్ రావు, పిఏసిఎస్ డైరెక్టర్లు, మంథని మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ సర్పంచులు, మండల యూత్ అధ్యక్షులు గడ్డం క్రాంతి, నియోజకవర్గం కార్యదర్శి మండల రాహుల్, మండల ఎస్సి సెల్ అధ్యక్షులు మంత్రి రాజసమ్మయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతుని కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి శ్రీధర్ బాబు

భూపాలపల్లి జిల్లా మల్హర్ రావు మండల కేంద్రమైన తాడిచర్ల గ్రామం లో ఇటీవల విద్యుత్ షాక్ తో మృతి చెందిన ఆకుల ఓదెలు కుటుంబాన్ని శనివారం రోజున తెలంగాణా రాష్ట్ర ఐటీ,పరిశ్రమలు, శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పరమార్శించారు. మృతుని కుటుంబ సభ్యులకు ప్రగడ సానుభూతిని తెలిపినారు. మృతుని చిత్ర పటానికి నివాళులు అర్పించి, వారి కుటుంబానికి భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో వారి వెంట పిఏసిఎస్ చైర్మన్ ఇప్ప మొండయ్య,మాజీ వార్డు సభ్యులు కుంట సదానందం ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాశీలో పద్మకవి వెంకట్‌కు శతావధాన సన్మానం

నిర్మల్ బ్యూరో, ఆగస్టు 02 (జనంసాక్షి) : నిర్మల్ నగరానికి చెందిన ప్రముఖ పద్మకవి బి.వెంకట్‌కు జాతీయ శతావధాన ప్రాశ్నిక సన్మానం చేశారు. వజ్రోత్సవభారతి సందర్భంగా దర్శనమ్ మాసపత్రిక,కాశీ తెలుగు సంగమం సంయుక్త ఆధ్వర్యంలో కాశీ పుణ్యక్షేత్రంలో నిర్మల్ కు చెందిన ప్రముఖ పద్మకవి డా బి. వెంకట్, హైదరాబాదు తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి నిత్యానందరావు, కాశీ తెలుగు సంఘం అధ్యక్షులు సుందరి శాస్త్రి, కాశి మెహమూరుగంజ్ మేడం ధర్మాధికారి చల్లా అన్నపూర్ణ ప్రసాద్, చేతులమీదుగా అందుకున్నారు. శృంగేరి జగద్గురు శ్రీ శ్రీ శ్రీ విధుశేఖర భారతీ శంకరస్వామి జయన్తి సభలో పాల్గొని గురుప్రశంస, పూజార్చనలో పాల్గొన్నారు.

నేడు మీనాక్షి నటరాజన్ పాదయాత్ర

ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే

ఖానాపూర్ ఆగస్టు 02 (జనం సాక్షి) : పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జి మీనాక్షి నటరాజన్ పాదయాత్ర నియోజకవర్గ కేంద్రంలో ఆదివారం కొనసాగనుంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ పార్టీ శ్రేణులతో కలిసి రూట్ మ్యాప్ ను పరిశీలించారు. అలాగే బందోబస్తు తదితర ఏర్పాట్లపై సి ఐ సిహెచ్ అజయ్ కుమార్ తో సమీక్షించారు. అనంతరం పాదయాత్ర విజయవంతం అయ్యేందుకు పాటించాల్సిన అంశాలపై పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఎమ్మెల్యే వెంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భూషణ్, ఆత్మ కమిటీ చైర్మన్ తోట సత్యం, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అబ్దుల్ మజీద్, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ధోనికేని దయానంద్, షబ్బీర్ పాషా లతోపాటు మాజీ మున్సిపల్ చైర్మన్ లు అంకం రాజేందర్, రాజురా సత్యం, చెట్టి శ్యామ్ మోహన్ రావు, తదితరులు ఉన్నారు.

గిరిజన జర్నలిస్టుల కలం కత్తిలా పనిచేయాలి

- **ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ జిల్లా మహాసభ పోస్టర్ ఆవిష్కరణ**
- **ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్**

మహబూబాబాద్ ప్రతినిధి, ఆగస్టు 2 (జనం సాక్షి): గిరిజన సమాజం ప్రగతికి అభివృద్ధికి గిరిజన జర్నలిస్టుల కలం కత్తిలా పనిచేయాలని నిప్పులా నిలవాలని మహబూబాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే భూక్య మురళి నాయక్ పిలుపునిచ్చారు. ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా ద్వితీయ మహాసభ కరపత్రాన్ని శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ వారి కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. గిరిజనుల హక్కుల పరిరక్షణకు వారి ఆకాంక్షలను ప్రభుత్వాలకు వినిపించడంలో గిరిజన జర్నలిస్టుల పాత్ర ఎంతగానో అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, సమస్యలను ప్రపంచానికి చాటిచెప్పడంలో జర్నలిస్టులు వెన్నుదన్నుగా నిలవాలని గిరిజనుల ఆత్మగౌరవాన్ని కాపాడడానికి ప్రభుత్వం అన్నివిధాలా తోడుంటుందని హామీ ఇచ్చారు. అగ్నిగుండంలాంటి సమాజ సమస్యలను తమ రచనల ద్వారా పరిష్కరించాలని పదునైన వాక్యాలతో అన్యాయాన్ని ఎదిరించాలని ఆయన ఉద్బోధించారు. ఈ మహాసభలు గిరిజన జర్నలిజానికి ఒక కొత్త దిశను చూపుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గిరిజనుల జీవితాల్లో జ్యోతిలా వెలుగులు నింపేందుకు జర్నలిస్టులు అహర్నిశలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ ఆహ్వాన కమిటీ జిల్లా కన్వీనర్ బానోతు లక్ష్మణ్ నాయక్, టిడబ్ల్యూజేఏ రాష్ట్ర కమిటీ సభ్యులు తాటి సుదర్శన్ టి ఆహ్వాన కమిటీ కో కన్వీనర్లు మహేందర్ నాయక్ వెంకటేష్ బాలు నాయక్ బోడ శరత్ నాయక్ మోహన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి భూగర్భ గనుల్లో ఆర్కే 5 గనికి ప్రత్యేక గుర్తింపు

- **ఏరియా సింగరేణి జిఎం శ్రీనివాస్**

శ్రీరాంపూర్ (జనంసాక్షి): శ్రీరాంపూర్ ఏరియాలోనే కాదు సింగరేణి వ్యాప్తంగా భూగర్భ గన్నులో ఆర్కే 5 గనికి ప్రత్యేక గుర్తింపు ఉందని,ఉత్పత్తి,రక్షణలోనే కాదు స్వచపక్వాడ్, పర్యావరణ పరిరక్షణ ఇతర సామాజిక కార్యక్రమాల్లో ఆర్కే5 ఉద్యోగులు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని శనివారం ఆర్కే5 గనిపై నిర్వహించిన ప్రొడక్షన్ మోటివేషన్ సమావేశంలో ఏరియా సింగరేణి జిఎం శ్రీనివాస్ కొనియాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గనులకు ఆదర్శం ఆర్కే 5 గని అని,గతంలో 6లక్షలకు టన్నులకు పైగా ఉత్పత్తి సాధించిన చరిత్ర ఆర్కే5 గనిదని,తక్కువ ఎత్తు పని ప్రదేశాలలో సైతం నిబద్ధతతో కృషి చేస్తూ ఇప్పటి వరకు ఎలాంటి ప్రమాదం లేకుండా జులై నెలలో ఆర్కే 5 గని వంద శాతం ఉత్పతి సాధించడం అభినందనీయం అన్నారు.అదే స్ఫూర్తితో రక్షణతో ఈ సంవత్సరం నూటికి నూరు శాతం ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలని తెలిపారు.నిరంతరం సమీక్షిస్తూ గ్రూప్ ఏజెంట్,మేనేజర్ లకు తగు సూచనలు చేస్తుండగా వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేస్తూ టార్గెట్ సాధించటంలో ముఖ్య పాత్ర పోషించిన ఏజెంట్,మేనేజర్ లకు శుభాకాంక్షలు తెలిపారు. ఆర్కే 6 గని ప్రొడక్షన్ నిలిపివేయడంతో ఆ గని ఉద్యోగులను సైతం ఆర్కే5 కు కేటాయించినందున రోజుకు మరో 200టన్నులు అధికంగా బొగ్గు ఉత్పత్తి జరగాలని అప్పుడే ఏరియా లక్ష్యం సాధించగలం అన్నారు.జులై నెలలో అధిక ఉత్పత్తిలో అగ్రగామిగా నిలిచిన రిలే ఏ ఉద్యోగులను ప్రోత్సాహక బహుమతులతో అభినందించారు.గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రెటరీ బాజీ సైదా మాట్లాడుతూ సింగరేణి సంస్థ బాగుంటేనే ఉద్యోగులకు మంచిదని ఆవిధంగా యాజమాన్యం,అధికారులు,ఉద్యోగులు,యూనియన్లు కలిసికట్టుగా కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ ఏజెంట్ శ్రీధర్,మేనేజర్ సుధీర్ కుమార్ ఝా,గ్రూప్ ఇంజనీర్ శ్రీనివాస భట్టాచార్య,రక్షణ అధికారి శివయ్య,సంక్షేమ అధికారి హరికృష్ణ,పిట్ ఇంజనీర్ శ్యామ్,అసిస్టెంట్ మేనేజర్ లు రాందాస్,వినయ్ రెడ్డి,పిట్ సెక్రెటరీ నర్సింగా రావ్,అండర్ మేనేజర్ లు, సూపర్వైజర్లు, మైనింగ్ స్టాఫ్, వివిధ యూనియన్ల ప్రతినిధులు,ఉద్యోగులు పాల్గొన్నారు.

గని ప్రమాదంలో సింగరేణి కార్మికుడు మృతి

- **మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన పలు యూనియన్ సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు**

రామకృష్ణాపూర్, ఆగస్ట్ 02 (జనంసాక్షి): మందమర్రి ఏరియా కెకె 5 గనిలో జరిగిన ప్రమాదంలో రామకృష్ణాపూర్ పట్టణం శ్రీనివాస్ నగర్ కు చెందిన సింగరేణి కార్మికుడు రాచపల్లి శ్రావణ్ కుమార్ మృతి చెందాడు. తోటి కార్మికులు చెప్పిన వివరాల ప్రకారం కెకె 5 గనిలో ఎస్డీఎల్ యాక్టింగ్ గా పని చేస్తున్న శ్రావణ్ కుమార్ ను ఎస్డీఎల్ యంత్రం వెనుక బాగం తగలడంతో పక్కనే ఉన్న లాడిస్ మధ్యలో ఇరుక్కుపోయాడని తెలిపారు. సమాచారం అందుకున్న గని అధికారులు రామకృష్ణాపూర్ సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స అందజేసి కరీంనగర్ ఆసుపత్రికి రిఫర్ చేయగా మార్గమధ్యంలో చనిపోయాడని కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న పలు యూనియన్ సంఘాల నాయకులు ఆసుపత్రికి చేరుకొని యాజమాన్యం అనుసరిస్తూ తీరుపై ధ్వజమెత్తారు. లాభాల ఆర్జనే దెయ్యంగా కార్మికులపై పనిభారం మోపుతూ రక్షణ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. శ్రావణ్ మృతికి యాజమాన్యమే బాధ్యత వహించి కుటుంబ సభ్యుల్లో ఒకరికి తక్షణమే ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. మృతుడికి రావాల్సిన బెనిఫిట్స్ త్వరలోనే అందజేస్తామని ఆయన కుటుంబానికి అండగా నిలుస్తామని అధికారులు హామీ ఇచ్చారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఏటూరు నాగారం ఏజెన్సీలో పోలీసుల ముమ్మర తనిఖీలు

ఏటూరునాగారం, ఆగష్టు 02(జనంసాక్షి) : మావోయిస్టు వారోత్సవాల సందర్భంగా జూలై 28 నుంచి ఆగస్టు 3 వరకు ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ములుగు జిల్లా ఎస్పీ శబరీష్ ఆదేశాల మేరకు నిరంతర వాహన తనిఖీలు నిర్వహించిన పోలీసులు, ఎటువంటి సంఘటనలకు చోటు ఇవ్వకుండా క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. మావోయిస్టుకు సంబం ధించి సమాచారం పోలీసులకు తెలుపవలసిందిగా ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రాజ్ కుమార్, పి ఎస్ఐ నరేష్, రచిత్ర పోలీస్‌లు పాల్గొన్నారు.

జనగామ కోర్టులో క్యాంటీన్ ప్రారంభించిన హైకోర్టు జడ్జీ

జనగామ ప్రతినిధి, ఆగష్టు 02(జనంసాక్షి): సత్వర న్యాయంలో భాగంగా కేసులను త్వరగా పరిష్కరించేందుకుగాను న్యాయవాదులు సహకరించాలని హైకోర్టు జడ్జి, జనగామ పోర్ట్ పోలియో జడ్జి జూకంటి అనిల్ కుమార్ అన్నారు. శనివారం జనగామ జిల్లా కోర్టు ఆవరణలో నూతనంగా ఏర్పాటుచేసిన క్యాంటీన్ మరియు జిరాక్స్ సెంటర్ ను ఆయన ప్రారంభించిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. వృత్తి పరంగా ఎదురయ్యే సవాళ్ళని ఎదుర్కునే క్రమంలో కలిగే ఒత్తిడిని కోర్టు ఆవరణలో వదిలిపెట్టి ఇంటికి ప్రశాంతమైన మనసుతో వెళ్లాలని న్యాయవాదులకు సూచించారు. బార్ -బెంచ్ సమన్వయంతో పనిచేసి కేసులను స్పీడి డిస్పోజల్ చేయడంలో సహకరించాలని కోరారు. జిల్లా కేంద్రంలోని చంపక్ హిల్స్‌లో 10 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయనున్న కోర్టు నిర్మాణ పనులకు పరిపాలన అనుమతులు త్వరలోనే రానున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా ప్రిన్సిపల్ జడ్జి ప్రతిమ, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్,సీనియర్ సివిల్ జడ్జిలు విక్రమ్, సుచరిత, జూనియర్ సివిల్ జడ్జి శశి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు దండబోయిన హరి ప్రసాద్ యాదవ్, ప్రధాన కార్యదర్శి పాలకుర్తి రామకృష్ణ, సీనియర్ న్యాయవాదులు ప్రసాద రావు, జాన్ రెడ్డి,శ్రీరాం శ్రీనివాస్, పానుగంటి శ్రీనివాస్, డిఫెన్స్ న్యాయవాది మంచాల రవీందర్ కోట శంకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా, వైద్య రంగానికి ప్రభుత్వం పెద్దపీట

- **అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేస్తాం**
- **రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి**

రామకృష్ణాపూర్, ఆగస్ట్ 02 (జనంసాక్షి): రాష్ట్ర ప్రభుత్వం విద్యా, వైద్య రంగానికి పెద్ద పీట వేస్తుందని రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. మందమర్రి మండలం క్యాతనపల్లి మున్సిపాలిటీ 11 వ వార్డులో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను శనివారం పున:ప్రారంభించి, అర్హులైన లబ్ధిదారులకు తెల్ల రేషన్ కార్డులు పంపిణీ చేసి మాట్లాడారు. ఇండ్లు లేని నిరుపేదలను గుర్తించి నియోజకవర్గంలో డబుల్ బెడ్రూం ఇండ్లను కేటాయించడంతో పాటు ఇంటి స్థలం ఉన్నవారికి ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకోవడానికి నియోజకవర్గం వ్యాప్తంగా నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు. నిరుపేదలు చదువుకు దూరంగా ఉండకూడదన్న ఉద్దేశ్యంతో నూతన ఒరవడితో విద్యార్థులకు అన్ని సౌకర్యాలను కల్పిస్తూ ప్రభుత్వ పాఠశాలను ప్రారంభించడం జరిగిందని, అనారోగ్య బారిన పడిన వారికి పది లక్షల రూపాయలను ఆరోగ్య శ్రీ ద్వారా ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. సన్న బియ్యం, ఉచిత బస్సు, 200 యూనిట్ల ఉచిత కరెంట్, 500 రూపాయలకే వంట గ్యాస్ అందిస్తున్నామని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తానని, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపి ఎగ్గడి భాస్కర్, ఏసిపి రవికుమార్, తహసిల్దార్ సతీష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ రాజు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
03 ఆగస్టు 2025

రేషన్‌కార్డు..పేదలకు సామాజిక భద్రత

- గత ప్రభుత్వం గరీబులను పట్టించుకోలేదు
- సంక్షేమ పథకాల అమలు నిరంత ప్రక్రియ
- తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్

వికారాబాద్ జిల్లా బ్యూరో, ఆగస్టు 2 (జనం సాక్షి) : పేద ప్రజలకు రేషన్ కార్డు సామాజిక భద్రతగా ఉంటుందని తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శనివారం మర్పల్లి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మరియు బంట్వారం మండల కేంద్రంలోని సుధాకర్ గౌడ్ ఫంక్షన్ హాల్ లో జరిగిన సభలలో లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు రేషన్ కార్డు సామాజిక భద్రతగా పనిచేస్తుందని గత ప్రభుత్వాలు రేషన్ కార్డుల పంపిణీ గురించి పట్టించుకోలేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ పుట్టిందే పేదల సంక్షేమం కోసం. మొదటినుంచి పేదలకు అవసరమైన సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు.ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అయిదేళ్ళు నిరంతరం కొనసాగుతాయి. మీరు ఎలాంటి అనుమానాలు పెట్టుకోవద్దన్నారు. దేశంలో ప్రజలకు రేషన్ కార్డు అనేది ఒక ధైర్యం, సామాజిక భద్రత. కుటుంబానికి భూమి ఉంటే ఎంత ధైర్యంగా ఉంటారో, పేదలకు రేషన్ కార్డు ఉంటే కూడా అంత ధైర్యంగా ఉంటారు. సబ్సిడీ బియ్యం వస్తే పచ్చడో, కారమో వేసుకుని కడుపు నిండా అన్నం తింటారు. కానీ గత ప్రభుత్వం పదేళ్ళలో ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు. కొత్త రేషన్ కార్డుల కోసం చేసుకున్న దరఖాస్తులను చెత్త బుట్టలో వేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పుడు ఉంటే మీకు రేషన్ కార్డులు ఇచ్చేవారని ప్రశ్నించారు.వాళ్ళు అధికారంలోకి రాలేదు కాబట్టే మీకు రేషన్ కార్డులు వస్తున్నాయి. ఈ విషయాన్ని అందరూ గుర్తుపెట్టు కో వాలని కోరారు.ఇప్పుడు ప్రభుత్వం దరఖాస్తు చేసుకున్న, అర్హులైన వారందరికీ కొత్త రేషన్ కార్డులను మంజూరు చేస్తున్నది. రేషన్ కార్డులు ఇవ్వడం అనేది భవిష్యత్తులో కూడా నిరంతర ప్రక్రియ. దరఖాస్తు చేసుకున్న వారందరికీ కార్డులు మంజూరు అవుతాయి.ఇదే కాదు మేనిఫెస్టోలో పెట్టకున్నా పేదలు కూడా తృప్తిగా కడుపు నిండా అన్నం తినాలనే మంచి ఆశయంతో దేశంలోనే మొదటి సారిగా మన తెలంగాణ రాష్ట్రంలో సన్న బియ్యాన్ని రేషర్ షాపుల ద్వారా అందిస్తున్నారు.ఇళ్ళు లేని కుటుంబం ఉండకూడదు అనే లక్ష్యంతో అర్హులై, దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అవుతాయి. ఈ అయిదేళ్ళలో అద్భుతంగా అభివృద్ధి చేస్తాను.గత పదేళ్ళలో వికారాబాద్ నియోజకవర్గంలోని రోడ్లు దారుణంగా అయ్యాయి. పదేళ్ళలో రోడ్లు బాగాలేక మీరందరూ ఎంత ఇబ్బందులు పడ్డారో నాకు తెలుసు. అందుకే మన ప్రభుత్వం వచ్చాక మొదట రోడ్లను బాగు చేయిస్తున్నాను. ఇప్పటి వరకు 600 కోట్ల రూపాయలతో రోడ్లను బాగు చేయిస్తున్నాను.గల్లి గల్లీకి ప్రతి గ్రామంలో 60 లక్షల నుండి కోటి రూపాయలతో సిసి రోడ్లను వేయించాను. ఊర్లకు వచ్చే తారు రోడ్లను కూడా వేయిస్తున్నాను. కోట్‌పల్లి ప్రాజెక్టు ఆధునికీకరణకు రూ. 90 కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయి. నియోజకవర్గంలోని అన్ని చెరువులను ఆధునికీకరణ చేయించడానికి ప్రయత్నాలు చేస్తున్నాను. చెరువుల ఆధునీకరణతో వ్యవసాయానికి ఉపయోగపడడంతో పాటుగా పర్యాటకం పెరుగుతుంది. స్థానికులకు ఉపాధి కలుగుతుంది.వికారాబాద్ నియోజకవర్గంలో పెద్ద ఎత్తున ఉన్న భూములలో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నాను. పరిశ్రమల ఏర్పాటుతో స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు అందుతాయి..మీ అందరి సహకారంతో వచ్చిన ఏడాదిన్నర లోనే ఇన్ని మంచి సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు చేయగలిగాం. ఇంకా మీ ఆశీస్సులతో వికారాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తాను. మన ప్రాంతం అభివృద్ధి, పేదల సంక్షేమానికి 24 గంటలు పని చేస్తానని అన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలు అధికారులు పాల్గొన్నారు.

రానున్న రోజుల్లో భారత్ మూడవ ఆర్థిక అతిపెద్ద దేశం

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

యాచారం, ఆగస్టు 2 (జనం సాక్షి) : ప్రధానమంత్రి కిసాన్ సమాన నిధి 20వ విడత 9.7 కోట్ల రైతులకు నరేంద్ర మోదీ చేతుల మీదుగా శనివారం రూ.20,500 కోట్లు విడుదల చేసిన సందర్భంగా మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర గనుల బొగ్గుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, మాజీ ఎంపీ భూర నర్సయ్య గౌడ్, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగా రెడ్డి, వ్యవసాయ శాఖ డైరెక్టర్ వి. కె.సింగ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి ఉషా , సహాయ వ్యవసాయ సంచాలకులు సుజాత, ఆర్డిఓ అనంతరెడ్డి హాజరయ్యారు. మంత్రి పీఎం కిసాన్ పథకం ఉద్దేశాలు, ప్రయోజనాలు, దేశీయ వ్యవసాయాభివృద్ధిలో కిసాన్ సామాన్ నిధి పాత్ర గురించి రైతులకు వివరించారు. 2019లో ప్రారంభమైన ఈ కేంద్ర ప్రభుత్వ ప్రత్యక్ష లబ్ధి పథకం ద్వారా ఇప్పటి వరకు రూ.3.69 లక్షల కోట్లు రైతుల ఖాతాలలో జమ చేయబడి, 19 విడతలలో విజయవంతంగా అమలైనట్లు పేర్కొన్నారు. ఈ పథకం లక్షలాది రైతులకు ఆర్థిక బలాన్ని అందించడంలో ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. దేశంలో ఇటీవల జరిగిన అనేక సంఘటనలపై బిజెపి ప్రభుత్వం చర్యలు తీసుకుందని అన్నారు. కనిపించని.రోగం కరోనా ప్రజల మధ్య ఉధృతమైనప్పుడు నరేంద్ర మోడీ నాయకత్వంలో కరోనా కష్టకాలంలో వ్యాక్సిన్ రూపొందించి 150 కోట్ల ప్రజలకు రెండు పర్యాయాలు వ్యాక్సిన్ అందజేసి దేశ ప్రజల ప్రాణాలు కాపాడిన ఘనత ప్రధాని మోడీకి దక్కిందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుర్నాథ్ రెడ్డి, సహకార సంఘం చైర్మన్ రాజేందర్ రెడ్డి, కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య యాదవ్, మాజీ ఎంపీపీ కొప్పుప్ప సుకన్య భాష, తహశీల్దార్ అయ్యప్ప, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రతి గ్రామానికి నాణ్యమైన విద్యుత్

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు

చిన్నంబావి, ఆగస్టు 2 (జనంసాక్షి) : ప్రతి గ్రామానికి నాణ్యమైన విద్యుత్తు అందించడమే లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మండలం లోని వెల్టూర్ గ్రామంలో విద్యుత్ ఉప కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. వెల్టూరు కు చేరుకున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కు, మంత్రి జూపల్లి కృష్ణారావు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు మెఘారెడ్డి, డా. రాజేష్ రెడ్డి, డిసిసిబి చైర్మన్ మామిళ్ళపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫరూఖీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వంలోనే పేద ప్రజలకు కొత్త రేషన్ కార్డులు

వికారాబాద్, ఆగస్టు 2 (జనంసాక్షి) : బంట్వారం మండల కేంద్రంలోని సుధాకర్ గౌడ్ ఫంక్షన్ హల్ లో కొత్త రేషన్ కార్డుల పంపిణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ హాజరై లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణి చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ...రేషన్ కార్డుల లబ్దిదారులకు ముందుగా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్ కుమార్, ఆర్ఐ, డిప్యుటీ తహసీల్దార్ మహేష్,మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు పోచారం వెంకటేశం, డైరెక్టర్‌లు యాదగిరి, శాఖం నర్సింలు, మాజీ ఎంపీపీ ప్రభాకర్, శ్రీకాంత్, మాజీ సర్పంచ్ రాధాకృష్ణ గౌడ్, తలారి వెంకట్, సన్నీ, సర్పంచ్ ల సంఘం మాజీ మండల అధ్యక్షులు నరసింహా రెడ్డి,మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కాంగ్రెస్ మండల సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- ఏఐసీసీ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్

సంగారెడ్డి ప్రతినిధి, ఆగస్టు 2 (జనం సాక్షి) : ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ పేర్కొన్నారు. జనహిత పాదయాత్రలో భాగంగా శనివారం సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆందోల్‌లోని సంగుపేట లక్ష్మి గార్డెన్స్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహా పాల్గొన్నారు. ముందుగా నియోజకవర్గంలోని ముఖ్యనాయకుల అభిప్రాయాలను అడిగి తెలుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందిన లబ్ధిదారుల వివరాలు కార్యకర్తల దగ్గర ఉండాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లను అమలుకు కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి చేస్తున్నాంమని వారు అన్నారు. రైతు రుణ మాఫీ, రైతు భరోసా, గృహజ్యోతి, గ్యాస్ సబ్సిడీ, ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు వడ్డీ లేని రుణాలు, ముఖ్యమంత్రి సహాయనిధి, ఎల్‌వోసిల ద్వారా లబ్ధిపొందిన వారి వివరాలు ఇందిరమ్మ కమిటీ, గ్రామ కమిటీలు నిరంతరం లబ్దిదారులతో సంబంధాలు పెంచుకోవాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు సమన్వయము చేసుకోని మంచి ఫలితాలు సాధించాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే డా. సంజీవ రెడ్డి, మాజీ మంత్రి చంద్రశేఖర్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, కాటా శ్రీనివాస్ గౌడ్, త్రిష రాజనర్సింహా, చైర్మన్ గిరిధర్ రెడ్డి, ఉజ్వల్ రెడ్డి, ఆవుల రాజి రెడ్డి, గ్రంధాలయ సంస్థ చైర్మన్‌లు అంజయ్య, సుహాసిని రెడ్డి, ఉపాధ్యక్షులు సంగమేశ్వర్, సురేందర్ గౌడ్‌లు పాల్గొన్నారు.

జనహిత పాదయాత్ర కాదు జనహత పాదయాత్ర

పరిగి, ఆగస్టు 2 (జనం సాక్షి) : గురువారం నాడు పరిగిలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన జనహిత పాదయాత్ర పైన శనివారం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పరిగి మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డితో కలిసి పరిగి పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే నివాసంలో మీడియా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో భాగంగా వారు మాట్లాడుతూ... రాష్ట్ర సాధన అనంతరం గడిచిన 10 సంవత్సరాలలో బీఆర్ఎస్ పాలనలో ప్రగతి పథంలో నడిచిన తెలంగాణ రాష్ట్రం అన్ని వర్గాలకు సంక్షేమం అందిస్తూ ఆదర్శ రాష్ట్రంగా నిలిచింది. ఎన్నికల్లో 6 గ్యారెంటీల పేరుతో ల420ల హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ కాలం వెళ్ళదీస్తూ, ప్రజలను కొత్త నాటకాలతో మోసం చేస్తుంది అందులో ఈ పాదయాత్ర ఒకటి. పాదయాత్ర అంటే మాములు విషయమేం కాదు ఎన్నో అంశాలు ఇమిడి ఉంటాయి. పాదయాత్రకు అనుమతి అంత సులువేమీ కాదు, అలాంటిది చిటికెలో ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ పాదయాత్రకు అనుమతి ఎలా దొరికింది.

పరీక్షలు మావి..పత్రాలు మీవి..

కేసీఆర్ హయాంలో నోటిఫికేషన్లు ఇచ్చింది, ఎగ్జామ్స్ నిర్వహించింది రిజల్ట్ విడుదల చేసింది మా బీఆర్ఎస్ ప్రభుత్వం. ఎలాంటి ప్రక్రియ లేకుండా, చివర్లో పత్రాలు పంచితే అది మీ ప్రభుత్వం ఇచ్చినట్లు అవ్వదు. కేసీఆర్ఎ ఇచ్చిన ఉద్యోగాలకు పత్రాలు ఇచ్చి క్రెడిట్ తీసుకోవడం కాదు, మీకు చేతనైతే మీరు ఇస్తామన్న రెండు లక్షల ఉద్యోగాల గురించి ఆలోచించండి. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలన చేతకావడం లేదు కాబట్టే ఈ పాదయాత్రలు. కాంగ్రెస్ పార్టీ హైకమాండ్. మన రాష్ట్రం సీఎం డమ్మీ అని త్వరలో సీఎంను మార్చే అవకాశం ఉందని సంకేతం ఇస్తున్నట్టుగా మీనాక్షి పాదయాత్ర ఉందని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు సైతం అనుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో పరిగి నియోజకవర్గ మాజీ ఎంపీపీలు మాజీ మున్సిపల్ చైర్మన్ మాజీ సర్పంచ్ మాజీ కౌన్సిలర్లు బిఆర్ఎస్ పట్టణ ప్రాంత అధ్యక్షులు మరియు బి ఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించడం మన బాధ్యత

కల్వకుర్తి, ఆగస్టు 2 (జనం సాక్షి) : కల్వకుర్తి మండలం లింగసానిపల్లి గ్రామం పునర్నిర్మాణంలో ఉన్న శివాలయ రామాలయాన్ని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సందర్శించారు. అనంతరం దేవాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొని సుంకిరెడ్డి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ దేవాలయాలు పునర్నిర్మాణాలు మన సంస్కృతి,సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించే విలువైన సంపద అని అన్నారు. వీటిని కాపాడుకోవడం మన బాధ్యత అని సమాజంలో ప్రజలలో భక్తి భావం శాంతిని పెంచే గొప్ప మార్గాలని మరిదేవాలయాల రక్షణ మన బాధ్యత అని తెలియజేశారు.లింగసానిపల్లి గ్రామం శివాలయ,రామాలయ దేవాలయ నిర్మాణం చాలా పెద్ద ఎత్తున గొప్పగా చేపట్టడం సంతోషకరమని తెలుపుతూ, తన వంతు సహకారంగా దేవాలయ అభివృద్ధికి తోడ్పాటును అందిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు,దేవాలయ కమిటి సభ్యులు మాట్లాడుతూ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి దేవాలయాల అభివృద్ధికి నియోజకవర్గ వ్యాప్తంగా పెద్ద ఎత్తున సహాయ సహకారాలు అందిస్తున్నారని, మా దేవాలయాన్ని సందర్శించారు. అభివృద్ధికి తన వంతు తోడ్పాటును అందిస్తున్నందుకు ఆనందంగా ఉందని సుంకిరెడ్డి ఆంజనేయస్వామి ఆశీస్సులతో గొప్ప లక్ష్యాలను చేరుకోవాలని కోరుకుంటున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు సంగెం రాములు, శేఖర్ రెడ్డి, వినోద్ రెడ్డి, బృంగి కిరణ్ కుమార్, వెంకటేశ్వర్లు, నాగరాజు, సత్యం, శ్రీనివాసాచారి, మల్లయ్య, మనెమ్మలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్రంలో నిరుపేదలను గుర్తించేది కాంగ్రెస్ ప్రభుత్వమే..

- తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్

మోమిన్‌పేట, ఆగస్టు 2 (జనం సాక్షి) : తెలంగాణ రాష్ట్రంలో నిరుపేద బడుగు బలహీన వర్గాలను గుర్తించేది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వమే అని తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ పేర్కొన్నారు శనివారం వికారాబాద్ జిల్లాలోని బంట్వారం మండల కేంద్రంలో రేషన్ కార్డులు లేని లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో దేశంలో ఎక్కడలేని విధంగా రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం ఇందిరమ్మ ఇండ్లు ఉచిత బస్సు ప్రయాణం రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకాన్ని పకడ్బందీగా అమలుపరుస్తున్న ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కే దక్కుతుందన్నారు వికారాబాద్ జిల్లాలోని వికారాబాద్ మోమిన్ పేట మర్పల్లి బంట్వారం ధరూర్ మారుమూల గ్రామాలకు కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి రోడ్ల నిర్మాణం చేపట్టామని ఆయన సూచించారు మర్పల్లి బంట్వారం మోమిన్ పేట ప్రాంతాల్లో పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి పరికి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఆయన అన్నారు గ్రామాల్లో ఉన్నటువంటి చెరువులన్నీ మరమ్మత్తులు చేసి సాగునీటి రంగానికి అభివృద్ధి పరుస్తామని వ్యవసాయదారులకు వ్యవసాయం సునాయాసంగా చేసుకునే అవకాశం కలుగుతుందన్నారు రుణమాఫీ రైతు భరోసా వంటి పథకాలతో రైతులు సంతోషంగా ఉన్నారని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో బంట్వారం తహసీల్దార్ విజయ్ కుమార్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోచారం వెంకటేశం, పిఏసిఎస్ వైస్ చైర్మన్ సుధాకర్ గౌడ్, మాజీ ఎంపీపీ ప్రభాకర్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాములు,యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోటి గారి జగదీశ్వర్,సోషల్ మీడియా రాష్ట్ర కో ఆర్డినేటర్ చామల రఘుపతి రెడ్డి,రామేశ్వర్, రాచన్న,శేఖర్ యాదవ్, నర్సింలు యాదవ్, సర్వేష్, రఫీ,వెంకట్ రెడ్డి,అశోక్ రెడ్డి, మహేష్ పాండు,మక్కూల్, ఈశ్వర్,రమేష్ పవర్, తహసిల్దార్ పురుషోత్తం, ఎంపీడీవో సిటి జయరాం, స్పెషల్ ఆఫీసర్ మోహన్ కృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఫోర్జరీ పత్రాలతో ప్లాట్లను కబ్జా చేయడానికి యత్నం

- అధికార పార్టీ నాయకుల పేర్లతో దిలీప్ రెడ్డి బెదిరింపులు
- విలేకరుల సమావేశం విష్ణుపురి,శ్రీపాద కాలనీ ప్లాట్ల బాధితులు

బోడుప్పల్, ఆగస్టు 2 (జనంసాక్షి) : ఫోర్జరీ పత్రాలతో మా ప్లాట్లను కబ్జా చేయడానికి కొందరు వ్యక్తులు ప్రయత్నాలు చేస్తున్నారని విష్ణుపురి,శ్రీపాద కాలనీ ప్లాట్ల బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.శనివారం మేడిపల్లి మండల ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్‌లో బాధితులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని విష్ణుపురి, శ్రీపాద కాలనీలో సర్వేనెంబర్ 79/ఆ, 124ఆ, 125/ఆ, 126/ఆ, 122/ఆలో భూ యజమానుల నుండి పోగుల నరసింహారెడ్డి జిపిఏ తీసుకున్ని ప్లాట్లు చేసి అమ్మగా మేము ప్లాట్లను కొనుగోలు చేశాము. వాటికి ప్రభుత్వ నిబంధనల మేరకు ఎల్ఆర్ఎస్, మున్సిపల్ పర్మిషన్ తీసుకొని నిర్మాణం చేసుకోవడానికి మేము మా స్థలం దగ్గరకు వెళ్లగా జమాల్, కాశీం భూ యజమానులతో తప్పుదు రిజిస్ట్రేషన్ చేసుకొని దిలీప్ రెడ్డి అనే వ్యక్తి కొంతమంది గుండాలతో చంపుతామని బెదిరించి మాపై దౌర్జన్యం చేస్తుండగా 100కు కాల్ చేసి ఫోలీసులను ఆశ్రయించగా మొబైల్ వాహనంలో వచ్చిన పోలీసులు అక్రమార్కులకే వత్తాసు పలికి వారికే సహకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికి పలుమార్లు పిఎస్‌లో ఫిర్యాదు చేసి కోర్టు నుంచి స్టే ఆర్డర్ తెచ్చుకున్న పోలీసులు వారికే వత్తాసు పలుకుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా మాకు ప్రభుత్వం జోక్యం చేసుకుని న్యాయం చేసి మా ప్లాట్లను మాకు దక్కేలా చూడాలని కోరారు.ఈ కార్యక్రమంలో సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,తోట శ్రీనివాస్ రెడ్డి, ధర్మారావు,కే వెంకటయ్య,రామారావు,జె.యన్.గౌడ్,ఎస్.సుజాత తదితరులు పాల్గొన్నారు.

పోలిసులే దగ్గర ఉండి కబ్జాదారులకు సపోర్ట్ చేస్తున్నారు

మాకు న్యాయం చేయమని స్థానిక పోలీసులను ఆశ్రయించగా పోలిసులే దగ్గర ఉండి కబ్జా దారులకు సపోర్ట్ చేస్తున్నారని కాలనీ వాసులు వాపోయారు..మేడిపల్లి సీఐ మమ్ములను నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఎక్కడ చెప్పుకుంటారో నా ఇష్టం వచ్చినట్లు చేస్తానని అన్నాడని కాలనీ వాసులు తెలిపారు.. రక్షణ కల్పించవల్సిన ఫోలిసులే కబ్జా దారులకు సపోర్ట్ చేస్తే మేము ఎవరి చెప్పుకోవాలే తెలియడం లేదని అందుకే మీడియా ఆశ్రయించామని తెలిపారు.

ఆరోపణలు అవాస్తవం- మేడిపల్లి సీఐ అర్. గోవింద్ రెడ్డి

స్థలం వివాదం విషయంలో మేం ఎవరికి మద్దతు ఇవ్వలేదు ఘర్షణ వాతావరణం రాకుండా ఇతరులకు ఇబ్బంది కలుగకుండా పరిష్కారం చేసుకోవాలని ఇరు వర్గాలకు చెప్పటం జరిగింది. ఈ విషయంలో మాకు ఎవరి వత్తిడి లేదు మేం చట్టపరంగా మా విధులను సక్రమంగా నిర్వహించడం జరుగుతుంది.

ఆటోల ధరలు ఖరారు.. ఎక్కువకు విక్రయించకుండా చర్యలు

జనంసాక్షి:ఆటో రిక్షా ధరలను రవాణాశాఖ ఖరారు చేసింది. ఎల్పీజీ ఆటో రిక్షా ధరను రూ.2.70 లక్షలుగా, సీఎన్జీ ఆటో రిక్షా ధరను రూ.2.80 లక్షలుగా నిర్ణయించింది. నిర్ణయించిన ధరల కంటే ఎక్కువకు విక్రయించకుండా అధికారులు చర్యలు చేపట్టారు. గతంలో ఫైనాన్షియర్‌లు, కన్సల్టెంట్‌లు కుమ్మక్కై అడ్డగోలుగా ధరలు పెంచినట్లు ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో ఈసారి అలాంటి బ్లాక్ మార్కెటింగ్‌కు అవకాశం లేకుండా నియంత్రించింది.ఓఆర్ఆర్ పరిధిలో నడిపేందుకు వీలుగా సుమారు 65 వేల ఆటో పర్మిట్‌లకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. వీటిలో 20 వేల ఎలక్ట్రిక్ ఆటోలు కాగా, మరో 20వేల ఎల్పీజీ, సీఎన్జీ ఆటోలకు సైతం అనుమతినిచ్చారు. ఇప్పటికే సీఎన్జీ లేదా ఎల్పీజీతో నడుస్తున్న సుమారు 25 వేల ఆటోలను ఎలక్ట్రిక్ ఆటోలుగా మార్చుకొనేందుకు అవకాశం కల్పించారు.అర్హులైన ఆటోడ్రైవర్‌లు దరఖాస్తు చేసుకొనేందుకు షోరూమ్‌లలోనే ప్రత్యేక వెసులుబాటు కల్పించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న డ్రైవర్ల వివరాలను పరిశీలించి కొత్త ఆటోలు కొనుగోలు చేసేందుకు ప్రొసీడింగ్‌లు (అనుమతులను) ఇచ్చారు. ఇప్పటి వరకు సుమారు 20 వేల ఆటోరిక్షాలకు అనుమతులను ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. ఎల్పీజీ, సీఎన్జీ ఆటోలకు ప్రొసీడింగ్‌ల ప్రక్రియ ముగింపు దశకు చేరడంతో ఫైనాన్షియర్‌లు, కన్సల్టెంట్‌లు రంగంలోకి దిగారు. అక్రమార్జనకు తెరలేపారు. షోరూమ్‌లలో ధరలను ఖరారు చేసినట్లుగా ఫైనాన్షియర్‌ల అక్రమాలను కట్టడి చేసేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ఆటోరిక్షా విక్రయాల్లో ఫైనాన్షియర్‌లు, కన్సల్టెంట్‌ల మోసాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి.

బాలల బాలగోపాల్ బ్యాంక్

జనంసాక్షి:ఇంజనీరింగ్‌లో చేరిన 17 ఏళ్ల కపిశ్ ల్యాప్‌టాప్ కొనుక్కోవడానికి వాళ్ల నాన్నను డబ్బులు అడిగాడు. కాలేజీ ఫీజుకే అప్పుచేసిన అతడి తండ్రి ల్యాప్‌టాప్ కొనడానికి మళ్లీ అప్పు చేయడానికి రెడీ అయ్యాడు.చదువులు అన్నాక అవసరమైనవి కొనక తప్పదు. ఈ రోజుల్లో ఉన్నత చదువులకు పెద్ద మొత్తంలో డబ్బు ఖర్చు పెట్టాల్సివస్తోంది. ఫీజులతో పాటు పుస్తకాలు, ల్యాప్‌టాప్‌ల కోసం అదనంగా బడ్జెట్ సమకూర్చుకోవాల్సి వస్తోంది. దీంతో పిల్లల చదువులు తల్లిదండ్రులకు తలకు మించిన భారం అవుతున్నాయి. అయితే తమకు అలాంటి బాధ లేదంటున్నారు గుజరాత్‌లోని సబర్కాంత జిల్లా ఇదార్ తహసీల్‌లోని గ్రామాలకు చెందిన ప్రజలు. ఎందుకంటే వారికి అండగా బాలగోపాల్ బ్యాంక్ ఉంది. నిజానికిది బ్యాంక్ కాదు, కోపరేటివ్ సొసైటీ!పల్కిన్ రావల్ అనే 12వ తరగతి విద్యార్థిని తాను కూడబెట్టిన డబ్బులతో ఇటీవల ల్యాప్‌టాప్ కొనుక్కుంది. పదో తరగతి ట్యూషన్ ఫీజు కూడా తన సేవింగ్స్ నుంచే కట్టింది. అంతేకాదు కొత్త సైకిల్ కూడా కొనుక్కుంది. బాలగోపాల్ బ్యాంక్‌లో దాచుకున్న డబ్బుతో ఇవన్ని చేసింది. ఇంత చేసి ఆమెది ధనవంతులు కుటుంబమేమీ కాదు. ఇదార్ పట్టణంలో వాళ్ల నాన్న టీ స్టాల్ నడుపుతాడు. బాలగోపాల్ బ్యాంక్‌లో క్రమంగా తప్పకుండా చేస్తున్న చిన్న మొత్తాల పొదుపే వారి అవసరాలు తీరుస్తోంది. పల్కిన్ రావల్ తోబుట్టువులు కూడా ఇదే బ్యాంక్‌లో పొదుపు చేస్తున్నారు. దాదాపు 30 వేల మందిపైగా పిల్లలు ఈ బ్యాంక్‌లో తమ డబ్బులు దాచుకుంటున్నారు. ఇలా పిల్లలు పొదుపు చేసిన మొత్తం రూ. 30 కోట్లు పైమాటే అంటే ఆశ్చర్యం కలగకమానదు. ఇంతకీ బాలగోపాల్ బ్యాంక్ ఇదంతా ఎలా చేయగలిగింది?ఇదార్ పట్టణవాసి అశ్విన్ పటేల్ ఆలోచనలకు ప్రతిరూపమే ఈ బాలగోపాల్ బ్యాంక్. 16 ఏళ్ల క్రితం ఆయన ఈ బ్యాంక్‌ను ప్రారంభించారు. రైతులకు,

మహిళలకు సహకార సంఘాలు ఉన్నట్టుగా పిల్లలకు ఎందుకు లేవన్న ప్రశ్న ఆయనకు ఎదురైంది. దీనికి సమాధానంగా 2009, మే 30న సబర్కాంత జిల్లాలోని జవాన్‌పురా గ్రామంలో 'బాలగోపాల్ సేవింగ్స్ అండ్ క్రెడిట్ కోపరేటివ్ సొసైటీ' స్థాపించారు. 100 మంది పిల్లలతో ప్రారంభమైన ఈ సంస్థలో ఇప్పుడు 335 గ్రామాల నుంచి 30 వేలమందిపైగా పిల్లలు సభ్యులుగా ఉన్నారు. దేశంలో పిల్లల కోసం నడుస్తున్న ఏకైక సహకార సంస్థ తమదేనని 58 ఏళ్ల అశ్విన్ పటేల్ వెల్లడించారు. దీంతో స్థానికంగా అందరూ దీన్ని బాలగోపాల్ బ్యాంక్‌గా పిలుస్తున్నారు.పిల్లలు పుట్టిన వెంటనే తల్లిదండ్రులు రూ. 110 చెల్లించి బాలగోపాల్ బ్యాంక్‌లో ఖాతా తెరవాలి. వారికి సంస్థ ప్రతినిధులు ఒక పిగ్గీ బ్యాంక్ (డిబ్బీ) ఇస్తారు. ఇందులో పొదుపు చేసిన డబ్బును ప్రతినెలా ఇంటికి వచ్చి తల్లిదండ్రులు లేదా పెద్దవారి సమక్షంలో లెక్కిస్తారు. తర్వాత ఈ మొత్తాన్ని తీసుకెళ్లి పిల్లల ఖాతాల్లో వేస్తారు. పొదుపు చేసిన డబ్బుకు సంవత్సరానికి 6 శాతం వడ్డీ చెల్లిస్తారు. పిల్లలు తమకు అవసరమైనప్పుడు లోన్లు కూడా తీసుకోవచ్చు. వెయ్యి మందిపైగా రుణాలు తీసుకున్నారని బ్యాంక్ తెలిపింది.బాలగోపాల్ బ్యాంక్ పనితీరు ప్రశంసనీ యంగా ఉండడంతో ఆదరణ అంతకంతకు పెరుగు తోంది. 'మొదట్లో పిల్లలతో పొదుపు ప్రారభింపజేయ డానికి స్థానిక పాఠశాలల్లో ప్రత్యేకంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాలు నిర్వహించేవాళ్లం. ఇప్పుడైతే తల్లిదండ్రులే తమ పిల్లలతో కలిసి వచ్చి బ్యాంక్‌లో ఖాతాలు తెరుస్తున్నార'ని అశ్విన్ పటేల్ తెలిపారు. 10 నుంచి 12 పిల్లలు తమ దగ్గర పొదుపు చేసిన డబ్బుతో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం ఫీజులు చెల్లించారని ఆయన వెల్లడించారు. అప్పుడే పుట్టిన పిల్లల దగ్గర నుంచి 18 ఏళ్లలోపు ఎవరైనా తమ సంస్థలో డబ్బులు దాచుకోవచ్చని చెప్పారు. దీంతో స్థానికంగా అందరూ దీన్ని 'పిల్లల బ్యాంక్'గా పిలుస్తున్నారు.బాలగోపాల్ బ్యాంక్ సేవలను పేరెంట్స్ ప్రశంసిస్తున్నారు. తమ పిల్లలు చిన్నతనం నుంచే ఆర్థిక అక్షరాస్యత, పొదుపు పాఠాలను ప్రాక్టికల్‌గా నేర్చుకుంటున్నారని వారు అంటున్నారు. డబ్బు పొదుపు ప్రాముఖ్యతతో పాటు, సేవ్ చేసిన సొమ్ములను సరైన వాటికి ఖర్చుచేయడం వారికి అలవాటు అవుతోందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పొదుపు చేసిన డబ్బుతో పిల్లల చదువులు సజావుగా సాగుతున్నాయని తెలిపారు.బాలగోపాల్ బ్యాంక్ విజయవంతంగా నడుస్తుండడంతో దీన్ని మిగతా ప్రాంతాల్లోనూ అమలు చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ 25 పాఠశాలల్లో 'బాల్ గోపాల్ బచత్ బ్యాంక్ యోజన' పైలట్ ప్రాజెక్ట్‌గా అమలు చేస్తోంది. 5 నుంచి 18 ఏళ్ల వయసున్న పిల్లల కోసం దీన్ని ప్రవేశపెట్టింది. గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్ సొంత నియోజకవర్గం ఘట్లోడియాలోని గుజరాతీ, హిందీ, ఇంగ్లీషు మీడియం స్కూళ్లలో బాల్ గోపాల్ బచత్ బ్యాంక్ యోజనను తాత్కాలికంగా అమలు చేస్తున్నారు. బాలగోపాల్ బ్యాంక్ గురించి తెలిసిన వారు తమ ప్రాంతంలోనూ ఇలాంటి పిల్లల బ్యాంకు ఉంటే బాగుండు అనుకుంటున్నారు.

గుడ్ల ధరలు

హైదరాబాద్	వరంగల్
₹ 4.30	₹ 4.32

బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

₹ 92,900 (22 క్యారెట్లు)	₹ 1,01,350 (24 క్యారెట్లు)

వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 1,23,000

ఆన్‌లైన్‌లో సెర్చింగ్

గతంలో ప్రాపర్టీ కొనాలంటే పెద్ద ప్రహసనమే. కానీ, టెక్నాలజీ అందుబాటులోకి వచ్చాక చాలా సులువైపోయింది. ఉన్నత స్థాయి ఉద్యోగులు, యువత, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ప్రాపర్టీ కొనుగోళ్లకు పెద్దగా టైమ్ వేస్ట్ చేయడం లేదు.ఏ ప్రాంతంలో ఎంత ధర ఉంది? ఎక్కడ ఏ నిర్మాణ సంస్థలు ప్రాజెక్ట్‌లను నిర్మిస్తున్నాయి? వసతులు, సౌకర్యాలు తదితర వివరాలను ప్రాపర్టీ పోర్టళ్లు అందిస్తున్నాయి. త్రీడీ రూపంలోనూ సమాచారం అందిస్తున్నాయి. దీంతో కొనుగోలుదారుల పని సులువైపోయింది. ఆన్‌లైన్‌లో రూ.2 కోట్లకు పైబడిన ప్రాపర్టీల శోధన ఒకట్నిర శాతం వృద్ధి చెందిందని పేర్కొంది. గతంలో ప్రాపర్టీ కొనాలంటే ధర, వసతులు ప్రధాన అంశాలుగా ఉండేవి. కరోనా తర్వాతి నుంచి గృహ కొనుగోలుదారుల ఎంపికలో మార్పులొచ్చాయి.

ఇంటి డాక్యుమెంట్లు బ్యాంక్ పోగొడితే?

జనంసాక్షి:బ్యాంక్ రుణంతో ఇల్లు కొనడం తెలిసిందే.. ఇంటి దస్తావేజులు తనఖాగా పెట్టి రుణం తీసుకోవడం కామనే! ప్రతినెలా క్రమం తప్పకుండా ఈఎంఐ కట్టేసి..చివరకు బ్యాంక్ నుంచి నో డ్యూ సర్టిఫికెట్ కూడా తీసుకున్నాక.. తనఖా పెట్టిన ఇంటి దస్తావేజులు ఎక్కడో పోయాయని బ్యాంక్ చెబితే? బ్యాంక్ అధికారులతో గొడవ పెట్టుకుంటాం. లేకపోతే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి సర్టిఫైడ్ సేల్ డీడ్ కాపీ కోసం దరఖాస్తు చేస్తాం.. అంతేకదా!?మహారాష్ట్రకు చెందిన ప్రదీప్ శెట్టి అలా చేయలేదు. 2004లో ప్రదీప్ మహారాష్ట్ర పరెల్‌లోని స్టాండర్డ్ చార్టెర్డ్ బ్యాంక్‌లో రూ.9 లక్షల గృహ రుణం తీసుకున్నాడు. అన్ని ఈఎంఐలు కట్టేశాక, బ్యాంక్

నుంచి నో- డ్యూస్ సర్టిఫికెట్ కూడా పొందాడు. ఆ తర్వాత బ్యాంక్ అందించాల్సిన సేల్‌డీడ్ కాపీలను ఇవ్వకుండా అవెక్కడో మిసయ్యాయని వివరించింది. దీంతో ప్రదీప్ 'తనఖా పెట్టిన దస్తావేజులను బ్యాంక్ ఎక్కడో పోగొట్టింది. ప్రాపర్టీ ధరలు పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో సేల్‌డీడ్ కాపీలు లేకపోవడంతో ఇంటిని విక్రయించలేకపోతున్నానని, పైగా ఈ ఘటనతో మానసిక వేదనకు గురయ్యాయని, విలువైన సమయం వృథా చేసినందుకు బ్యాంక్ పరిహారాన్ని చెల్లించాల్సిందేనని' డిస్ట్రిక్ట్ కన్స్యూమర్ డిస్ప్యూట్స్ రిడ్రెసల్ కమిషన్‌కు ఫిర్యాదు చేశాడు.ప్రదీప్‌కు రూ.60 వేలు నష్ట పరిహారాన్ని బ్యాంకు చెల్లించాలని డిస్ట్రిక్ట్ కన్స్యూమర్ కమిషన్ తీర్పునిచ్చింది. ఇందులో రూ.50 వేలు దస్తావేజులు పోగొట్టినందుకు, రూ.5 వేలు మానసిక వేదనకు గురి చేసినందుకు, మరో రూ.5 వేలు ఫిర్యాదు దాఖలు ఖర్చులకు అని వివరించింది. అయితే ఈ పరిహారంతో సంతృప్తి చెందని ప్రదీప్ పెట్టి.. మహారాష్ట్ర స్టేట్ కన్స్యూమర్ డిస్ప్యూట్స్ రిడ్రెసల్ కమిషన్‌ను ఆశ్రయించాడు. దీంతో స్టేట్ ఫోరం.. పరిహార మొత్తాన్ని రూ.60 వేల నుంచి రూ.1.15 లక్షలకు పెంచింది. 3 నెలల్లోపు కస్టమర్‌కు సర్టిఫైడ్ సేల్‌డీడ్ కాపీని అందించాలని, లేనిపక్షంలో ప్రతి నెలా రూ.50 వేల జరిమానా చెల్లించాలని తీర్పునిచ్చింది.కన్స్యూమర్ డిస్ప్యూట్స్ రిడ్రెసల్ కమిషన్ ఇచ్చిన తీర్పు కేవలం ప్రదీప్ శెట్టికే కాదు.. మనలో ఎవరి ప్రాపర్టీ దస్తావేజులైనా సరే బ్యాంకులు పోగొడితే.. కస్టమర్ పరిహారంతో పాటూ తిరిగి సర్టిఫైడ్ సేల్‌డీడ్ కాపీని కూడా అందించాల్సిన బాధ్యత బ్యాంక్‌లదే! ఇందుకోసం స్థానిక కన్స్యూమర్ డిస్ప్యూట్స్ రిడ్రెసల్ కమిషన్‌ను సంప్రదిస్తే చాలు! ఒకవేళ ఇంట్లో దాచిపెట్టుకున్న ప్రాపర్టీ దస్తావేజులు దొంగలు పడో లేక ఇతర కారణాలతో మిస్ అయితే? దస్తావేజులు పోయాయని కంగారు పడకండి. మళ్లీ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు నుంచి సర్టిఫైడ్ దస్తావేజులను పొందొచ్చు. కాకపోతే కొంత శ్రమించాల్సి ఉంటుంది.ముందుగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో సేల్ డీడ్ పోయిందని ఫిర్యాదు చేయాలి. ఆ తర్వాత దస్తావేజులు పోయినట్టుగా స్థానిక వార్తా పత్రికల్లో ప్రకటన ఇవ్వాలి. ఎవరికైనా దొరికితే సమాచారం అందించాలని కోరుతూ నోటీసు ఇవ్వాలి. గతంలో ఏదైతే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రాపర్టీని రిజిస్ట్రేషన్ చేయించారో మళ్లీ అదే కార్యాలయానికి వెళ్లి ఒరిజినల్ సేల్‌డీడ్ దస్తావేజులు పోయినట్లు సంబంధిత అధికారికి వివరించి సర్టిఫైడ్ కాపీని ఇవ్వాలని కోరుతూ స్వీయ దస్తూరితో లెటర్ రాసివ్వాలి.ఫామ్-22లో పేరు, చిరునామా వంటి వివరాలన్నీ నమోదు చేసి.. ప్రాపర్టీ జిరాక్స్ కాపీలను జత చేయాల్సి ఉంటుంది. అలాగే సంబంధిత ప్రాపర్టీ పేరు మీద ఉన్న ఆధార్, పాన్, రేషన్ కార్డ్, కరెంట్ బిల్లు వంటివి జత చేయాలి. వీటన్నింటికీ పోలీసు ఫిర్యాదు కాపీ, పత్రిక ప్రకటన జత చేసి సబ్ రిజిస్ట్రార్‌కు అందించాలి. నిర్ణయించబడిన ఫీజును చెల్లిస్తే సరిపోతుంది.

వృద్ధుల ఆరోగ్య బీమాలో కీలకమైన కొరతలు

• వెల్లడించిన కొత్త అధ్యయనం

హైదరాబాద్ (జనంసాక్షి):ది లాన్సెట్ రీజినల్ హెల్త్ - సౌత్ ఈస్ట్ ఏషియా అనే జర్నల్‌లో ప్రచురితమైన ఒక కొత్త అధ్యయనం ప్రకారం, భారతదేశంలో, క్యాటరాక్ట్ (కంటిశుక్లం) శస్త్రచికిత్స చేయించుకుంటున్న ప్రతి 20 వృద్ధులలో, కేవలం ముగ్గురికే తగినంత ఆరోగ్య బీమా ఉందని, బీమా లేని వారికి దృష్టి చికిత్సల్లో మెరుగైన ఫలితాలు కనపడకపోవటమే కాకుండా, ఆర్థిక దౌర్బల్యానికి దారితీస్తోందని తెలిసింది. ఈ పరిశోధనలో దాదాపు 40,000 మంది రోగుల నుండి పదేళ్ళ డేటాను సేకరించడం జరిగింది. ఇటీవలి ప్రభుత్వ ఆరోగ్య బీమా పథకం కవరేజి ఉన్నప్పటికీ, 80 ఏళ్ళు పైబడిన వారిలో పెరుగుతున్న వయస్సుతో పాటు బీమా తీసుకోవడంలోని భారీ తగ్గుదలను ఈ పరిశోధన ఎత్తి చూపుతుంది. ఈ అధ్యయనం అత్యంత సాధారణ క్యాటరాక్ట్ శస్త్రచికిత్స చేయించుకున్న 70 ఏళ్ళు పైబడిన 38,387 మంది రోగుల తాలూకు బహుళ కేంద్ర, పునరాలోచిత సమన్వయ విశ్లేషణ. ఈ అధ్యయనాన్ని కంటి ఆరోగ్య ప్రాప్యతకు ప్రత్యామ్నాయంగా దేశంలోని నాలుగు రాష్ట్రాలలో (ఆంధ్రప్రదేశ్, ఒడిశా, తెలంగాణ, కర్ణాటక) నిర్వహించడం జరిగింది. 38,387 మంది రోగులలో 16.07 శాతం మందికి మాత్రమే ఏదో రకమైన బీమా కవరేజి ఉందని ఈ అధ్యయనం ద్వారా తెలిసింది. ఈ పరిమిత కవరేజి కూడా, 70-74 సంవత్సరాల వయస్సు గల వారిలో 17.5 శాతంగానూ, 85 ఏళ్ళు పైబడిన వారికి 10 శాతం కంటే తక్కువగానూ, 90 ఏళ్ళు పైబడిన వారికి 7.14 శాతంగానూ ఇలా వయస్సు పెరుగుతున్న కొద్దీ తగ్గుతూ పోయింది. ఈ పరిశోధన మన వృద్ధులకు తగినంత ఆరోగ్య బీమా లేదని, వయస్సు పెరిగే కొద్ది, బీమా

పొందడంలో అసామానత పెరుగుతుందని వివరిస్తుంది. ఈ సమూహంలో ప్రైవేట్ బీమాలో 70-74 సంవత్సరాల వయస్సు ఉన్నవారిలో 13.32 శాతం నుండి 90 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్నవారిలో 4.07 శాతం వరుకూ తగ్గుదల కనిపించింది. అదేకాక, వయస్సు పెరిగేకొద్దీ ప్రైవేటు బీమాకంటే ప్రజా బీమా తీసుకోవడం పైనే మక్కువ చూపడం కన పడుతోంది. అయితే, అన్ని వయసులవారిలో ప్రజా బీమా 3.33 శాతంనుండి 4.21 శాతం మధ్యలో ఉంది. ఇది ఆర్థికంగా వెనకబడిన వారికి తగినంత ఆరోగ్య బీమా కవరేజీని అందించడంలో వ్యవస్థాగత వైఫల్యాన్ని వెల్లడించింది. ఇప్పటికే ఉన్న విధానాలను అందుబాటులో లేనివిగానూ, భరించలేనివిగానూ లేదా అప్రయోజనకరంగానూ వృద్ధులు భావిస్తున్నారు. ఇదికాకుండా, అన్ని వయసులగల స్త్రీలతో (12.43 శాతం) పోలిస్తే వృద్ధులైన పురుషులు అధిక బీమా తీసుకోవడం (19.11 శాతం) లింగ అసమానత సూచిస్తుంది. 2018లో ప్రారంభమైన ఆయుష్మాన్ భారత్ పథకం వంటి ప్రముఖ ప్రభుత్వ విధానాలు మొత్తం బీమా తీసుకోవడాన్ని గణనీయంగా పెంచాయని, 70 ఏళ్ళు పైబడిన రోగులకు 20 శాతానికి పైగా రెట్టింపు అయ్యాయని అధ్యయనం కనుగొంది. ఈ విధాన మార్పు, మునుపటితో పోలిస్తే 2018 తర్వాత చేసిన శస్త్రచికిత్సలకు బీమా తీసుకున్నట్లుగా అంచనా వేసింది. ఇది ఆరోగ్య సంరక్షణ ప్రాప్యతపై ప్రభుత్వ విధానం తాలూకు సానుకూల ప్రభావాన్ని ప్రదర్శించడంతో పాటు నిరంతర ప్రజా బీమా కవరేజీకి బలమైన సాక్ష్యాలను అందిస్తుంది."ప్రభుత్వ బీమా కార్యక్రమాల ద్వారా సార్వత్రిక ఆరోగ్య కవరేజి మన ఆర్థికంగా వెనకబడిన జనాభాలో ఆరోగ్య సమానత్వాన్ని సాధించడంలో కీలకమని ఇది చూపిస్తుంది" అని ఈ అధ్యయన సంబంధిత రచయితలలో ఒకరైన డాక్టర్ రాజ నారాయణన్ పేర్కొన్నారు. "తగినంత బీమా కవరేజి సకాలంలో ఆరోగ్య సంరక్షణను పొందే అవకాశాలను మెరుగుపరుస్తుంది అనటానికి, ఉన్నతమైన ఫలితాలనిచ్చి ప్రయోజనం చూపుతుంది అనటానికి ఈ అధ్యయనం ఒక కీలక సాక్ష్యం. మన జాతీయ ఆరోగ్య విధానం, ఆర్థిక అభద్రతకు గురయ్యే చాలా మందికి బీమా కల్పించాలి - ఇది వారిపై ఆరోగ్య సంరక్షణ ఖర్చుల భారాన్ని తగ్గించే సామర్థ్యాన్ని కలిగి ఉంది" అని ఎల్ వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థకు చెందిన కన్సల్టెంట్ నేత్ర వైద్యుడు, ఈ అధ్యయన తాలూకు ప్రధాన రచయిత డా. బ్రిజేష్ టక్కర్ పేర్కొన్నారు.

రెండు బ్యాంకుల విలీనానికి ఆర్‌బీఐ ఆమోదం

జనంసాక్షి:సహకార బ్యాంకింగ్ విభాగంలో ఇటీవల మోసాలకు గురైన న్యూ ఇండియా కో-ఆపరేటివ్ బ్యాంక్ (ఎన్ఐసీబీ)ను సారస్వత్ కో-ఆపరేటివ్ బ్యాంక్ (ఎస్‌సీబీ)లో విలీనం చేసేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆమోదం తెలిపింది.ఈ విలీనం అధికారికంగా 2025 ఆగస్టు 4 నుంచి అమల్లోకి వస్తుంది. ఈ తేదీ నుంచి అన్ని ఎన్ఐసీబీ శాఖలు సారస్వత్ బ్యాంక్‌లో భాగంగా పనిచేస్తాయి. సారస్వత్ బ్యాంక్ విడుదల చేసిన ప్రకటన ప్రకారం..ఎన్ఐసీబీ డిపాజిటర్లతో సహా ఖాతాదారులను 2025 ఆగస్టు 4 నుంచి సారస్వత్ బ్యాంక్ కస్టమర్లుగా పరిగణిస్తామని తెలిపింది. వారి ప్రయోజనాలను పూర్తిగా పరిరక్షిస్తామని పేర్కొంది. ఈ విలీన ప్రక్రియలో భాగంగా ఎన్ఐసీబీ ఆస్తులు, అప్పులన్నింటినీ సారస్వత్ బ్యాంక్ స్వాధీనం చేసుకుంటుంది. డిపాజిట్లు, అడ్వాన్సులతో సహా ఎన్ఐసీబీ బ్యాంకింగ్ కార్యకలాపాలను సారస్వత్ వ్యవస్థలో విలీనం చేయనున్నారు.ఈ విలీనంతో సారస్వత్ కో-ఆపరేటివ్ బ్యాంక్ దేశంలోనే అతిపెద్ద అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్‌గా మారుతుంది. మార్చి 31, 2025 నాటికి మొత్తం వ్యాపారం (డిపాజిట్లు & అడ్వాన్సులు) రూ.91,800 కోట్లుగా ఉంది. న్యూ ఇండియా కో-ఆపరేటివ్ బ్యాంక్ మార్చి 2025 నాటికి మొత్తం రూ.3,500 కోట్ల వ్యాపారం సాగించింది.

టెస్లాకు రూ.2100 కోట్ల జరిమానా

జనంసాక్షి:అమెరికన్ కార్ల తయారీ సంస్థ టెస్లాకు ఫ్లోరిడా కోర్టు భారీ జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. 2019లో జరిగిన రోడ్డు ప్రమాదానికి "ఆటోపైలట్" డ్రైవర్ అసిస్టెన్స్ టెక్నాలజీ కారణమని భావించి కోర్టు ఈ జరిమానా విధించింది.2019లో కీ లార్గోలో జరిగిన రోడ్డు ప్రమాదంలో.. నైబెల్ బెనవిడెస్ లియోన్ మరణించగా, ఆమె ప్రియుడు డిల్లాన్ అంగులో గాయపడ్డాడు. ఆ సమయంలో 'జార్జ్ మెక్‌గీ' టెస్లా కారు నడుపుతున్నాడు. ఆటోపైలట్ ఫీచర్ (టెస్లా కార్లలోని ఒక ఆటోమేటెడ్ డ్రైవింగ్ సిస్టం) ఆన్ చేసి ప్రయాణిస్తున్న సమయంలో.. తన ఫోన్ అనుకోకుండా కారులోనే కింద పడింది. ఆ సమయంలో వంగి ఫోన్ తీసుకున్న సమయంలో కారు రోడ్డుపై ఉన్న వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ఘటనపై బాధితులు కోర్టును ఆశ్రయించారు.ఈ ఘటనపై సుదీర్ఘ విచారణ జరిపిన కోర్టు.. ఎట్టకేలకు తీర్పునిస్తూ 329 మిలియన్ డాలర్లు పరిగహారంగా చెల్లించాలని ఆదేశించింది. ఇందులో 242 మిలియన్ డాలర్లు (సుమారు రూ.2,100 కోట్లు) టెస్లా చెల్లించాలని.. మిగిలిన మొత్తాన్ని డ్రైవర్ ఇవ్వాలని పేర్కొంది. ఈ తీర్పుపై టెస్లా తన అసంతృప్తిని వ్యక్తం చేసింది. ఈ తీర్పుపై అప్పీల్ చేయనున్నట్లు సంస్థ యాజమాన్యం పేర్కొంది.

పాక్‌లో రైలు ప్రమాదం..

30 మందికి గాయాలు

జనంసాక్షి:పాకిస్తాన్‌లో రైలు ప్రమాదం చోటుచేసుకుంది. లాహోర్ సమీపంలో రైలు పట్టాలు తప్పడంతో 30 మంది ప్రయాణికులు గాయపడ్డారు. లాహోర్ నుండి బయలుదేరిన కొద్దిసేపటికే ఇస్లామాబాద్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పింది.ఘటనా స్థలంలో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.పాకిస్తాన్ రైల్వేలు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం సాయంత్రం లాహోర్ నుండి రావల్పిండికి వెళ్తున్న ఇస్లామాబాద్ ఎక్స్‌ప్రెస్.. షేక్‌పురాలోని కాలా షా కాకు వద్ద పట్టాలు తప్పింది. రైలులోని 10 బోగీలు పట్టాలు తప్పడంతో 30 మంది ప్రయాణికులు గాయపడ్డారు. గాయపడినవారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. సహాయక బృందాలు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని, గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించాయి.ఇప్పటివరకు ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని రైల్వే అధికారులు తెలిపారు. లాహోర్ రైల్వే స్టేషన్ నుండి బయలుదేరిన అరగంటకు రైలు బోగీలు పట్టాలు తప్పాయని తెలుస్తోంది. సమాచారం అందుకున్న రైల్వే మంత్రి ముహమ్మద్ హనీఫ్ అబ్బాసి వెంటనే రైల్వే సీఈఓ, డివిజనల్ సూపరింటెండెంట్‌ను అప్రమత్తం చేశారు. ప్రమాదం జరిగిన ప్రదేశానికి చేరుకుని, పరిస్థితిని పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టి ఏడు రోజుల్లోగా విచారణ ఫలితాలను సమర్పించాలని ఆదేశించారు.

ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా అవతరిస్తున్నాం

ప్రయోజనాలకు అవసరమైన చర్యలను మా ప్రభుత్వం తప్పనిసరిగా తీసుకుంటుంది. ఇందు కోసం విభేదాలను పక్కన పెట్టి.. రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు ముందుకు రావాలి. స్వదేశీ ఉత్పత్తులకు మద్దతివ్వడం ఇచ్చేలా తీర్మానం చేయాలి" అని పిలుపు ఇచ్చారాయన.ఇదిలా ఉంటే.. భారత్‌పై 25శాతం సుంకాలతోపాటు పెనాల్టీ విధిస్తూ ప్రకటన చేసిన కొద్ది గంటల్లోనే ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రష్యా-భారత్ మధ్య వాణిజ్య బంధాల్ని ప్రస్తావించిన ట్రంప్ తనకేం సంబంధం లేదంటూనే శాపనార్థాలు పెట్టారు. రెండు దేశాలవి డెడ్ ఎకానమీలని, కలిసి అవి ఆర్థిక వ్యవస్థలను మరింత దిగజార్చుకుంటాయని, కలిసి మునుగుతాయని వ్యాఖ్యానించారు.'మనకు భారత్ స్నేహితురాలే అయినా ఆ దేశంతో స్వల్ప లావాదేవీలే ఉన్నాయి. ఆ దేశం సుంకాలు ప్రపంచంలోనే అత్యధికంగా ఉన్నాయి. ఉక్రెయిన్‌లో దాడులు ఆపాలని ప్రపంచమంతా గొంతెత్తి అరుస్తుంటే.. భారత్ మాత్రం రష్యా నుంచి ఆయుధాలను, ఇంధనాన్ని కొనుగోలు చేస్తోంది' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఈ ప్రకటన ఇటు భారత్‌లోనూ రాజకీయ దుమారం రేపింది.మోదీ పాలనలో భారత ఆర్థిక వ్యవస్థ ఖతమైందని, దేశ ప్రధాని, ఆర్థిక మంత్రికి తప్ప ఈ విషయం ప్రపంచం మొత్తానికి తెలుసని.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యలు చేశారు.

ఎయిర్‌పోర్టులో మహిళపై యువకుని దౌర్జన్యం

బొగోటా: కొలంబియాలోని ఎల్ డొరాడో విమానాశ్రయంలో ఆ సమయంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
3 ఆగస్టు 2025

కలెక్టర్ ప్రతి రోజు సమీక్ష ..

ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్‌ను కలెక్టర్ ప్రతీరోజు సమీక్ష చేసే అవకాశం ఉంటుంది. ఇప్పటికే రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ ఉన్న పలు ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నారు. ఇప్పుడు టీచర్ల ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్‌ను సైతం కలెక్టర్ ఏరోజు కారోజు పర్యవేక్షించే అవకాశం ఉంది. మరోవైపు డీఈఓ కార్యాలయాల్లో డ్యాష్ బోర్డులు ఏర్పాటు చేయనున్నారు. డీఈఓలు కూడ టీచర్ల అటెండెన్స్‌ను పర్యవేక్షిస్తారు.

ప్రభుత్వ పాఠశాలల వేళలు..

పీఎస్‌లు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, యూపీఎస్‌లు, హైస్కూళ్లు ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు పని వేళలున్నాయి. టీచర్లు ఉదయం నిర్దేశించిన సమయం కంటే ముందుగానే,సాయంత్రం విధుల సమయం ముగిశాక అంటే రోజుకు రెండుసార్లు ముఖ గుర్తింపు హాజరు చేసుకోవాల్సింటుంది.

'ముఖం' చూపించాల్సిందే!

పాఠశాలల్లో ప్రారంభమైన ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్..

ఉపాధ్యాయుల డుమ్మాలకు చెక్ పడినట్లే..

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఆగస్టు 1 (జనంసాక్షి) :

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు ఇక ముఖ గుర్తింపు ఫేషియల్ రికగ్నిషన్ సిస్టం (ఎఫ్ఆర్ఎస్) హాజరు అమలు చేయాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీఈఓలు ఆయా ఎంఈఓలు, హెచ్ఎంలను గురువారం ఆదేశించారు. గత ఏడాది ఫిబ్రవరి నుంచి రాష్ట్రంలోని పెద్దపల్లి జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా టీచర్ల ముఖగుర్తింపు హాజరును అమలు చేస్తున్నారు. అక్కడ విజయవంతం కావడంతో శుక్రవారం నుండి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని ప్రభుత్వ,జిల్లా పరిషత్, కేజీబీవీలు, మోడల్ స్కూల్స్, యూఆర్ఎస్, టీజీఆర్ఈఐఎస్‌లలో అమలు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులు ఈ యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునే ప్రక్రియలో సర్వర్ ప్రాబ్లంతో ఇబ్బందులు పడుతున్నారు.

డీఎస్ఈ ఎఫ్ఆర్ఎస్ యాప్ ద్వారా.. ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికే విద్యార్థులకు ముఖ గుర్తింపు హాజరు తీసుకుంటున్నారు. అందుకు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ (డీఎస్ఈ ఎఫ్ఆర్ఎస్) యాప్‌ను వినియోగిస్తున్నారు. ఇదే యాప్ ద్వారా హెచ్ఎంలు,టీచర్ల,నాన్ టీచింగ్ ఉద్యోగుల ముఖ గుర్తింపు హాజరు అమలు చేస్తున్నారు. హెచ్ఎంలు తమ సెల్‌ఫోన్‌లోని డీఎస్ఈ యాప్‌లో టీచర్ మాడ్యూల్ టీచర్లకు, నాన్‌టీచింగ్ మాడ్యూల్‌లో నాన్‌టీచింగ్ సిబ్బందిని రిజిస్ట్రేషన్ చేయాలి. ఫొటో తీసి వారి వివరాలు, పాఠశాల సమయం తదితర వివరాలు అప్‌లోడ్ చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ పూర్తయ్యాక టీచర్లు, నాన్‌టీచింగ్ సిబ్బంది తమ తమ సెల్‌ఫోన్లలో సంబంధిత యాప్‌లో ఇక ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ తీసుకోవచ్చు. శుక్రవారం నుండి రిజిస్ట్రేషన్ చేసుకొంటున్నారు. జియోట్యాగింగ్‌ను కూడ ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయులు తమ తమ పాఠశాలలోనే ముఖ గుర్తింపు హాజరు తీసుకోవాల్సి ఉంటుంది. అనివార్య కారణాలవల్ల సెలవు పెడితే తప్పనిసరిగా యాప్‌లో రిక్వెస్ట్ పెట్టుకోవాల్సి ఉంటుంది. దీనిపై విద్యాశాఖ ఉన్నతాధికారులు డీఈఓలకు డెమో ఇచ్చినట్లు తెలుస్తుంది. విద్యార్థులకు ఇప్పటికే ముఖగుర్తింపు హాజరు తీసుకుంటున్నప్పటికీ కొన్ని పాఠశాలల్లో అమలు చేయటంలేదు. ఇందుకు పలు కారణాలు చేపుతున్నారు.

ఉపాధ్యాయుల డుమ్మాలకు చెక్‌పడినట్లేనా..?

విధులకు డుమ్మా కొట్టే కొందరు టీచర్లకు ముఖగుర్తింపు హాజరుతో చెక్‌పడే అవకాశం ఉండవచ్చు. జిల్లా కేంద్రాల నుంచి గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే టీచర్లు కొందరు సక్రమంగా విధులు నిర్వర్తించడం లేదనే ఆరోపణలున్నాయి. ఆలస్యంగా వెళ్లడం, సాయంత్రం నిర్దేశించిన సమయం కంటే ముందే వెళ్లిపోవడం లాంటివి జరుగుతూనే ఉన్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేంద్రం నుంచి ఇతర జిల్లాలకు బస్సుల ద్వారా, సొంత వాహనాల ద్వారా గ్రామీణ ప్రాంతాలకు షటిల్ సర్వీస్ చేసే టీచర్లు ఉన్నారు. ఈ ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్‌తో వారికి ఇబ్బందులు ఎదురు కావచ్చు. డీఈఓలతో పాటు రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు ఈ అటెండెన్స్‌పై ప్రతీరోజు పర్యవేక్షించే అవకాశం ఉంది.

గడువు ముగిసిన మందులను రోగులకు ఇవ్వరాదు: జిల్లా కలెక్టర్

కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 2 (జనం సాక్షి) :

గడువు ముగిసిన మందులను రోగులకు ఇవ్వరాదని జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ వైద్య అధికారులను ఆదేశించారు.శనివారం జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ కామారెడ్డి మండలంలోని దేవునిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో గల క్యాసంపల్లి ఆయుష్మాన్ ఉప ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.. ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రలో అందుతున్న టువంటి సేవల గురించి ఆరా తీశారు. రక్త పరీక్షల గదిని పరిశీలించి అవసరమైన వారికి ప్రాథమికంగా వైద్య పరీక్షలు కచ్చితంగా చేయాలని అన్నారు. అదేవిధంగా డ్రగ్ స్టోర్ రూం ను పరిశీలించి వర్షాకాలంలో అధికంగా ఉపయోగపడే జ్వరం, విరేచనాలు, దగ్గు,జలుబు తదితర వ్యాధుల మందులను ఎప్పుడూ అందుబాటులో ఉంచాలని, కాలం చెల్లిన మందులను ఉపయోగించరాని ఆదేశించారు. వ్యాక్సినేషన్ గదిని పరిశీలించి గర్భిణీలకు, చిన్నారులకు నిర్ణీత సమయాలలో వ్యాక్సినేషన్ వేయాలని సూచించారు. రోజు ఎంతమంది అవుట్ పేషంట్లు ఈ ఆస్పత్రికి వస్తున్నారని అడిగి సీజనల్ వ్యాధులు ప్రభలే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున వైద్యులు, వైద్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదేశించినారు. ఆసుపత్రిలో వివిధ విభాగాలలో అందుచున్నటువంటి సేవల గురించి తెలుసుకుని సంతృప్తి చెందడం జరిగింది. విధుల పట్ల అలసత్వం గానీ అశ్రద్ధ వహించినటువంటి సిబ్బంది పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ పి చంద్రశేఖర్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటుచేసిన వాన నీటి ఇంకుడు గుంతను పరిశీలించారు.గ్రామంలో అపరిశుభ్ర వాతావరణం ఏర్పడకుండా క్రమం తప్పకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించాలనిఇంచార్జి పంచాయతీ సెక్రెటరీని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రభు కిరణ్, దేవునిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ జోహా ముజీబి, క్యాసంపల్లి ఉప ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ మీనాక్షి దేవి ఉన్నారు.

పేదల ఆత్మగౌరవమే స్వంత ఇంటి కల

- **రాజన్న ఆలయం రూ150 కోట్లతో అభివృద్ధి**
- **గత ప్రభుత్వంలో స్కామూలే స్కాములు : ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఆగస్టు 2 (జనంసాక్షి) :

వేములవాడ మున్సిపల్ పరిధిలో శనివారం ఇంటి స్థలం లేని నిరుపేదలకు 144 మంది లబ్ధిదారులకు పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ అన్వేష్ అధ్యక్షతన నిర్వహించారు. 144 లబ్ధిదారులకు డ్రా పద్ధతిన బ్లాక్ లు కేటాయించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఆత్మగౌరవమే సొంత ఇంటి కల అన్నారు.ఇళ్ళు లేని 144 మంది నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్లు ఇచ్చి వాళ్ల గౌరవం కాపాడిందన్నారు.

గత ప్రభుత్వ హయంలో నిర్మించి నిరుపయోగంగా మారిన ఇండ్లను ఈ రోజు పేద ప్రజలకు పంపిణీ చేస్తున్నమని,ఆనాడు ఈ ఇండ్లను పేదలకు ఇవ్వండి అని డిమాండ్ చేశాం, ధర్నాలు చేశాం, మీతో కాకుంటే ఈ రోజు ఇందిరమ్మ రాజ్యంలో ఇండ్లను ఇస్తున్నామన్నారు.బస్ డిపో పక్కన ఉన్న నిర్మాణానికి రూ 7 కోట్ల 63 లక్షలు మంజూరు కాగా అందులో రూ 2. కోట్ల ఖర్చు పెట్టగా మిగిలిన రూ 5 కోట్ల 63 లక్షలను 144 మందికి పంచుతూ నిర్మాణాలు పూర్తి చేస్తమన్నారు.12 బ్లాకులలో, జి ప్లస్ 2 తో 144 ఇండ్లు ఉన్నాయన్నారు.బిఆర్ఎస్ ప్రభుత్వం గత పదేళ్లలో 10 రేషన్ కార్డులు ఇవ్వలేదని, పేదలకు ఇళ్లు ఇవ్వలేదన్నారు.

రాజన్న ఆలయం రూ 150 కోట్లతో అభివృద్ధి జరుగుతుందన్నారు. కాళేశ్వరంను కామధేనువుగా మార్చుకుందన్నారు. కాలేశ్వరం ప్రాజెక్టుపై పూర్తిస్థాయి విచారణ చేపట్టిందని,3 మెన్ క్యాబినెట్ లో కాళేశ్వరం అవినీతి అక్రమాలు బయట ప్రపంచానికి తెలుస్తాయన్నారు.కాంగ్రెస్ హయాంలో నాగార్జున సాగర్, కడెం, ఎన్నో ప్రాజెక్ట్ లు కట్టిన ఇప్పటికే చెక్కు చెదర లేదన్నారు. కాళేశ్వరం నెలల్లోనే కూలడంతో ప్రజా ధనం ఎంత నష్టం జరిగిందో ఆలోచించాలన్నారు.గత ప్రభుత్వంలో గొర్రెల్లో స్కాం,కరెంట్ కొనుగోలులో, ఈ కారు రేసింగ్‌లో,అన్ని అవినీతే స్కాంలన్నారు. గత నాలుగు రోజుల నుండి గొర్రెల స్కాంపై పూర్తిస్థాయి విచారణ జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన క్రమంలో ఆనాడు మిగులు బడ్జెట్ ఉంటే ఇవ్వాళ వేల కోట్లు అప్పులు చేసి తెలంగాణ రాష్ట్రని అప్పలపాలు చేసిన ఘనత గత ప్రభుత్వనీదని ఆయన విమర్శించారు. బనకచర్ల పాపం బిఆర్ఎస్ పార్టీదన్నారు.పిసిసి హోదాలో నే బిఆర్ఎస్ను గద్దె దించుతాం చెప్పి దించిన వ్యక్తి రేవంత్ రెడ్డి అన్నారు.కేసీఆర్ ఆనాడు స్వయం కృషితో మెదడు ఉపయోగించి కాళేశ్వరం కట్టినన్నాని పలు మార్లు చెప్పిన ఆయన ఇప్పుడు ఏం తెల్వదు అనడం హాస్యాస్పద మన్నరు. కవిత ఒక దుకాణం ఏర్పాటు చేసిందని, బిఆర్ఎస్‌లో మిగిలేది ఆ నలుగురు మాత్రమే అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రోండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, గృహ నిర్మాణ శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్,మున్సిపల్ కమిషనర్ అన్వేష్, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

పారమిత వరల్డ్ స్కూల్‌లో ఘనంగా
హౌస్ ప్రారంభ వేడుకలు

ముఖ్య అతిథిగా పారమిత పాఠశాలల చైర్మన్ డా.ఇ. ప్రసాదరావు

కరీంనగర్ జిల్లా బ్యూరో, ఆగస్టు 02 (జనంసాక్షి) : స్థానిక అల్గునూర్ పారమిత వరల్డ్ స్కూల్‌లో హౌస్ ప్రారంభ వేడుకలు ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పారమిత పాఠశాలల చైర్మన్ డా. ఈ .ప్రసాదరావు దీప ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా పాఠశాల విద్యార్థులు గృహాల వారిగా పతాక ఆవిష్కరణ, క్రీడా ప్రమాణ స్వీకారం, అద్భుతమైన మార్చ్ పాస్ట్ తో వేడుకలు ప్రారంభమయ్యాయి. అనంతరం హౌస్ ప్రారంభ వేడుకలు లలో భాగంగా విద్యార్థులను ధ్యానచంద్, ఆర్యభట్ట, సి.వి.రామన్, చాణక్య గృహాలుగా విభజించి, ఈ గృహ ప్రారంభోత్సవ వేడుకలను అట్టహాసంగా చైర్మన్ డా.ఇ. ప్రసాదరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా డా.ఇ.ప్రసాదరావు మాట్లాడుతూ... హౌస్ సిస్టమ్ ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సమూహచేతన, క్రీడాస్ఫూర్తి పెంపొందుతుందనీ, విద్యార్థుల శారీరక, మానసిక అభివృద్ధికి ఇది బాగా దోహదపడుతుందని పారమిత పాఠశాలల్లో గత 30 ఏళ్లుగా ఈ విధానాన్ని అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. హెడ్ బాయ్ ,హెడ్ గర్ల్ ప్రతీ గృహానికి క్యాప్టెన్, వైస్ క్యాప్టెన్, అసెంబ్లీ, సిసిఏ, స్పోర్ట్స్ క్యాప్టెన్ లను ఎన్నికల ద్వారా ఎన్నుకున్నారనీ, ఈ గృహాలలోని విద్యార్థులు బృందాలు గా ఏర్పడి సాంస్కృతిక అంశాలు, క్రీడా అంశాలలో పోటీ పడడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో పాఠశాల డైరెక్టర్స్ ప్రసూన, వి.యు.యం.ప్రసాద్, వినోద్ రావు, ప్రిన్సిపాల్ ఎం.శ్రీకర్ హౌస్ కన్వీనర్ కె.శ్రీని వాస్, పి.ఈ.టీ లు జెట్టి శ్రీనివాస్, టి.శ్రీధర్, అశోక్, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రంగారెడ్డి: మీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మనీషా (28) ఆత్మహత్య చేసుకుంది. 2020 బ్యాచ్‌కు చెందిన మనీషా గత ఐదేళ్లుగా మీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తోంది. కుటుంబ కలహాల నేపథ్యంలో వారం రోజుల క్రితం ప్రశాంతి హిల్స్‌లోని తన ఇంట్లో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి చేరిన మనీషాను నాంపల్లిలోని కేర్ హాస్పిటల్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ శనివారం (ఆగస్టు 2) ఆమె మరణించింది.

సోషల్ మీడియా ద్వారా మోసం
ఫోటోలతో బ్లాక్‌మెయిల్, ఫోన్‌పే ద్వారా వసూళ్లు

- **కామారెడ్డిలో దొంగల ముఠా అరెస్ట్, 9 కేసుల ఛేదించిన పోలీసులు**
- **అమాయకులను బెదిరించి డబ్బులు దోచుకున్న ఐదుగురు నేరస్తులు**
- **ఆధునిక సాంకేతికతతో నేరస్తుల గుర్తింపు, ఎస్పీ అభినందనలు**

కామారెడ్డి, ఆగస్టు 2 (జనంసాక్షి): సోషల్ మీడియా ద్వారా అమాయకులను మోసం చేసి, బెదిరింపులతో డబ్బులు దోచుకున్న ఐదుగురు దొంగల ముఠాను కామారెడ్డి పోలీసులు అరెస్ట్ చేసి, తొమ్మిది కేసులను ఛేదించినట్లు జిల్లా ఎస్పీ వెల్లడించారు. 2025 జూలై 25న ఒక బాధితుడి ఫిర్యాదు మేరకు కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్‌లో మొదటి కేసు నమోదైంది. సోషల్ మీడియా యాప్‌ల ద్వారా అమాయకులను పరిచయం చేసుకుని, కామారెడ్డి మేఘా కార్ షెడ్ వద్దకు పిలిపించి, ఫోటోలు తీసి, వాటిని అసభ్యకరంగా మార్చి, కుటుంబ సభ్యులకు, స్నేహితులకు లేదా సోషల్ మీడియాలో వైరల్ చేస్తామని బెదిరించి, ఫోన్‌పే ద్వారా బలవంతంగా డబ్బులు వసూలు చేసినట్లు ఫిర్యాదులో తెలిపారు. ఈ ఫిర్యాదు ఆధారంగా దర్యాప్తు ప్రారంభించగా, ఇలాంటి మోసాలకు పాల్పడిన బాధితుల నుండి మరిన్ని ఫిర్యాదులు అందడంతో, కామారెడ్డి పోలీస్ స్టేషన్‌లో 6 కేసులు, తంగళ్ళపల్లిలో 2 కేసులు, నిజామాబాద్ టౌన్‌లో 1 కేసు నమోదయ్యాయి.

జిల్లా ఎస్పీ సూచనలతో, ఏఎస్పీ చైతన్య రెడ్డి పర్యవేక్షణలో, కామారెడ్డి పట్టణ ఇన్స్పెక్టర్ నరహరి, సిసిఎస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్సైలు నరేష్, వినయ్ సాగర్, శ్రీరామ్, బాల్ రెడ్డి, రాజారామ్, సిసిఎస్ సిబ్బంది మైసయ్య, రవి తదితరులు ఫోన్‌పే నెంబర్లు, సిడిఆర్ విశ్లేషణ ద్వారా నేరస్తులను గుర్తించారు. ఆగస్టు 2న రైల్వే స్టేషన్ వద్ద సమాచారం మేరకు ఐదుగురిని అదుపులోకి తీసుకుని విచారించగా, వారు నేరాలను అంగీకరించారు. అరెస్టైన వారు: షేక్ జోహేబ్ (19, విద్యార్థి, కామారెడ్డి), షేక్ సోహెల్ (27, లేబర్, సిరిసిల్ల), మహమ్మద్ మిరాజ్ పాషా (38, కార్ గ్యారేజ్, కామారెడ్డి), సయ్యద్ ముజఫర్ ఆలీ (38, వ్యాపారి, కామారెడ్డి), ఒక మైనర్. వీరు గతంలో కామారెడ్డి, సిద్దిపేట, సిరిసిల్ల, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో ఇలాంటి నేరాలకు పాల్పడి, జైలు శిక్ష అనుభవించినట్లు తెలిపారు.

పోలీసులు నేరస్తుల నుండి 96,350 రూపాయల నగదు, ఆరు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఇటువంటి నేరాలకు పాల్పడే వారిని ఆధునిక సాంకేతికతతో పట్టుకుని, కోర్టులో హాజరుపరిచి శిక్షించేలా చేస్తామని ఎస్పీ హెచ్చరించారు. బాధితులు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చని, వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఏదైనా అనుమానాస్పద సంఘటన లేదా నేరం జరిగిన వెంటనే డయల్ 100కు సమాచారం అందిస్తే, నేరస్తులను త్వరగా పట్టుకునే అవకాశం ఉంటుందని సూచించారు. ఈ కేసు ఛేదనలో చాకచక్యంగా వ్యవహరించిన ఇన్స్పెక్టర్లు నరహరి, శ్రీనివాస్, ఎస్సైలు నరేష్, వినయ్ సాగర్, శ్రీరామ్, బాల్ రెడ్డి, రాజారామ్, సిసిఎస్ సిబ్బంది మైసయ్య, రవి, పోలీస్ స్టేషన్ సిబ్బంది కమలాకర్, నరేష్, రాజు నాయక్, భాస్కర్, రమేష్, రవి, నవీన్, అనిల్, ప్రవీణ్‌లను జిల్లా ఎస్పీ అభినందించారు.

పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వ పాలన

- **ప్రతి కుటుంబానికి నెలకు సగటున 1200 రూపాయల విలువ గల సన్న బియ్యం ఉచితంగా అందిస్తున్నాం**
- **వీ హబ్ ఉప కేంద్రం పెద్దపల్లి జిల్లాలో ఏర్పాటు**
- **మహిళల కోసం మంథని సమీపంలో ప్రత్యేక పారిశ్రామిక పార్క్ ఏర్పాటుకు కృషి**
- **నూతన రేషన్ కార్డుల పంపిణీ, మహిళా శక్తి సంబరాలు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్‌బాబు**

మంథని, ఆగస్టు 02, (జనంసాక్షి):

రాష్ట్రంలో పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం పాలన సాగిస్తోందని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు తెలిపారు. శనివారం మంథనిలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షతో కలిసి ఆర్.ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన నూతన రేషన్ కార్డుల పంపిణీ, మహిళా శక్తి సంబరాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అర్హులైన పేదలకు రేషన్ కార్డులు జారీ చేయాలని గతంలో ప్రతిపక్షంగా ఉన్నప్పుడు ధర్నాలు చేసినా, గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని మంత్రి విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు, అర్హులకు నూతన రేషన్ కార్డులతో పాటు నెలకు సగటున 1200 రూపాయల విలువైన సన్న బియ్యం ఉచితంగా అందిస్తున్నామని, గతంలో దొడ్డు బియ్యం సరఫరాతో అక్రమార్కులు లబ్ధి పొందగా, ఇప్పుడు సన్న బియ్యం పేదలకు ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. రేషన్ డీలర్లు బియ్యం పంపిణీని సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

పేదలకు నాణ్యమైన విద్య కోసం ఆదర్శ పాఠశాలలను స్థాపించామని, మహిళలు రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని మంత్రి తెలిపారు. ఇప్పటివరకు 200 కోట్ల జీరో టికెట్లు జారీ చేసి, 6680 కోట్ల రూపాయలను ప్రభుత్వం మహిళల తరఫున చెల్లించిందని వివరించారు. పేద కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా, మహిళా సంఘాలకు వడ్డీ రహిత రుణాలు పునఃప్రారంభించినట్లు చెప్పారు. మహిళల వ్యాపారాభివృద్ధి కోసం మంథని సమీపంలో ప్రత్యేక పారిశ్రామిక పార్క్, పెద్దపల్లి జిల్లాలో వీ-హబ్ ఉప కేంద్రం ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద డైరీ, పౌల్ట్రీ ఫార్మ్‌ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని, మంథనిలో కుట్టు మిషన్ శిక్షణ అందిస్తున్నామని, రాబోయే కాలంలో కంపెనీల స్థాపనకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నామని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కోసం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పనులు చేపడుతున్నామని, రైతులకు ఒకే ఏడాదిలో 21 వేల కోట్లతో 2 లక్షల రుణ మాఫీ, 9 రోజుల్లో 9 వేల కోట్ల రైతు భరోసా సొమ్ము విడుదల చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఆరోగ్య శ్రీ పరిమితిని 10 లక్షలకు పెంచామని, 60 వేల నిరుద్యోగ యువతకు ఉద్యోగ నియామక పత్రాలు అందించామని, ప్రైవేట్ రంగంలో ఉపాధి కోసం భారీ పెట్టుబడులను ఆకర్షించామని చెప్పారు. మంథని నియోజకవర్గంలో మొదటి దశలో 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామని, ప్రతి ఏటా నూతన ఇండ్ల కేటాయిస్తామని, భూమి లేని నిరుపేదలకు ప్రభుత్వ భూములు కేటాయించి ఇండ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అడవి సోమనపల్లిలో 200 కోట్లతో కార్పొరేట్ స్థాయి గురుకుల పాఠశాల, గురుకులాల్లో 40% డైట్ చార్జీలు పెంచినట్లు తెలిపారు.

మంత్రి శ్రీధర్ బాబు రామగిరి, మంథని, ముత్తారం, కమాన్‌పూర్ మండలాలకు చెందిన 2389 స్వశక్తి మహిళా సంఘాలకు 2.37 కోట్ల వడ్డీ రాయితీ చెక్కు, సహజ మరణం చెందిన 17 మహిళా సంఘ సభ్యులకు 14.66 లక్షల లోన్ బీమా చెక్కు, ప్రమాదవశాత్తు మరణించిన ఒక సభ్యురాలి కుటుంబానికి 10 లక్షల ప్రమాద బీమా చెక్కు, 385 శివశక్తి మహిళా సంఘాలకు 30 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాల చెక్కులు పంపిణీ చేశారు. క్రిస్టియన్ కార్పొరేషన్ ద్వారా మూడు కుట్టు మిషన్లు అందజేశారు. మంథని పట్టణంలో 6.70 కోట్లతో సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ, కల్వచర్ల నుండి లోంక కేశారం వరకు 2.60 కోట్లతో సిసి రోడ్డు ప్రారంభించారు. మంథనిలో 20.50 కోట్లతో 410 ఇందిరమ్మ ఇండ్లు, 7 గ్రామాల్లో 1.40 కోట్లతో గ్రామపంచాయతీ భవనాలు, ఎక్లాస్పూర్‌లో 2.70 కోట్లతో బాయ్స్ హాస్టల్ భవనానికి శంకుస్థాపన చేశారు. సింగరేణి సిఎస్ఆర్ నిధులతో పదో తరగతి విద్యార్థులకు క్యూఆర్ కోడ్ పుస్తకాలు పంపిణీ చేశారు. వనమహోత్సవంలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.వేణు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నన్నయ గౌడ్, ఆర్డీఓ సురేష్, తహసిల్దార్, ఎంపిడిఓ, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సిరిసిల్ల చేనేత కళాకారునికి అరుదైన గౌరవం

- **నాగుల మల్లయ్య స్మారక పురస్కారానికి ఎంపికైన చేనేత కళాకారుడు "వెల్ది హరి ప్రసాద్"**

రాజన్న సిరిసిల్ల బ్యూరో, ఆగస్టు 2 (జనంసాక్షి) : సిరిసిల్ల చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్‌కు అరుదైన గౌరవం దక్కింది. నాగుల మల్లయ్య స్మారక పురస్కారానికి హరిప్రసాద్ ఎంపికయ్యా రు. శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమా వేశంలో స్మారక పురస్కార కమిటీ నిర్వాహకులు ఎం.డి. సలీం, నాగుల సంతోష్ గౌడ్ వివరాలను వెల్లడించారు. 2025 సంవత్సరానికి గాను నాగుల మల్లయ్య స్మారక పురస్కారానికి "చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆగస్టు 4వ తేదీ నాగుల మల్లయ్య జయంతి సందర్భంగా సిరిసిల్ల టౌన్ క్లబ్ లో హరిప్రసాద్ కు పురస్కారం అందజేయన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో పాటు ప్రముఖులు హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి సాహిత్య అభిమానులు కవులు కళాకారులు భారీగా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

చేనేత కళ లో"వెల్ది" ప్రత్యేక ముద్ర

మధ్యతరగతి చేనేత కుటుంబంలో సిరిసిల్లలో జన్మించిన చేనేత కళాకారుడు హరిప్రసాద్, బాల్యం నుంచే మర మగ్గాల పరిశ్రమలో తన తండ్రి కుటుంబం కోసం పడుతున్న కష్టాలను చూస్తూ పెరిగాడు. మనమగ్గాల పరిశ్రమలో అనేక ప్రయోగాలను చేస్తూ పరిశ్రమకు అవసరమైన ఎన్నో మెలుకులను రూపొందిస్తూ వచ్చారు. కళా రంగంపై తనకు ఉన్న ప్రత్యేకమైన శ్రద్ధతో ఎన్నో సూక్ష్మ కళారూపాలను రూపొందించి పలుపురి ప్రశంసలు అందుకున్నారు. చేతి మగ్గంపై అనేకమంది ప్రముఖుల చిత్రాలను రూపొందించాడు. దబ్బనం లో దూరే చీర, అగ్గిపెట్టెలో ఇమిరే చీరతోపాటు అనేక ప్రయోగాలు చేసి గుర్తింపు పొందారు. సాక్షాత్తు దేశ ప్రధాని నరేంద్ర మోడీ కూడా మంకీ బాత్ కార్యక్రమంలో సిరిసిల్ల చేనేత కళాకారుడు హరిప్రసాద్ కళ ను కొనియాడారు. పలు సందర్భాలలో హరి ప్రసాద్ ప్రత్యేక కళారూపాలను చేతిమగ

కూలగొట్టుడు కాదు.. పర్యావరణహితం హైడ్రా లక్ష్యం

కబ్జాలు చేసినవారే దుష్ప్రచారం చేస్తుంర్రు..

హైడ్రా.. బస్తీతో దోస్తీ కార్యక్రమంలో కమిషనర్

హైదరాబాద్, ఆగస్టు 02 (జనంసాక్షి)

కూలగొట్టుడు కాదు.. పర్యావరణ హితమైన, అందరికీ నివాస యోగ్యమైన నగర నిర్మాణమే హైడ్రా లక్ష్యమని కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. హైడ్రా అంటే భయం కాదని.. నగర ప్రజలందరికీ ఓ అభయం అని అన్నారు. చెరువులు, నాలాలు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను కబ్జా చేసిన వారు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని నగర ప్రజలకు సూచించారు. 5 ఎకరాల భూమిని కబ్జా చేసి అందులో పని వాళ్లకోసం ఒక షెడ్డు వేసి దానిని తొలగించినప్పుడు వారిని ముందుంచి గేమ్ ఆడి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న విషయాన్ని అందరూ గ్రహించాలని కోరారు. హైడ్రా బస్తీతో దోస్తీ కార్యక్రమంలో భాగంగా శనివారం టోలీచౌక్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన మొట్టమొదటి కార్యక్రమంలో వివిధ బస్తీల నుంచి వచ్చిన ప్రజలను ఉద్దేశించి కమిషనర్ ప్రసంగించారు. హైడ్రా ఎప్పుడూ పేదలు, సామాన్యుల పక్షమే అని తాము చేస్తున్న కార్యక్రమాలను పరిశీలిస్తే అర్థమౌతుందన్నారు. హైడ్రాను బూచిగా చూపించి వారి కబ్జాలను, ఆక్రమణలను కాపాడుకోడానికి బడాబాబులు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. పేదలు ఎక్కడైనా ఇల్లు నిర్మించుకుని ఉంటే వాటిని తొలగించమని.. ఒకవేళ తప్పని సరైతే వారికి ప్రత్యామ్నాయంగా ఎక్కడైనా నివాసాన్ని చూపించి మాత్రమే హైడ్రా ముందుకెళ్తుతందని స్పష్టం చేశారు. ప్రభుత్వ విధానం కూడా ఇదేనని తెలిపారు. మూసీ నది సుందరీకరణతో హైడ్రాకు సంబంధం లేదు.. నదీప్రవాహానికి అడ్డంగా మారిన కబ్జాలను తొలగించాం. ఇలా 10 ఎకరాల మేర కబ్జా చేసి నెలకు రూ. కోటి ఆదాయం పొందుతున్నవారి భరతం పట్టామన్నారు.

నాలాలు, చెరువుల పరిరక్షణ అందరి బాధ్యత

నాలాలను, చెరువులను కాపాడడం అందరి బాధ్యతగా భావించాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. షేక్‌పేట, టోలీచౌక్ ప్రాంతంలోని విరాట్‌నగర్, బసవతారకం నగర్ ప్రాంతంలో నాలాల్లో పరుపులు, దిండులు, ప్లాస్టిక్ వ్యర్థాలు ఏళ్లుగా పేరుకుపోవడంతో గతంలో వరద ముంచెత్తేది. పది రోజులుగా నాలాల పూడికను తొలగించడంతో ఇప్పుడు వరద సాఫీగా సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో భాగస్వాములైన స్థానిక కార్పొరేటర్లు, బస్తీల నాయకులతో పాటు.. ప్రజలను హైడ్రా కమిషనర్ అభినందించారు. ఆరోగ్యమైన వాతావరణంలో బతకడం ఓ హక్కు అని.. దీనిని అందరూ కలిసి సాధించుకోవాలన్నారు. చారిత్రక బుల్కాపూర్ నాలాను పరిశుభ్రంగా ఉంచుకోవడంలో అందరూ సహకరించాలి. అపోలో ఆసుపత్రితో పాటు.. పైన ఉన్న 20కి పైగా బస్తీల నుంచి మురుగు నీరు వస్తోందని, అంతా ఇక్కడ కలిసి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఫిర్యాదు చేయగానే ఇక్కడ పెద్దయెత్తున నాలా క్లీనింగ్ కార్యక్రమాన్ని చేపట్టామని హైడ్రా కమిషనర్ చెప్పారు. సీసీటీవీలు కూడా నాలా పాడుగునా పెడతామని.. చెత్త వేసిన వారిని స్థానికులే ఆపాలన్నారు. బస్తీతో దోస్తీ కార్యక్రమం ఆరంభం మాత్రమే.. నగరంలోని 750 బస్తీలకు వరద ముప్పు ఉందనీ.. అన్ని బస్తీల్లో నాలాలను పరిశుభ్రం చేసి ముంపు ముప్పును తప్పిస్తామని హైడ్రా అడిషనల్ డైరెక్టర్ వర్ల పాపయ్య చెప్పారు.

పేదల పక్షం అనేది రుజువైంది..

హైడ్రా పేదల పక్షమని మరోసారి రుజువైందని జూబ్లీహిల్స్, షేక్‌పేట కార్పొరేటర్లు వెంకటేష్, ఫరాజ్‌లు అన్నారు. అంబర్‌పేటలోని బతుకమ్మకుంట అభివృద్ధే ఇందుకు నిదర్శనమన్నారు. 20 ఏళ్లుగా సిల్ట్ తీయడం జరగలేదని, దీంతో వర్షం పడినప్పుడల్లా నివాసాలను వరద ముంచెత్తేదని పాత వీడియోలను చూపించారు. హైడ్రా అంటే అపోహలు తొలగిపోయాయి.. పనిచేసి చూపించేదే హైడ్రా అని రుజువైందని వివిధ బస్తీల ప్రతినిధులు అన్నారు. 10 రోజుల్లో రెండుసార్లు మా బస్తీలను సందర్శించి నాలా పూడిక తీత పనులను స్వయంగా పరిశీలించిన హైడ్రా కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. హైడ్రా సిబ్బంది కూడా అదే దీక్షతో పని చేసి మా సమస్యను పరిష్కరించారని, అందరికీ అభినందనలంటూ సభాముఖంగా కొనియాడారు.

ఇంగ్లండ్ గడ్డపై అత్యధిక సార్లు 4 వికెట్ల ఘనత

చరిత్ర సృష్టించిన మహమ్మద్ సిరాజ్

టీమిండియా స్టార్ పేసర్, హైదరాబాద్ డీఎన్‌పీ మహమ్మద్ సిరాజ్ చరిత్ర సృష్టించాడు. ఇంగ్లండ్ గడ్డపై అత్యధిక సార్లు 4 వికెట్ల ఘనతను అందుకున్న భారత బౌలర్‌గా నిలిచాడు. ఈ క్రమంలో అతను జస్‌ప్రీత్ బుమ్రా రికార్డ్‌ను అధిగమించాడు. ఇంగ్లండ్‌తో ఓవల్ వేదికగా జరుగుతున్న ఆఖరి టెస్ట్‌లో నాలుగు వికెట్లు తీయడం ద్వారా సిరాజ్(4/86) ఈ ఫీట్ సాధించాడు. అంతేకాకుండా వకార్ యూనిస్ తర్వాత ఇంగ్లండ్ గడ్డపై అత్యధిక నాలుగు వికెట్ల ఘనతను అందుకున్న ఆసియా బౌలర్‌గా కూడా నిలిచాడు.వకార్ యూనిస్ ఇంగ్లండ్ గడ్డపై 6 సార్లు నాలుగు వికెట్ల ఘనతను అందుకున్నాడు. సిరాజ్ ఐదు సార్లు నాలుగు వికెట్లు పడగొట్టగా.. బుమ్రా నాలుగు సార్లు నాలుగు వికెట్ల ఘనతను సాధించాడు.అంతర్జాతీయ క్రికెట్‌లో 200 వికెట్ల మైలురాయి అందుకున్న సిరాజ్.. ఈ క్రమంలో సచిన్ టెండూల్కర్‌ను అధిగమించాడు. టెస్ట్‌ల్లో 118 వికెట్లు తీసిన సిరాజ్.. వన్డేల్లో 71, టీ20ల్లో 14 వికెట్లు పడగొట్టాడు. మూడు ఫార్మాట్లలో కలిపి 203 వికెట్లను ఖాతాలో వేసుకున్నాడు. ఈ క్రమంలో సచిన్ టెండూల్కర్ 201 వికెట్ల రికార్డ్‌ను అధిగమించాడు. టెస్ట్‌ల్లో 46 వికెట్లు తీసిన సచిన్.. వన్డేల్లో 154, టీ20ల్లో ఓ వికెట్ పడగొట్టాడు.ఆఖరి టెస్ట్‌లో సిరాజ్ కీలక వికెట్లు పడగొట్టాడు. ఓలీ పోప్, జోరూట్, హ్యారీ బ్రూక్, జెమీ స్మిత్‌లను పెవిలియన్ చేర్చి ఇంగ్లండ్ పతనాన్ని శాసించాడు. ఈ సిరీస్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా కొనసాగుతున్నాడు. ఇప్పటి వరకు సిరాజ్ 9 ఇన్నింగ్స్‌ల్లో 17 వికెట్లు పడగొట్టాడు. అంతేకాకుండా ఈ సిరీస్‌లో అన్ని మ్యాచ్‌లు ఆడిన ఏకైక పేస్ బౌలర్ కూడా సిరాజే. ఇంగ్లండ్ తరఫున క్రిస్ వోక్స్ ఐదు టెస్ట్‌లు ఆడగా.. చివరి మ్యాచ్ మధ్యలోనే గాయంతో దూరమయ్యాడు.ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 224 పరుగులకు ఆలౌటవ్వగా.. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 247 పరుగులు చేసింది. 27 పరుగుల లోటు రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి 75/2తో నిలిచింది. క్రీజులో యశస్వి జైస్వాల్(51 బ్యాటింగ్)తో పాటు ఆకాష్ దీప్(4) ఉన్నాడు.

ఆకాష్ దీప్‌పై రికీ పాంటింగ్ ఆగ్రహం వ్యక్తం

టీమిండియా యువ పేసర్ ఆకాష్ దీప్‌పై ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. మైదానంలో వికెట్ తీసిన తర్వాత ఆకాష్ దీప్ వ్యవహరించిన తీరు సరైంది కాదన్నాడు. ఇంగ్లండ్‌తో ఓవల్ వేదికగా జరగుతున్న ఐదో టెస్ట్‌లో బెన్ డకెట్ ఔటైన తర్వాత ఆకాష్ దీప్ అతిగా ప్రవర్తించాడు. తన బౌలింగ్‌లో ఔటై పెవిలియన్ చేరుతున్న డకెట్ భుజాలపై చేతులు వేసి మరి ఏదో మాట్లాడాడు.సహజంగా బ్యాటర్ ఔటైన తర్వాత చాలా చికాకులో ఉంటాడు. ఇలాంటి సందర్భంలో బౌలర్ మందలించినా బ్యాటర్‌కు కోపం వస్తుంటుంది. అలాంటిది ఆకాష్ దీప్ ఎగతాళి చేస్తూ బెన్ డకెట్‌పై చేతులు వేసి మరి సెండాఫ్ ఇచ్చాడు. ఆకాష్ దీప్ చర్యకు ఏ మాత్రం సహనం కోల్పోని బెన్ డకెట్ మౌనంగానే మైదానం వీడాడు. అయితే ఈ చర్యను మాజీ క్రికెటర్లు తప్పుబడుతున్నారు. భారత మాజీ ఆటగాళ్లతో పాటు ఇతర దేశ ప్లేయర్లు కూడా ఆకాష్ దీప్‌పై విమర్శలు గుప్పిస్తున్నారు.ఈ ఘటనపై అధికారిక బ్రాడ్‌కాస్టర్‌తో మాట్లాడిన రికీ పాంటింగ్ ఘాటు వ్యాఖ్యలు చేశాడు. తానే బెన్ డకెట్ స్థానంలో ఉండి ఉంటే ఆకాష్ దీప్ చెంపలు వాయించేవాడినని తెలిపాడు. సంయమనం పాటించిన బెన్ డకెట్‌పై ప్రశంసల జల్లు కురిపించాడు. 'ఈ ఘటన చూసినప్పుడు నాకు వారు స్నేహితులై ఉండాలి లేదా ఇద్దరు కలిసి ఆడిన సందర్భమైనా ఉండాలని అనుకున్నాను. లోకల్ పార్క్ గేమ్‌లో తప్పా మరెక్కడా ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవు. నేనే బెన్ డకెట్ స్థానంలో ఉంటే ఆకాష్ దీప్ చెంపలు వాయించేవాడిని. కానీ బెన్ డకెట్ సంయమనం పాటించడం బాగుంది. సహజంగానే అతని ఆట అంటే నాకు చాలా ఇష్టం. తాజా ఘటనలో మౌనంగా ఉండటంతో అతను నాకు మరింత నచ్చాడు.'అని రికీ పాంటింగ్ చెప్పుకొచ్చాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 224 పరుగులకు ఆలౌటవ్వగా.. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 247 పరుగులు చేసింది. 27 పరుగుల లోటు రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి 75/2తో నిలిచింది. క్రీజులో యశస్వి జైస్వాల్(51 బ్యాటింగ్)తో పాటు ఆకాష్ దీప్(4) ఉన్నాడు.

రూట్ నుంచి అంతటి తీవ్ర ప్రతిస్పందనను ఊహించలేదు

- యశస్వీ, ఆకాశ్ సెంచరీ- అర్ధసెంచరీతో భారత్ ఆధిక్యం
- జడేజా, సుందర్ విధ్వంసక బ్యాటింగ్‌తో ఇంగ్లండ్‌కు భారీ లక్ష్యం
- ఇంగ్లండ్ బౌలర్లను చిత్తు చేసిన టీమిండియా బలమైన పునాది

జో రూట్ తో వాగ్వాదం పై ప్రసిద్ధ్ కృష్ణ క్లారిటీ
ఓవల్ టెస్టులో భారత యువ పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ, ఇంగ్లాండ్ బ్యాటర్ జో రూట్ మధ్య జరిగిన మాటల యుద్ధం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ప్రసిద్ధ్ కృష్ణ రూట్‌ను కవ్విస్తూ మాట్లాడటం, అందుకు రూట్ తీవ్రంగా స్పందించడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈ ఘటన ఒక వ్యూహంలో భాగమేనని, కానీ రూట్ అంతలా స్పందిస్తాడని తాను ఊహించలేదని ప్రసిద్ధ్ కృష్ణ తెలిపాడు. ఓవల్ టెస్టులో ఇంగ్లాండ్ బ్యాటింగ్ సమయంలో ప్రసిద్ధ్ కృష్ణ బౌలింగ్ వేస్తున్నప్పుడు జో రూట్ క్రీజులోకి వచ్చాడు. రూట్ ఇంకా పరుగులేమీ చేయకముందే, ప్రసిద్ధ్ కృష్ణ అతడిని ఉద్దేశించి కొన్ని మాటలు అన్నాడు. స్టంప్ మైక్‌లో ఆ మాటలు సరిగా వినబడలేదు కానీ, తాను రూట్‌తో మీరు మంచి ఫామ్‌లో ఉన్నారు అని చెప్పానని ప్రసిద్ధ్ కృష్ణ వివరించాడు. ఈ మాటలకు రూట్ కోపంతో బదులివ్వడం చూసి ప్రసిద్ధ్ కృష్ణ ఆశ్చర్యపోయాడు.ఈ ఘటన తర్వాత అంపైర్ కుమార్ ధర్మసేన జోక్యం చేసుకుని ప్రసిద్ధ్ కృష్ణతో మాట్లాడారు. అప్పుడు కెప్టెన్ శుభ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్ కూడా అంపైర్‌తో వాదించారు.

సుందర్ విధ్వంసం

ఓవల్ టెస్టులో అండర్సన్ టెండూల్కర్ ట్రోఫీ విజేతను నిర్ణయించే మ్యాచ్‌లో భారత జట్టు సమిష్టిగా రాణించి భారీ స్కోరు సాధించింది. ఇంగ్లండ్ బౌలర్లను చీల్చిచెండాడిన టీమిండియా, ప్రత్యర్థి ముందు 373 పరుగుల కొండంత లక్ష్యాన్ని ఉంచింది. మూడో రోజు ఓపెనర్ యశస్వీ జైస్వాల్ (118) సెంచరీతో అదరగొట్టగా, నైట్‌వాచ్‌మన్ ఆకాశ్ దీప్ (66) తొలి అర్ధ శతకంతో విజృంభించాడు. టీ సెషన్ తర్వాత రవీంద్ర జడేజా (53), వాషింగ్టన్ సుందర్ (53) విధ్వంసక అర్ధ శతకాలతో చెలరేగారు. జడేజా వెనుదిరిగినా, సుందర్ టెయిలెండర్లతో కలిసి సిక్సర్లతో హోరెత్తించి, జట్టు స్కోరును 390 దాటించాడు. పెద్ద షాట్‌కు యత్నించిన సుందర్, జోష్ టంగ్ ఓవర్లో మిడాన్‌లో క్రాలీకి చిక్కి ఔటయ్యాడు. దీంతో భారత్ రెండో ఇన్నింగ్స్ 88 ఓవర్లలో 396 వద్ద ముగిసింది.
మూడో రోజు ఓవర్‌నైట్ స్కోరు 75/2తో బ్యాటింగ్ ప్రారంభించిన భారత్, మ్యాచ్‌పై గట్టి పట్టు సాధించింది. రెండో రోజు 44 బంతుల్లో అర్ధ శతకం బాదిన యశస్వీ, మూడో రోజు కూడా అదే జోరును కొనసాగించాడు. ఆకాశ్ దీప్, నమ్మశక్యంకాని రీతిలో క్రీజులో నిలిచి, ఇంగ్లండ్ పేసర్ల ఎత్తుగడలను తిప్పికొట్టాడు. యశస్వీ స్లిప్‌లో బంతిని బౌండరీలకు పంపగా, ఫీల్డర్లు ఆశ్చర్యంతో తలపట్టుకున్నారు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 107 పరుగులు జోడించి బలమైన పునాది వేశారు. ఆకాశ్, జామీ ఓవర్టన్ ఓవర్లో బౌండరీతో తన తొలి టెస్టు అర్ధ శతకం పూర్తి చేశాడు. అతడు ఔటైన తర్వాత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (17) ఎక్కువసేపు నిలవలేదు. కరుణ్ నాయర్ (15) కూడా నిరాశపరిచాడు. అయితే, మాంచెస్టర్ హీరో జడేజా, ధ్రువ్ జురెల్ (34) బాధ్యతాయుతంగా ఆడి, ఏడో వికెట్‌కు 50 పరుగులు జోడించి ఆధిక్యాన్ని 300 దాటించారు. జురెల్, ఓవర్టన్ బౌలింగ్‌లో ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. అయినప్పటికీ, జడేజాతో కలిసి సుందర్ భారీ స్కోరు వైపు దూసుకెళ్లాడు. జడేజాను టంగ్ ఔట్ చేయగా, సుందర్ గేర్ మార్చి, టంగ్ ఓవర్లో రెండు ఫోర్లు, ఒక సిక్సర్‌తో ఫిఫ్టీ పూర్తి చేశాడు. రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 396/10 (88 ఓవర్లు) సాధించి, ఇంగ్లండ్ ముందు 373 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది.
చేజింగ్ ఆరంభించిన ఇంగ్లండ్, ఆకాశ్ దీప్ వేసిన తొలి ఓవర్లో ఒక పరుగు సాధించింది. జాక్ క్రాలీ (1), బెన్ డకెట్ (0) క్రీజులో ఉన్నారు.

కోహ్లీ రికార్డును బద్దలు కొట్టిన శుభ్‌మన్ గిల్

ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్ నుంచి టీమ్‌ఇండియా కెప్టెన్‌గా ఎంపికైన శుభ్‌మన్ గిల్.. ఆటగాడిగానూ తన ఆటతో రికార్డులు బద్దలు కొడుతున్నాడు. ఓవల్ వేదికగా జరుగుతున్న ఐదో టెస్టులో పరుగుల జాబితాలో భారత మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీని అధిగమించాడు. ప్రస్తుతం జరుగుతున్న అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీలో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ బ్యాటింగ్ ప్రదర్శన అసాధారణమైనది. ఈ సిరీస్‌లో గిల్ ఇప్పటివరకు 722 పరుగులు చేయగా.. యావరేజ్ 90గా ఉంది. ఎడ్జ్‌బాస్టన్‌లో జరిగిన ఒకే మ్యాచ్‌లో అతని రికార్డు బద్దలు కొట్టిన 430 పరుగులు చేసి.. అలన్ బోర్డర్‌తో పాటు రెండు ఇన్నింగ్స్‌లలో 150 కంటే ఎక్కువ పరుగులు చేసిన రెండవ కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ నిలిచాడు. ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో భారతదేశం తరపున కెప్టెన్‌గా అత్యధిక పరుగులు చేసిన విరాట్ కోహ్లీ 2016 రికార్డును కూడా గిల్ బద్దలు కొట్టాడు. ఒకే సిరీస్‌లో అతను నాలుగు సెంచరీలు సాధించి, సునీల్ గవాస్కర్, డాన్ బ్రాడ్‌మాన్ వంటి దిగ్గజాల రికార్డులను సమం చేశాడు.ఈ సిరీస్‌లో గిల్ ఫామ్ భారతదేశానికి చాలా కీలకంగా ఉంది. స్టార్ బ్యాట్స్‌మన్ కేఎల్ రాహుల్‌తో కలిసి, విదేశాల్లో టెస్ట్ సిరీస్‌లో 500 కంటే ఎక్కువ పరుగులు చేసిన తొలి భారతీయ పార్ట్‌నర్స్‌గా నిలిచారు. గత 50 ఏళ్లలో ఏ టీమ్‌ఇండియా బ్యాటింగ్ పార్ట్‌నర్స్ కూడా ఈ ఘనత సాధించలేదు. బ్యాటింగ్‌కు అనుకూలమైన పరిస్థితుల్లో బౌలర్లు ఇబ్బంది పడుతున్నప్పటికీ గిల్ నిలకడ భారతదేశాన్ని ఆటలో నిలిపాడు. ఇప్పుడు తాజాగా వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ పరుగుల జాబితాలో విరాట్ కోహ్లీని అధిగమించాడు కెప్టెన్ శుభ్‌మన్ గిల్.

అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

కామారెడ్డి, ఆగస్టు 2 (జనంసాక్షి):

రాబరీ దొంగతనాలకు పాల్పడిన అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాను కామారెడ్డి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. 2025 జూలై 25న భిక్నూర్ మండలం అంతంపల్లి గ్రామ శివారులోని రెడీమిక్స్ కంపెనీ వద్ద జరిగిన రాబరీ ఘటనకు సంబంధించి భిక్నూర్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నం. 263/2025 కింద కేసు నమోదైంది. అలాగే, జూలై 27న తలమడ్ల గ్రామ శివారులోని జెన్ అడ్వర్టైజ్‌మెంట్ కంపెనీలో జరిగిన దొంగతనం సంబంధించి క్రైమ్ నం. 112/2025 కింద మరో కేసు నమోదైంది. బాధితుల ఫిర్యాదుల ఆధారంగా భిక్నూర్ పోలీసులు సంఘటనా స్థలాలను పరిశీలించి, మూలధన ఆధారాలను సేకరించారు. జూలై 25 రాత్రి, అంతంపల్లి శివారులోని చెపాస్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ రెడీమిక్స్ కంపెనీలోకి చొరబడిన గుర్తుతెలియని నిందితులు, ఇద్దరు వాచ్‌మెన్‌లను బెదిరించి, ఒకరి నుండి సెల్‌ఫోన్, 11,000 రూపాయల విలువైన ఐరన్ రాడ్స్‌ను అపహరించారు. జూలై 27 రాత్రి, జెన్ అడ్వర్టైజ్‌మెంట్ కంపెనీలో 15,00,000 రూపాయల విలువైన వస్తువులను దొంగిలించారు.

జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు, ఏఎస్పీ బి. చైతన్యరెడ్డి పర్యవేక్షణలో, భిక్నూర్ సీఐ ఎమ్. సంపత్ కుమార్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ ఎన్. శ్రీనివాస్, భిక్నూర్ ఎస్ఐ డి. ఆంజనేయులు, సిసిఎస్ ఎస్ఐ ఎండి. ఉస్మాన్ తదితరులతో కూడిన ఐదు ప్రత్యేక బృందాలు విచారణ చేపట్టాయి. భిక్నూర్ టోల్‌గేట్ వద్ద ఒకరిని, కామారెడ్డిలో నలుగురిని, హైదరాబాద్‌లో ఒకరిని మొత్తం ఆరుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నేరాంగీకారం ఆధారంగా, హైదరాబాద్‌లో దాచిన దొంగతనం సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఈ రెండు కేసులతో పాటు, మాచారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన మరో నాలుగు దొంగతనాలను కూడా ఒప్పుకున్నారు, వాటికి సంబంధించిన సొత్తును స్వాధీనం చేసుకున్నారు.

అరెస్టైన నిందితులు: తానే అలీ (37, ఐస్‌క్రీమ్ తయారీదారు, కార్మికుడు, హైదరాబాద్, స్వస్థలం: హర్దోయ్, ఉత్తరప్రదేశ్), బిర్జేష్ అలీ (35, ఐస్‌క్రీమ్ తయారీదారు, కార్మికుడు, హైదరాబాద్, స్వస్థలం: హర్దోయ్), సల్మాన్ (23, ఐస్‌క్రీమ్ తయారీదారు, కామారెడ్డి, స్వస్థలం: హర్దోయ్), మొహమ్మద్ సమీర్ (33, ఐస్‌క్రీమ్ తయారీదారు, కామారెడ్డి, స్వస్థలం: హర్దోయ్), చాంద్ బాబు (17, బైక్ మెకానిక్, కామారెడ్డి, స్వస్థలం: హర్దోయ్), హసన్ ఖాన్ (21, స్క్రాప్ వ్యాపారి, హైదరాబాద్). స్వాధీనం చేసుకున్న వస్తువుల్లో దొంగతనానికి ఉపయోగించిన ఆటో, సెల్‌ఫోన్‌లు ఉన్నాయి. ఈ కేసును ఛేదించిన భిక్నూర్ సీఐ ఎమ్. సంపత్ కుమార్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ ఎన్. శ్రీనివాస్, కామారెడ్డి రూరల్ సీఐ ఎస్. రామన్, భిక్నూర్ ఎస్ఐ డి. ఆంజనేయులు, సిసిఎస్ ఎస్ఐ ఎండి. ఉస్మాన్, సిబ్బంది కిషన్, రాజావీరు, గణపతి, మైసయ్య, స్వామి, రాజేంద్రకుమార్, రవి, రజనీకాంత్, రాములు, కిషన్ గౌడ్, గడ్డం నరేష్, రాజేంద్రప్రసాద్, సంజీవ్ కుమార్, తిరుమల లక్ష్మీకాంత్, మేకల నరేష్‌లను జిల్లా పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు. అనుమానిత వ్యక్తులు లేదా అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

బీసీ రిజర్వేషన్లు సాధించే వరకు విశ్రమించేది లేదు

- బీసీ సంఘం రాష్ట్ర నాయకులు గుంజపడుగు హరిప్రసాద్ మీడియా సమావేశం

కరీంనగర్ జిల్లా బ్యూరో, ఆగస్టు 02 (జనంసాక్షి) :

కరీంనగర్ జిల్లాలో బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు గుంజపడుగు హరిప్రసాద్ నేతృత్వంలో జరిగిన మీడియా సమావేశంలో స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగ రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత ఆగస్టు 4, 5, 6 తేదీల్లో ఇందిరా పార్క్ వద్ద చేపట్టనున్న 72 గంటల నిరాహార దీక్షకు కరీంనగర్ జిల్లా బీసీ కులాలు పూర్తి మద్దతు ప్రకటించి, పోస్టర్ ఆవిష్కరించారు. హరిప్రసాద్ మాట్లాడుతూ, స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి బీసీలకు కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు అన్యాయం చేశాయని, రెండు పార్టీలూ కక్షపూరితంగా బీసీలను అణచివేశాయని విమర్శించారు. కాకా కాలేల్కర్ కమిషన్ నివేదికను బహిర్గతం చేయకుండా కాంగ్రెస్ అణచివేసిందని, మొరార్జీ దేశాయ్ హయాంలో మండల్ కమిషన్ నివేదికను అమలు చేయకుండా బీసీల అభివృద్ధిని అడ్డుకున్నారని ఆరోపించారు. బీజేపీ కూడా మండల్ ఉద్యమాన్ని కమాండల్ ఉద్యమంతో అడ్డుకుని బీసీలకు అన్యాయం చేసిందన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కై రేవంత్ రెడ్డి, మోదీలు బీసీ రిజర్వేషన్ బిల్లును అడ్డుకుంటున్నారని, రేవంత్ రెడ్డి ఢిల్లీలో బీసీ బిల్లు గురించి ప్రస్తావించలేదని మండిపడ్డారు. తమిళనాడులో జయలలిత మూడు నెలలు పోరాడినట్లు, రేవంత్ కూడా ఢిల్లీలో బీసీ బిల్లు కోసం ఉద్యమించాలని

కోరారు. ఎమ్మెల్సీ కవిత బీసీల కోసం చేపట్టిన 72 గంటల నిరాహార దీక్షకు ప్రతి బీసీ బిడ్డ భారీ సంఖ్యలో హాజరై మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. యుపిఎఫ్ రాష్ట్ర కో-కన్వీనర్ కుమారస్వామి మాట్లాడుతూ, కవిత బీసీ రిజర్వేషన్ బిల్లు సాధన కోసం నిరవధిక దీక్షకు సిద్ధమయ్యారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేందుకు ఈ ఉద్యమం లక్ష్యంగా పెట్టుకున్నారని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీల తీరును తప్పుబట్టిన కవిత, బీసీలకు రాజ్యాధికారంలో వాటా కోసం పోరాడుతున్నారని, ఈ పోరాటానికి బీసీ కులాలు పూర్తి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కనకయ్య, శ్రీనివాస్, కలర్ సత్తన్న గౌడ్, తూల భాస్కర్ రావు, పరశురాం గౌడ్, అనీల్ యాదవ్, పుదరి రాజేశ్వరి గౌడ్, శివరాణి, సంధ్యరాణి, మేకల అంజనేయులు, రత్నాకర్, రాజీ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
3 ఆగస్టు 2025

దందాకు పాల్పడుతున్న ఐవీఎఫ్ సెంటర్లపై కఠిన చర్యలు

- ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులకు మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలు

హైదరాబాద్ (జనంసాక్షి) : మాతృత్వం కోసం తపిస్తున్న దంపతుల ఆశను ఆసరాగా చేసుకుని, ఐవీఎఫ్, సరోగసిని వ్యాపారంగా మార్చి దందాకు పాల్పడుతున్న ఐవీఎఫ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. సృష్టి తరహా ఘటనలు పునరావృతం అవకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఐవీఎఫ్ క్లినిక్‌లలో తనిఖీలు, నియంత్రణ కోసం ఉన్నతాధికారులతో కమిటీని నియమించాలని హెల్త్ సెక్రటరీకి మంత్రి సూచించారు. ఈ మేరకు హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ నేతృత్వంలో ఆరోగ్యశ్రీ సీఈవో, మెడికల్ ఎడ్యూకేషన్ డైరెక్టర్ సభ్యులుగా కమిటీని నియమిస్తూ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీ నేతృత్వంలో ప్రైవేటు ఐవీఎఫ్ సెంటర్లలో తనిఖీలు నిర్వహించనున్నారు. ఆయా సెంటర్లపై ఇదివరకే నమోదైన కేసుల వివరాలు సేకరించనున్నారు. ఆయా సెంటర్ల అనుమతులు, రిజిస్ట్రేషన్ల వ్యాలిడిటీ వంటి అంశాలను పరిశీలించనున్నారు. ఈ ప్రక్రియను పది రోజుల్లో పూర్తి చేసి, నివేదిక అందించాలని కమిటీని ప్రభుత్వం ఆదేశించింది.

ట్రంప్ చెంప చెళ్లుమనిపించిన ఏఐ

- డెడ్ ఎకానమీ అంటూ చేసిన ప్రకనటపై ఏఐ దిమ్మతిరిగే సమాధానం
- భారత్ ఆర్థిక వ్యవస్థ పురోగమిస్తోందని జవాబు

న్యూయార్క్, ఆగస్ట్2 (జనంసాక్షి) : ప్రస్తుత సాంకేతిక యుగంలో ఓపెన్ ఏఐ, చాట్‌జీపీటీ- వంటి వాటికి ప్రత్యేక ఆదరణ ఉంది. ఎలాంటి ప్రశ్నలకైనా ఈ కృత్రిమ మేధస్సు ప్లాట్‌ఫామ్‌లు సమాధానం చెబుతున్నాయి. తాజాగా ట్రంప్ భారత ఆర్థిక వ్యవస్థపై చేసిన వ్యాఖ్యలపై ఇవి నిర్మొహమాటంగా ట్రంప్ చెంప ఛెళ్లుమనేలా సమాధానం ఇచ్చాయి.భారత ఆర్థిక వ్యవస్థ పతనమైందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల తీవ్ర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఇదే ప్రశ్నను పలు ఏఐ ప్లాట్‌ఫామ్‌లను అడగ్గా.. అవి చెప్పిన సమాధానాలు ట్రంప్ మూర్ఖత్వాన్ని తెలియచేశాయి. భారత్‌ది డెడ్ ఎకానమీయా? అని ఐదు ప్రధాన అమెరికన్ ఏఐ ప్లాట్‌ఫామ్‌లను ప్రశ్నించగా.. వాటి సమాధానాలు ట్రంప్ వ్యాఖ్యలకు విరుద్ధంగా ఉన్నాయి. భారత ఆర్థికవ్యవస్థ పతనం కాలేదు. అది డైనమిక్. ఎంతో ప్రతిష్టాత్మకమైనది' అని చాట్‌జీపీటీ పేర్కొంది. భారత్‌ది డెడ్ ఎకానమీ కాదు. ప్రపంచవ్యాప్తంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో ఒకటని గ్రోక్ వెల్లడించింది. భారత ఆర్థిక వ్యవస్థ బలంగా వృద్ధి చెందుతుంది' -జెమిని తెలిపింది. ఇక, మెటా ఏఐ, కోపైలట్ లు కూడా ఇలాంటి సమాధానాలే ఇచ్చాయి. రష్యాతో వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తుందనే కారణంతో భారత్‌పై 25శాతం సుంకం, పెనాల్టీలు విధిస్తున్నట్లు- ట్రంప్ ప్రకటించారు. దీన్ని ప్రకటించిన కొన్ని గంటల్లోనే మన ఆర్థిక వ్యవస్థను ఉద్దేశిస్తూ తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. రష్యా, భారత్.. వాటి డెడ్ ఎకానమిలను మరింత దిగజార్చుకునే అవకాశముందన్నారు. వారు ఎలాంటి వాణిజ్య సంబంధాలు కుదుర్చుకున్నా పట్టించుకోనన్నారు. ఈ వ్యాఖ్యలను భారత్ తోసిపుచ్చింది. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. మరోవైపు, ట్రంప్ మాటలను లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సమర్థించారు. ట్రంప్ చెప్పింది వాస్తవమేనని, ఆ విషయాన్ని ప్రధాని, ఆర్థిక మంత్రికి తప్ప అందరికీ తెలుసని ఎద్దేవా చేశారు. దేశ ఆర్థిక, రక్షణ, విదేశాంగ విధానాన్ని భాజపా నేతృత్వంలోని ప్రభుత్వం నాశనం చేసిందని ఆరోపించారు. అయితే, రాహుల్ వ్యాఖ్యలను సొంత పార్టీ నేతలు సైతం తప్పుబట్టడం గమనార్హం. ఈ క్రమంలో ఎఐ సమాధానాలు ట్రంప్‌కు, రాహుల్‌కు చెంపపెట్టులాంటివే.

యువతను క్రీడల వైపు మళ్లిస్తున్నాం

- అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దేయత్నం
- మంత్రి వాకిటి శ్రీహరి వెల్లడి

హైదరాబాద్, ఆగస్ట్2 (జనంసాక్షి) : యువతను క్రీడల వైపు మళ్ళిస్తూ ,అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చి దిద్దుటకు తెలంగాణ క్రీడల పాలసీని తీసుకురావడం జరిగిందని రాష్ట్ర క్రీడల యువజన సర్వీసుల పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. శనివారం హెచ్‌ఐసీసీలో ఫస్ట్ ఎడిషన్ తెలంగాణ స్పోర్ట్స్ కన్ క్లేవ్ కార్యక్రమంలో రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసులు పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలోనే కొత్తగా స్పోర్ట్స్ పాలసీని అమలు చేస్తూ అన్ని క్రీడలకు సముచిత స్థానం కల్పిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకువచ్చిన ఈ పాలసీ ద్వారా క్రీడలు ఎంతగానో అభివృద్ధి చెందుతాయని అన్నారు. క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ వాటి ప్రాముఖ్యతను పెంచే విధంగా నూతన క్రీడా విధానం అమలు చేస్తూ అమలు చేయుటలో పని చేస్తామని మంత్రి తెలిపారు. ఈ పాలసీ అమలులో గతంలో క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులు, దీర్ఘకాలంగా క్రీడల్లో ఉన్న వారు, క్రీడల్లో నైపుణ్యం ప్రదర్శించే వారికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా ప్రారంభిస్తున్న క్రీడల పాలసీ క్రీడల అభివృద్ధి కొరకు క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికి తీయుటకు దోహదపడుతుందని మంత్రి తన అభిప్రాయాన్ని తెలిపారు. ఈ పాలసీలో పొందుపరిచిన జాతీయ, అంతర్జాతీయ క్రీడల నిర్వహకుల సహాయ సహకారాలు తీసుకొని ఆ స్థాయిలో క్రీడల అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని మంత్రి అన్నారు. 2036లో జరిగే ఒలింపిక్స్ ను లక్ష్యంగా చేసుకొని క్రీడాకారులకు ఆయా క్రీడలలో శిక్షణ ఇప్పించడం జరుగుతుందని, తమ ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచే విధంగా క్రీడాకారులకు విధి విధానాలను కల్పిస్తూ ఈ పాలసీకి రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ చూపారని మంత్రి తెలిపారు. తమ ప్రభుత్వం బడ్జెట్లో క్రీడలకు ఎక్కువ నిధులు కేటాయించిందని, క్రీడల స్టేడియాలకు, క్రీడాకారుల వసతులకు, వసతులకు క్రీడాకారులకు కల్పించే మౌలిక వసతులకు అధిక నిధులు కేటాయిం చామని తెలిపారు. ఈ సమావేశంలో స్పోర్ట్స్ అథారిటీ- చైర్మన్ శివసేనారెడ్డి, అడ్వైజర్ జితేందర్ రెడ్డి, మాజీ మంత్రి వేణుగోపాల చారి, స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జయేశ్ రంజన్, వైస్ ఛైర్మన్, ఎం.డి. సోనీ బాల, గోపిచంద్ అకాడమీ ఫౌండర్ పుల్లెల గోపీచంద్, ప్రముఖ క్రీడాకారులైన గగన్ నారంగ్, అంజు బాబి జార్జ్, సుమిత్ పాండే, అభినవ్ బింద్రా, రవికాంత్ రెడ్డి, నీలం బాబర్ దేశాయ్, తతగత ముఖర్జీ, సబనాయకన్ విశ్వనాథ్, అడిళ్ళ సుమరివాల పాల్గొన్నారు.

సమగ్ర పాలసీతోనే చెరువులు, కుంటల అభివృద్ధి

- ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో సమావేశమైన రైతు కమిషన్
- చెరువులు, కుంటల పరిరక్షణ, గ్రౌండ్ వాటర్ పెంపుకు చేపట్టాల్సిన అంశాలపై చర్చ
- రైతు కమిషన్ ఆధ్వర్యంలో త్వరలో సమావేశం ఏర్పాటు

హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్ర సచివాయలంలో ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో రైతు కమిషన్ భేటీ అయ్యింది. ఈ భేటీలో కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు రాములు నాయక్, గడుగు గంగాధర్, భవానీ రెడ్డి వున్నారు. ఇప్పటి వరకు రైతు కమిషన్ చేసిన కార్యక్రమాలను వివరించడంతో పాటు రాష్ట్రంలో చెరువులు, కుంటల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలపై మంత్రికి కమిషన్ సూచనలు చేసింది. మైనర్ ఇరిగేషన్ కింద ఉన్న చెరువులు, కుంటల పరిరక్షణకు వెంటనే నీటి నిర్వహణ కమిటీలను ఏర్పాటు చేయాలనీ చెప్పింది. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో కూడా నీటి సంఘాలు వున్న అంశాన్ని గుర్తుచేసింది. గ్రామీణ స్థాయిలో రైతులు సంఘటితమై చెరువులను కాపాడుకునే వారని, ఐతే గత పదేండ్ల కాలంలో రాష్ట్రంలో ఉన్న చెరువులు కుంటలు అన్యాక్రాంతమయ్యాయని వివరించింది. కొన్ని చోట్ల కబ్జాదారులు ఆక్రమించి లే ఔట్లు వేయడం, వాటర్ బాడీస్ కు వచ్చే క్యాచ్ మెంట్ ఏరియాల్లో భారీగా కాల్వలు దెబ్బతినడం, మాయమవడం జరిగాయని వివరించింది. ఐతే ప్రధానంగా చెరువులు కుచించుకపోవడం, గ్రౌండ్ వాటర్ లెవల్స్ పడిపోవడం జరిగిందని వివరించింది. రాష్ట్రంలో చెరువులు కాపాడుకుపడానికి సమగ్రమైన పాలసీ ఉండాలని రైతు కమిషన్ తెలిపింది. ఆ పాలసీని కమిషన్ తయారు చేయనున్నట్లు వివరించింది. నిపుణులతో పాలసీ కి సంబంధించి ప్రసెంటేషన్ మీటింగ్ త్వరలో కమిషన్ ఏర్పాటు చేయనున్నట్లు.. ఆ సమావేశానికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హాజరుకావాలని కమిషన్ కోరింది. కమిషన్ ఆహ్వానం కు మంత్రి ఉత్తమ్ సానుకూలంగా స్పందించినట్లు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

సొంత లాభం కోసం లక్షకోట్లు వృధా చేసిన కేసీఆర్

రాజనర్సింహ, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడారు. తనకి ఇష్టం ఉన్న చోట కాళేశ్వరం ప్రాజెక్టు కట్టాలని కేసీఆర్ ఆదేశాలు ఇచ్చారని చెప్పుకొచ్చారు. రెండే పిల్లర్లు కుంగాయని బీఆర్ఎస్ నేతలు అంటున్నారని...ఇది సామాన్య విషయమా..? అని ప్రశ్నించారు. ఫార్ములా ఈ కారు రేస్‌లో మాజీ మంత్రి కేటీఆర్ అవినీతికి పాల్పడలేదా..? అని నిలదీశారు. ప్రభుత్వ సొమ్ము తిన్న వాళ్లు కక్కక తప్పదని మహేష్ కుమార్ గౌడ్ హెచ్చరించారు. మాజీ సిఎం కెసిఆర్ సొంత లాభం మాత్రమే చూసుకున్నారని తెలిపారు. కెసిఆర్ దోషి అని కాళేశ్వరం కమిషన్ తేల్చిందని అన్నారు. ఇతర పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకున్న నియోజక వర్గాల్లో ఇబ్బందులు ఉన్నాయని, ప్రతిపక్షాల కుట్రల వల్ల వేరే పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకు న్నామని తెలియజేశారు. కాంగ్రెస్‌లో గ్రూపులు సహజం.. పార్టీలో గ్రూపులు ఉండాలని, ఎన్నికల సమయానికి అందరూ పార్టీ కోసం పోరాడాలని సూచించారు. గ్రూపుల వల్ల నష్టం జరగకుండా చూసుకునే బాధ్యత తమది అని హోవిరీ ఇచ్చారు. కెసిఆర్ కుటుంబం అబద్ధాల పుట్టని, బిఆర్ఎస్ చేతగాని తనం వల్ల బనకచర్ల ప్రాజెక్టుకు ఎపి ప్రభుత్వం సిద్ధమైందని మండిపడ్డారు. తమ ఫిర్యాదు వల్లే బనకచర్ల ప్రాజెక్టు పనులు ఆగాయని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

బీసీ రిజర్వేషన్ల కోసం సంఘటితంగా పోరాడాలి

- తెలంగాణ జన సమితి రౌండ్ టేబుల్ సమావేశంలో వి. హనుమంతరావు పిలుపు

హైదరాబాద్ (జనంసాక్షి) : స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకై బీసీలందరూ సంఘటితంగా పోరాటం చేయడమే ఏకైక మార్గమని మాజీ రాజ్యసభ సభ్యుడు వి. హనుమంతరావు అన్నారు. తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో ఈ సమావేశానికి డాక్టర్ నిజ్జన రమేష్ ముదిరాజ్ అధ్యక్షత వహించారు. శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నో సంవత్సరాలుగా చేస్తున్న డిమాండ్ నెరవేరే అవకాశం ఇప్పుడు దగ్గర్లో ఉందని, కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఇచ్చిన మాట ప్రకారం కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నా, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దీనిని అడ్డుకుంటోందని ఆరోపించారు. బీసీలకు వచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలంటే, తెలంగాణ రాష్ట్రంలోని బీసీలందరూ ఏకమై, ఒకే నినాదంతో ముందుకు రావాలని సూచించారు.

తెలంగాణ జన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.ఎల్. విశ్వేశ్వరరావు మాట్లాడుతూ 42 శాతం బీసీలకు రిజర్వేషన్ల అమలు కోసం ముందుకు రావాల్సిన రాజకీయ పార్టీలు రెండు నాలుకల ధోరణి అవలంబించడం సిగ్గుచేటన్నారు.

తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, బీసీ అయిన కేంద్రమంత్రి బండి సంజయ్ 'తొండి సంజయ్'లా మాట్లాడుతున్నాడని తీవ్ర విమర్శలు చేశారు. బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్ మాట్లాడుతూ, బీజేపీ పార్టీ అగ్రవర్ణాల పార్టీ అని ఆరోపించారు. బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షులు దాస్ సురేష్ మాట్లాడుతు కాంగ్రెస్ పార్టీ 42% రిజర్వేషన్ లు ఇస్తామంటే బిజెపి పార్టీ మద్దుతు ఇవ్వకుండా మోసం చేస్తున్నది పార్లమెంట్ సమావేశం లో బిల్లు ను ప్రవేశ పెట్టాలని లేకపోతే రాబోయే రోజులు బీసీ లు గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. టీజెస్ పార్టీ ఈ రౌండ్ టేబుల్ సమావేశం లో తీర్మానం ప్రవేశ పెట్టారు ప్రస్తుత పార్లమెంట్ సమావేశం లలో తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన 42% బీసీ ల రిజర్వేషన్ ల బిల్లు ను ప్రవేశ పెట్టి చట్టం చేసి తమిళ్ నాడు తరహా లో రాజ్యాంగం లో 9వ షెడ్యూల్ చేర్చి బీసీ లకు రాజ్యాంగ రక్షణ కల్పించాలని ఈ సమావేశం లో తీర్మానం చేశారు. గౌడ సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ అంబాల నారాయణ గౌడ్, బీసీ సంఘాల నేతలు గణేష్ చారి, లక్ష్మణ్ యాదవ్, బీసీ ఉద్యమ వేదిక రాష్ట్ర అధ్యక్షులు సాంబశివ గౌడ్, మద్దెల సంతోష్ ముదిరాజ్, శివ ముదిరాజ్, జార్జిరెడ్డి పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.నాగేశ్వర్ రావ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు మహేష్ యాదవ్ తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పల్లె వినయ్, ధర్మార్జున్, బైరి రమేష్, మహిళా జన సమితి రాష్ట్ర అధ్యక్షురాలు లక్ష్మి, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం. నరసయ్య, బీసీ జన సమితి అధ్యక్షుడు జస్వంత్, రైతు విభాగం అధ్యక్షుడు మోహన్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ధార సత్యం, వరంగల్ జిల్లా అధ్యక్షుడు జావేద్, నల్గొండ జిల్లా అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, హైదరాబాద్ నగర ప్రధాన కార్యదర్శి బట్టల రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణలో నా ఓటు గల్లంతయ్యింది

విపక్షాలు తీవ్రంగా మండిపడు తున్నాయి. తాజాగా ఆర్జేడీ నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ స్పందిస్తూ.. ఈ ముసాయిదా జాబితాలో తన పేరే లేదని ఆరోపించారు. పట్నాలో జరిగిన విరీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. నా ఈపీఐసీ నంబరుతో ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో చెక్ చేశా. ఈ ముసాయిదా జాబితాలో నా పేరు కన్పించలేదు. ఇక నేను ఎన్నికల్లో ఎలా పోటీ చేయాలి? స్వయంగా బూత్ లెవల్ అధికారి నావద్దకు వచ్చి ఫామ్ తీసుకెళ్లారు. అయినా నా పేరు జాబితాలో లేదని తేజస్వీ వెల్లడిరచారు. ప్రత్యేక సమగ్ర సవరణ పక్రియ అనంతరం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి దాదాపు 20వేల నుంచి 30వేల వరకు ఓటర్లను తొలగించాలని ఆర్జేడీ నేత ఆరోపించారు. మొత్తంగా రాష్ట్రంలో దాదాపు 65 లక్షల ఓటర్లను తొలగించారని పేర్కొన్నారు. అయితే, తేజస్వీయాదవ్ చేసిన ఆరోపణలను కేంద్ర ఎన్నికల సంఘం ఖండిరచింది. ముసాయిదా జాబితాలో ఆయన పేరు ఉందని పేర్కొంది. అందుకు సంబంధించిన కాపీని కూడా విడుదల చేసింది. ఆర్జేడీ నేత బహుశా తన పాత ఈపీఐసీ నంబరుతో చెక్ చేసుకుని ఉంటారని, అందుకే ఆయన పేరు జాబితాలో కన్పించకపోయి ఉండొచ్చని ఈసీ తెలిపింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పూర్తవటంతో ఈసీ ఈ ముసాయిదా జాబితాను రూపొందించింది. జాబితా నుంచి 65 లక్షల మందిని తొలగించడంతో ఓటర్ల సంఖ్య 7.93 కోట్ల నుంచి 7.28 కోట్లకు తగ్గింది. దీనిపై అభ్యంతరాలు తెలిపేందుకు సెప్టెంబరు 1 వరకు ఈసీ గడువు కల్పించింది. బిహార్‌లో ఈ ఏడాది చివర్లో అసెంబ్లీ ఎన్నికలు జరగ నున్నాయి.

శ్రీశైలం వద్ద తగ్గుతున్న వరద ప్రవాహం

నంద్యాల, ఆగస్ట్2 (జనంసాక్షి) : శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం క్రమంగా తగ్గుతోంది. మరోవైపు సాగర్ వద్ద కృష్ణమ్మ పరుగులు పెడుతోంది. శ్రీశైలం వద్ద నీరు తగ్గడంతో ఒక గేటు మూసివేసి.. ఏడు గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల, సుంకేసుల ప్రాజెక్టుల నుంచి శ్రీశైలానికి 2,74,254 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. ఇక్కడి నుంచి ఔట్ ఎ÷-లో 2,73,632 క్యూసెక్కులుగా ఉంది. 7 స్పిల్ వే గేట్ల ద్వారా 1,87,530 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ నుంచి 20,000 క్యూసెక్కులు, ఎడమ గట్టు- విద్యుత్ కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు- విద్యుత్ కేంద్రం నుంచి 30,787 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 882.20 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థం 215.80 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 200.19 టీఎంసీలుగా నమోదైంది.

కరీంనగర్ 'కార్పొరేషన్'లో నిధులు గోల్‌మాల్

- అవినీతి అక్రమాలకు అడ్డాగా నగర పాలక సంస్థ
- 'కలెక్షన్ కింగ్స్'గా టౌన్‌ప్లానింగ్ అధికారులు
- ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అనుమతుల కోసం అధికారుల వసూళ్లు
- మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ సంచలన ఆరోపణలు

కరీంనగర్ జిల్లా బ్యూరో, ఆగస్టు 02 (జనంసాక్షి) : కరీంనగర్ జిల్లాలోని ఎల్ఆర్ఎస్ నిధుల దుర్వినియోగం, అధికారుల అవినీతిపై కరీంనగర్ మాజీ మేయర్, తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ సంచలన ఆరోపణలు చేశారు. అధికార కాంగ్రెస్ పార్టీ ఎలాగైనా రాష్ట్ర ప్రజలను, కరీంనగర్ ప్రజలను మోసం చేసి డబ్బు వసూళ్లకు కుట్రలకు పాల్పడుతుందని అన్నారు. జిల్లాలో ఎల్ఆర్ఎస్‌కు దాదాపుగా 39వేలకుపైగా దరఖాస్తు చేసుకున్నారని, దీంట్లో 24వేల మందికి మున్సిపల్ అధికారులు ఫీజులు చెల్లించాలని నోటీసులు పంపించారని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 8వేలకుపైగా ఫీజులు చెల్లిస్తే కేవలం 4వేల దరఖాస్తులకు మాత్రమే ప్రోసిడింగ్ పత్రాలు ఇవ్వడమేంటన్నారు. ఎల్ఆర్ఎస్‌కు ప్రజలు 40 కోట్ల 69 లక్షలు రూపాయలు చెల్లించారని, కానీ మున్సిపల్ కార్పొరేషన్ అకౌంట్లో అవి జమ చేయలేదని సర్దార్ రవీందర్ సింగ్ ఆరోపించారు. జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు ఎన్నోసార్లు కలిసి జిల్లాలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై, నిధుల మళ్లింపుపై ఫిర్యాదులు చేసినా ఫలితం లేదని వాపోయారు. కరీంనగర్ ప్రజలు ఎల్ఆర్ఎస్‌కు చెల్లించిన డబ్బులు వెంటనే వాళ్ళ డివిజన్ల అభివృద్ధి కోసం మాత్రమే ఉపయోగించాలని డిమాండ్ చేశారు. డబ్బును దోచుకోవడంలో భాగంగానే ఎల్ఆర్ఎస్‌కు ఇరిగేషన్ అనుమతులు పెడుతున్నారని మండిపడ్డారు. ఇరిగేషన్ సహా రెవెన్యూ శాఖ అనుమతి కూడా పొందాలని చెప్పడమంటే కక్షసాధింపేనని అభిప్రాయపడ్డారు. వీటి అనుమతులు పొందేందుకు 10వేల నుంచి 20వేల రూపాయలకుపైగా అధికారులు వసూళ్లకు పాల్పడుతున్నారని చెప్పారు. టౌన్ ప్లానింగ్ అధికారులు "కలెక్షన్ కింగ్స్"గా మారారని, తమ కార్యాలయాల్లో అందుబాటులో ఉండకుండా హోటల్లో డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

వర్షాకాలంలో పురాణ ఇండ్లను కూలగొడతామని నోటీసులు ఇచ్చి, ప్రజలతో బేరాలు మాట్లాడుకుంటున్నారని సర్దార్ రవీందర్ సింగ్ తెలిపారు. జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ సంతకాలతో ఇచ్చిన నోటీసులపై కూడా అధికారులు అవినీతికి పాల్పడుతుంటే జిల్లా ఉన్నతాధికారులకు పట్టింపులేదా అని ప్రశ్నించారు. ఏ ఒక్క మంత్రి కూడా వీటిపై స్పందించడం లేదని వాపోయారు. ఎల్ఆర్ఎస్ నిధులు కేవలం కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి కోసమే ఉపయోగించాలని, నగరంలోని అవినీతిపై విజిలెన్స్, ఏసీబీ విచారణ చేపట్టాలని సర్దార్ రవీందర్ సింగ్ డిమాండ్ చేశారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370